Pubilshed from Kadapa
PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




కడప KADAPA | సంపుటి : 02 | సంచిక : 230 | ఆదివారం | జూన్ 28, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 02 | Issue No : 230 | Sunday | 28 JUNE 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# నాదీ గ్యారెంటీ

## నిర్వాసితులకు న్యాయం చేస్తాం... వెలిగొండ పూర్తి చేస్తాం...

- ఆర్థిక ఇబ్బందులున్నా... ప్రాధాన్యతల వారీగా ప్రాజెక్టులు పూర్తి
- వెలిగొండ ఫేజ్-1 ద్వారా ఈ సీజన్‌కే నీళ్లు
- కులాలు చూడొద్దు... అభివృద్ధి చూడండి... ఎన్డీఏకు సహకరించండి
- వెలిగొండ ప్రాజెక్టు పరిధి రైతులు, నిర్వాసితులతో సమావేశంలో సీఎం చంద్రబాబు
- 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్ల ఆర్ అండ్ ఆర్ నిధుల చెక్కును అందించిన ముఖ్యమంత్రి
- వెలిగొండ పనులను వేగంగా జరిపిస్తున్నారంటూ మంత్రి నిమ్మలకు సీఎం కితాబు

ప్రజాభూమి ప్రతినిధి,మార్కాపురం :

ప్రాజెక్టులకు భూములిచ్చి సహకరిస్తున్న రైతులు, నిర్వాసితులు ఆనందంగా ఉండేలా చూడడం ప్రభుత్వాల బాధ్యత అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తాము పాలన చేపడుతున్నామని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని.. అలాగే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని.. ఇందుకు తనది గ్యారెంటీ అంటూ ముఖ్యమంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా గంటవానిపల్లెలో వెలిగొండ ప్రాజెక్టు పనుల్ని పరిశీలించారు.



పనులు జరుగుతున్న తీరును అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు, నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 2,351 మంది నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం రూ.300 కోట్ల విలువైన చెక్కును ముఖ్యమంత్రి అందించారు. ప్రాజెక్టు పరిధిలోని రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు చరిత్ర...

- మిగతా 2లో..



## ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లకు ఉగ్రవాద ముప్పు

న్యూఢిల్లీ : రాబోయే రోజుల్లో దేశ రాజధాని ఢిల్లీలోనూ, ఉత్తరాఖండ్‌లో కీలక ప్రదేశాల్లో ఖలిస్తానీ ఉగ్రవాదులు దాడులు జరిపే అవకాశం ఉందని నిఘా సంస్థలకు సమాచారం అందింది. దీంతో ఈ రెండు రాష్ట్రాలలో నిఘా సంస్థలు భద్రతా హెచ్చరికలు జారీ చేశాయి. నిఘా సంస్థల సమాచారం ప్రకారం.. ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లలో దేవాలయాలు, రైల్వే స్టేషన్లు, పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ సంస్థల్ని, కీలక రాజకీయ నేతల్ని లక్ష్యంగా

- మిగతా 2లో..

### 85 వేల అక్కచెల్లెమ్మల జీవితాలతో చంద్రబాబు

# చెలగాటం ఆడుతున్నారు



- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మధ్యాహ్న భోజనం వండుతున్న వారి జీవితాలతో చంద్రబాబు ఆడుకుంటున్నారన్న జగన్
- స్మార్ట్ కిచెన్స్ పేరుతో వారిని రోడ్డున పడేసే కుట్ర చేస్తున్నారని మండిపాటు
- వారికి బకాయి పెట్టిన జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : గవర్నమెంటు స్కూళ్లలో మధ్యాహ్న భోజనం వండుతున్న దాదాపు 85 వేల మంది అక్కచెల్లెమ్మల జీవితాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. దాదాపు 20 ఏళ్లకు పైబడి పనిచేస్తున్నవారు, వీరిలో చాలామంది ఉన్నారని...

ఇప్పుడు, స్మార్ట్ కిచెన్స్ పేరుతో తన పార్టీవారి పొట్టలు నింపుతూ, అక్కచెల్లెమ్మలను మాత్రం రోడ్డున పడేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగా ఇప్పుడు వారికి ఇవ్వాల్సిన జీతాలు గత రెండు నెలలుగా బకాయిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మధ్యాహ్న భోజనం కార్మికులకు

- మిగతా 2లో..

## ఆంధ్రప్రదేశ్‌కు 'ఎల్లో అలర్ట్'..

- రాబోయే మూడు రోజులు ఏలూరు నుంచి ప్రకాశం వరకు భారీ వర్షాలు!

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ఆవర్తనం, కోస్తాంధ్ర నుంచి మహారాష్ట్ర వరకు విస్తరించిన ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి వర్షాలు జోరందుకోనున్నాయి. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. రానున్న రెండు మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే ముప్పు ఉండటంతో అధికారులు 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు.

2 పేజీలో..





## గొడ్డలి పార్టీ కుట్రలు ఇక సాగవు

- అమరావతి రైతుల ఆగ్రహానికి కారణం వైసీపీ ద్వంద్వ వైఖరే
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: అమరావతి విషయంలో రాష్ట్ర ప్రజలను, రైతులను మోసం చేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు మళ్లీ రైతుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. అమరావతి రాజధానిని ఐదేళ్ల పాటు నిర్వీర్యం చేసి, వేలాది మంది రైతుల

- మిగతా 2లో..

### భావోద్వేగభరితంగా

# వెలిగొండ నిర్వాసితులతో సీఎం ముఖాముఖి

### తమ కష్టాలను గుర్తించి...పరిష్కరిస్తుంది చంద్రబాబే అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్న నిర్వాసితులు

- పునరావాసం అడిగితే... అరెస్టులు చేశారంటూ నాటి పాలనను గుర్తు చేసుకున్న రైతులు
- పునరావసం అందుతుండడంతో పిల్లల భవిష్యత్తుపై భరోసా కలిగిందన్న నిర్వాసితులు
- తమ 30 ఏళ్ల కల నెరవేరుతోందంటూ సంతోషం వ్యక్తం చేసిన రైతులు
- నిర్వాసితుల త్యాగానికి తగ్గ ఫలితాలు అందించే బాధ్యత తనదంటూ ముఖ్యమంత్రి భరోసా

ప్రజాభూమి ప్రతినిధి, యర్రగొండపాలెం: మార్కాపురం జిల్లా దోర్నాల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించడం తోపాటు... ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులు, రైతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అయితే ఈ సమావేశం ఆసాంతం భావోద్వే గభరిత వాతావరణం మధ్య సాగింది.

- మిగతా 2లో..





# సాయికృష్ణ అదృశ్యం..

## వైసీపీ నేతలపై పవన్ కల్యాణ్ ఫైర్

- క్రిమినల్స్‌కు కులం అంటగట్టే సంస్కృతిని తీవ్రంగా ఖండించిన పవన్ కల్యాణ్
- యువతిపై అఘాయిత్యానికి పాల్పడిన సాయికృష్ణను వెనకేసుకురావడంపై మండిపాటు
- బీసీలు ఐక్యంగా ఉండి, అడిగే స్థితి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగాలని పిలుపు
- సంక్షేమం పేరుతో గత ప్రభుత్వం మౌలిక సదుపాయాలను నాశనం చేసిందని విమర్శ
- నిజమైన కార్యకర్తలను గుర్తించి, నాయకులుగా తీర్చిదిద్దేందుకే పార్టీ నిర్మాణ కమిటీలు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుల రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నేరస్థులకు, క్రిమినల్స్‌కు కులం రంగు పులిమి రాజకీయ ప్రయోజనం పొందాలని చూసే సంస్కృతిని తీవ్రంగా ఖండించారు. సాయికృష్ణ మిస్సింగ్ కేసును ప్రస్తావిస్తూ.. 14 ఏళ్ల అమ్మాయిని మూడు రోజుల పాటు గదిలో బంధించి హింసించిన ఓ కుర్రోడి అదృశ్యంపై కేసు నడుస్తోందని, ఓ క్రిమినల్‌కు కులం అంటగట్టి కొందరు ఎలా వెనకేసుకొస్తారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

"నిందితుడి తల్లి బాధను నేను అర్థం చేసుకోగలను. అది వేరు. కానీ, ఒక ప్రొఫెషనల్ క్రిమినల్‌లా ప్రవర్తించిన వ్యక్తికి ఎలా మద్దతిస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. కేవలం తమ కులానికి చెందినవాడనే కారణంతో ఒక నేరస్థుడికి మద్దతు పలకడం ఎంతవరకు సబబు అని నిలదీశారు. జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ తరహా దిగజారుడు రాజకీయాలను జనసేన సహించబోదని స్పష్టం చేశారు.

**వ్యవస్థను బ్రేక్ చేస్తాను కాబట్టే నాపై కోపం :** "ఒక క్రిమినల్‌కు కులం ఎలా అంటగడతారు? ఏ ప్రాతిపదికన అతడిని వెనకేసుకొస్తారు? మీ కులం అయితే సరిపోతుందా? మీ నాయకుడు ఎవరో చెబితే, మీరేంటో నేను చెబుతాను. బూతులు తిట్టేవాళ్లను, క్రిమినల్స్‌ను నాయకులుగా నమ్మితే సమాజానికి ఏం సందేశం ఇచ్చినట్టు?" అని పవన్ ప్రశ్నించారు.

2 పేజీలో..



### అమరావతి రైతులను పరామర్శించేందుకు వెళ్లారా లేక

# రౌడీయిజం చేసేందుకు వెళ్లారా?

- ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత
- వైసీపీ నేతలను అడ్డుకున్న అమరావతి రైతులు
- అమరావతిలో అడుగుపెట్టే అర్హత వైసీపీ నేతలకు లేదన్న అనిత
- వైసీపీ నేతలను అడ్డుకున్నది భూములిచ్చిన రైతులేనని వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఉండవల్లిలో వైసీపీ నేతల (పేర్ని నాని, అంబటి రాంబాబు, దేవినేని అవినాశ్) పర్యటన సందర్భంగా జరిగిన రాళ్లదాడిపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. అమరావతిలో అడుగుపెట్టే కనీస అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. వారు రైతులను పరామర్శించడానికి వెళ్లారా లేక రౌడీయిజం చేయడానికా అని ప్రశ్నిస్తూ... వారి వెంట ఎంతమంది రౌడీషీటర్లు ఉన్నారో పోలీసుల వద్ద పక్కా లిస్ట్ ఉందని చెప్పారు. గతంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వారు కూడా వైసీపీ నేతల వెంట వచ్చారని... విజువల్స్ లో అందరూ ఉన్నారని తెలిపారు.

వివరాలు 2లో..

# వీకెండ్‌లో భారీగా పెరిగిన బంగారం..!



బిజినెస్ : ఇరాన్ అమెరికా మధ్య మళ్లీ కాల్పుల నుంచి అమెరికా ద్రవ్యోల్బణ భయాల వరకూ బులియన్ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో ఈవారం ప్రారంభంలో భారీగా పతనం అయిన బంగారం రేట్లు తిరిగి పుంజుకుంటున్నాయి. ఇన్వెస్టర్లు తమ స్టాక్ మార్కెట్ నష్టాలను భర్తీ చేసుకునేందుకు గోల్డ్ అమ్మినట్లు నిపుణులు చెబుతున్న వేళ ... పసిడి రేట్లకు తిరిగి రెక్కలు వస్తున్నాయి. ఈ క్రమంలో రిటైల్ షాపింగ్ చేసేవారు తప్పనిసరిగా తమ సమీప నగరాల్లోని పెరిగిన రేట్లను తెలుసుకుని నిర్ణయం తీసుకోవటం మంచిది. జూన్ 27న బంగారం రేట్లు పెరిగాయి. జూన్ 26 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు దేశవ్యాప్తంగా గ్రాముకు రూ.120 పెరిగింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.14వేల 395గా కొనసాగుతోంది.

2 పేజీలో..

ప్రజాభూమి
ఆదివారం, జూన్ 28, 2026


# సంపాదకీయం

## ప్రజల్లో ప్రశ్నించే తత్వం చచ్చిపోయిందా ?

దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయకృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ది కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో ధృవీకరించినట్టు తెలస్తోంది. సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మి ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

## 85 వేల అక్కచెల్లెమ్మల జీవితాలతో చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారు

రూ.వేయి ఉండే జీతాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 3 వేల వరకు పెంచామని జగన్ తెలిపారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వస్తే మరింత మేలు చేస్తామని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు స్మార్ట్ కిచెన్స్ పేరుతో వారిని తొలగించి వారి జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నారని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికుల తరఫున పోరాడుతామని, వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే బకాయిపెట్టిన వారి జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట మేరకు వారి జీతాలను కూడా పెంచాలని అన్నారు.

## ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లకు ఉగ్రవాద ముప్పు

చేసుకుని ఉగ్రవాదులు దాడులు జరిపే అవకాశం ఇమెయిల్ ద్వారా బెదిరింపు వచ్చింది. చేసుకుని ఉగ్రవాదులు దాడులు జరిపే అవకాశం ఇమెయిల్ ద్వారా బెదిరింపు వచ్చింది. దీంతో ఢిల్లీ పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా ఘర్షణలు జరిగే కీలక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చే దానిన్ని కనుగొనడానికి ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.కాగా, ఈ ఏడాది రిపబ్లిక్‌డే సందర్భంగా ఢిల్లీలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా సంస్థలు హెచ్చరించాయి.

## ఆంధ్రప్రదేశ్‌కు 'ఎల్లో అలర్ట్'..

ప్రస్తుతం కోస్తాంధ్ర నుంచి తెలంగాణ మీదుగా మధ్య మహారాష్ట్ర వరకు ఉపరితల ద్రోణి విస్తరించి ఉంది. అలాగే ఈశాన్య, తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుఫాన్ ఆవర్తనం కొనసాగుతోంది. ఈ రెండు వాతావరణ వ్యవస్థల ప్రభావంతో రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరిగే అవకాశముందని వాతావరణ నిపుణులు తెలిపారు. తీరం వెంబడి గంటకు 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



# నాదీ గ్యారెంటీ

మార్కాపురం జిల్లా అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."

ప్రాజెక్టుకు భూములివ్వడం అంటే త్యాగం చేసినట్టే. పూర్వీకుల నుంచి వచ్చిన భూములను ప్రాజెక్టు కోసం వదులుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు నాలుగు జిల్లాల తలరాతను మారుస్తుంది. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్యలు ఉన్నాయి.. దీంతో ఇక్కడి స్థానికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మార్కాపురం ప్రాంతం అంటే కరవు ప్రాంతమని పేరు... ఈ ప్రాంతానికి కృష్ణా నీళ్లు వస్తాయని ఎవ్వరూ అనుకోలేదు. మార్కాపురం ప్రాంతానికి కృష్ణా నీళ్లిచ్చేందుకు ఎన్టీఆర్ 1985లోనే ఆలోచన చేశారు... దీని కోసం ఓ కమిటీని వేశారు. ఎన్టీఆర్ హయాంలోనే వెలిగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 1995లో ప్రకాశం జిల్లా పర్యటనకు ఎప్పుడు వచ్చినా వెలిగొండ ప్రాజెక్టు గురించే అడిగేవాళ్లు. వరద వస్తే.. ఆ జలాలను మళ్లిస్తే ఆ నీళ్లతో తాము జీవనం సాగిస్తామని ఇక్కడి రైతులు చెప్పేవారు. 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేశాం. వెలిగొండ ప్రాజెక్టుకు ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.10,580 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటి వరకు రూ.6,736 కోట్లు ఖర్చు చేశాం... ఇంకా రూ.3,844 కోట్లు ఖర్చు పెట్టాలి. రూ.1,932 కోట్లు తొలి విడతలో ఖర్చు పెట్టాలి... రూ.1906 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంది. 2024లో ప్రభుత్వం వచ్చాక రూ.759 కోట్లు ఖర్చు చేశాం... నిర్వాసితుల కోసం రూ.905 కోట్లు మంజూరు చేసి రూ.300 కోట్లు విడుదల చేశాం. ప్రస్తుతం బ్యాంకులకు శెలవులు ఉన్నందున మరో రెండు రోజుల్లో నిర్వాసితుల ఖాతాల్లో ఆర్ అండ్ ఆర్ డబ్బులు జమ అవుతాయి. ఆర్థికంగా ఇబ్బందులున్నాయి... అయినా వెలిగొండ సహా వివిధ ప్రాజెక్టులను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**వెలిగొండతో నాలుగు జిల్లా తలరాతలు మారతాయి...**

"ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన రైతులు, నిర్వాసితుల జీవితాలు మెరుగ్గా ఉంటాయి. 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు జమ చేస్తున్నాం. కలనూతల, సుంకేశుల, చింతలముడిపి, బుడుంచెర్ల, కాటంరాజు తండా, సాయిరాం నగర్, మెట్టి గొంది, బసవాయిపల్లి, లక్ష్మీపురం, అక్కచెరువు, గొట్టిపాడు గ్రామాల నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ నిధులు ఇస్తున్నాం. కొత్తగా నిర్మించబోయే కలెక్టరేట్ పక్కన కొన్ని గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తున్నాం. కొత్త జిల్లా ఏర్పాటు చేయడంతోపాటు.. నిర్వాసితుల కాలనీలో కలెక్టరేట్ ఏర్పాటు చేస్తున్నాం... నిర్వాసితుల కాలనీల్లో మౌళిక సదుపాయాలు పూర్తి చేశాం. నిర్వాసితుల త్యాగం వల్ల 4.47 లక్షల ఎకరాలకు నీళ్లు అందుతాయి. 23 లక్షల మందికి తాగునీరు లభిస్తాయి. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1 ద్వారా ఈ సీజన్ లో నీళ్లను అందిస్తాం. ఫేజ్-1 కింద 1.19 లక్షల ఎకరాలకు నీళ్లు, 4 లక్షల మందికి తాగునీరు అందిస్తాం. ఫేజ్-2 కింద 3.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం ఓ చరిత్ర. ఈ ప్రాజెక్టు లబ్దిదారులతోపాటు.. నిర్వాసితులు కూడా ఆనందంగా ఉండేలా చూడడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. హైదరాబాద్ నగరంలో తెచ్చిన ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులు కోట్లాది రూపాయలు గడించారు. అభివృద్ధి చేస్తేనే ఆదాయం వస్తుంది.. వెలిగొండ ప్రాజెక్టు వల్ల నాలుగు జిల్లాల పరిధిలో భూముల ధరలు పెరుగుతాయి... ఆ జిల్లాల తలరాతలు మారతాయి. కరవు జిల్లా పరిస్థితులను అర్థం చేసుకునే కలెక్టరును మార్కాపురానికి నియమించాం. మార్కాపురం జిల్లాలో హార్టికల్చర్ పంటలు వేయాలి. పూర్వోదయ ప్రాజెక్టులో మార్కాపురం జిల్లాను కూడా చేర్చాం. అగ్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుంది.. యువతకు ఉపాధి కల్పిస్తాం. రామాయపట్నం పోర్టు మార్కాపురానికి సమీపంలో ఉంది.. ఎగుమతులకు అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాంతానికి కనెక్టివిటీ పెంచుతాం. మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు వద్దే ఉంటున్నారు. టన్నెల్లోకి వెళ్తున్నారు.. పుట్టిన రోజు కూడా ఇక్కడే జరుపుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పట్టుదలతో పని చేస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి ఫేజ్ 2 కూడా పూర్తి చేస్తాం. తుంగభద్ర డ్యాంకు గేట్లు పెట్టేందుకు సహకరించాం... సీజన్ కాపాడాం. ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి కలిసి కొత్త గేట్లను ప్రారంభించాం. జల వివాదాలకు స్వస్తి పలకాలని నిర్ణయించాం... గంగా-కావేరి నదుల అనుసంధానం జరగాలి. పోలవరం ప్రాజెక్టులు పూర్తి అయితే.. గోదావరి, కృష్ణా, తుంగభద్ర, వంశధార, పెన్నా, కావేరి నదులు అనుసంధానం అయ్యేందుకు అవకాశం ఉంది. నదుల అనుసంధానంతో పాటు భూగర్భ జలాలు పెంచాలి.. అందుకే జలధార కార్యక్రమం చేపట్టాం. భూగర్భ జలాలు పెరిగితే.. విద్యుత్ భారం తగ్గుతుంది."అని ముఖ్యమంత్రి చెప్పారు.



**గొడ్డలి పార్టీకి ప్రజలే బుద్ధి చెప్పాలి**

"గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి... రాష్ట్రం విధ్వంసమైంది. శాంతి భద్రతలకు తీవ్రమైన విఘాతం కలిగించేలా వ్యవస్థలను నిర్వర్యం చేశారు. పరిశ్రమలను తరిమేశారు.. పెట్టుబడులు రాకుండా అడ్డుకున్నారు... అప్పుల భారాన్ని పెంచారు. గడచిన ప్రభుత్వం వెలిగొండ పనులు చేపట్టి ఉంటే నీళ్లు ఎప్పుడో వచ్చేవి. కూటమి ప్రభుత్వం వచ్చాకే పెద్ద ఎత్తున పనులు చేపట్టాం. గత పాలకులు వెలిగొండ ప్రాజెక్టు విషయంలో డ్రామాలాడారు.. మోసం చేశారు. మోసం చేయడంలో గొడ్డలి పార్టీ దిట్ట.. కళ్లార్పకుండా అబద్దాలు చెబుతారు... తేరుకునేలోపే మోసం చేసేస్తారు. మోసాలు ఎలా చేస్తారో.. ప్రజలను ఏ విధంగా ఏమారుస్తారోననే విషయంపై అవగాహన కల్పించేందుకు గొడ్డలి పార్టీ చర్యలను వివరిస్తూ మ్యూజియంలో పెట్టాలి. గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉంది. వెలిగొండ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం కేవలం రూ.980 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. కూటమి ప్రభుత్వం నిర్వాసితులకే రూ. 900 కోట్లు ఖర్చు పెడుతోంది... నిర్మాణానికి రూ. 3 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. నిర్వాసితులకు గత ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు.. సొరంగాల్లో తవ్విన మట్టిని కూడా తీయలేదు.. ఫీడర్ కెనాల్ పనులను చేపట్టలేదు. ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ యంత్రాన్ని తీయకుండానే జాతికి అంకితం అని మోసం చేశారు. 2014-19 మధ్య కాలంలోనే సొరంగాల పనులు చాలా వరకు పూర్తి చేశాం. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో 7,225 మంది నిర్వాసితులు ఉన్నారు... ప్రతి ఒక్కరి వెనుకా ఓ విషాద గాథ ఉంటుంది. పుట్టిన ఊరు నుంచి వెళ్లిపోవాలంటే చాలా బాధేస్తుంది. ఇంత మంది నిర్వాసితులుంటే... గత ప్రభుత్వం కేవలం 96 మందికి మాత్రమే పునరావాసం ఇచ్చింది. నిర్వాసితుల గోడు వెళ్లబోసుకోవాలని వస్తే కేసులు పెట్టించారు. కానీ మాది ప్రజా ప్రభుత్వం.. ఏ ఒక్కరూ నష్టపోకుండా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తాం.. ఇది నా గ్యారెంటీ. గత ప్రభుత్వం వదిలి పెట్టిన రూ.140 కోట్ల పెండింగ్ బిల్లులను కూడా చెల్లించాం. ఏ పార్టీ అధికారంలోకి వస్తే మాకేం అవుతుందనే భావనతో ఉండొద్దు.. ప్రజల జీవితాలను విధ్వంసం చేయవచ్చని గత పాలకులు నిరూపించారు. పోలవరం ప్రాజెక్టులో డయా ఫ్రం వాల్ పడగొట్టేలా చేశారు. ప్రభుత్వాన్ని నమ్మి అమరావతికి రైతులు భూములిస్తే.. దాన్ని నిర్వీర్యం చేశారు... రాజధాని లేకుండా చేశారు... మూడు ముక్కలాట ఆడారు. అమరావతిని రాజధానిగా కేంద్రం చట్టం చేస్తే... మావిగన్ అంటున్నారు. రాజధానితో మాకేం పని ఇతర ప్రాంతాల వాళ్లు అనుకోవద్దు... రాజధాని లేని రాష్ట్రంగా ఉండడం మంచిదా అని ప్రజలు ఆలోచించాలి. కులం, మతం, ప్రాంతం వంటి వాటి ప్రలోభాలకు గురి కావద్దు... మంచి, చెడు ఆలోచించి విశ్లేషించుకుని ఓట్లేయాలి. మార్కాపురాన్ని అభివృద్ధి చేసే బాధ్యత మాది... సహకరించే బాధ్యత ప్రజలది. నన్ను చూడండి.. పార్టీని చూడండి.. ఎన్డీఏను చూసి సహకరించండి. ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తాం.. మీ నుంచి సహకారాన్ని కోరుతున్నాం."అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ శ్రీనివాసులు రెడ్డి సహా జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, నేతలు పాల్గొన్నారు.

### భావోద్వేగభరితంగా వెలిగొండ

# నిర్వాసితులతో సీఎం ముఖాముఖి

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు... పునరావాసం విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నందుకు నిర్వాసితులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. పునరావాసం విషయంలో నాటి ప్రభుత్వ వేధింపులను రైతులు, నిర్వాసితులు ఈ సమావేశంలో వివరించారు.

పునరావాసం అందించే నిమిత్తం రూ.300 కోట్లు ఇవ్వడానికి స్వయంగా సీఎం రావడంపై సుంకేశుల గ్రామానికి చెందిన దూదేకుల ఖాసీం వలీ అనే నిర్వాసితుడు భావోద్వేగానికి గురయ్యారు. తమ బాధలను, తమను గుర్తించి పరిష్కారం చూపింది చంద్రబాబే అంటూ ఖాసీం వలీ కన్నీళ్లు పెట్టుకున్నారు. గత పాలకులు పునరావాసం అడిగితే అరెస్టులు చేసి వేధించారంటూ నాటి సంగతులను నిర్వాసితులు గుర్తు చేసుకున్నారు. తమ హక్కులను కాలరాసే విధంగా తమను బంధించారని వెలిగొండ ప్రాజెక్ట్ పరిధిలోని రైతులు సీఎంకు వివరించారు. పునరావాసం డబ్బులు అందుతుండడంతో తమ పిల్లల చదువు, భవిష్యత్తుపై భరోసా కలిగిందని మరో నిర్వాసితుడు హనుమ ప్రసాద్ చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను చకచకా చేపట్టడం ద్వారా తమ 30 ఏళ్ల కలను సాకారం చేస్తున్నారంటూ కొందరు రైతులు పాదాభివందనం చేసే ప్రయత్నం చేయగా వారిని ముఖ్యమంత్రి నివారించారు. ఆ తర్వాత రైతులు, నిర్వాసితులు మాట్లాడిన అంశాలపై సీఎం చంద్రబాబు స్పందించారు. ఏ ఒక్కరికీ నష్టం కలగకుండా.. ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే గ్యారెంటీ తనది అంటూ నిర్వాసితులకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. 4 జిల్లాల తలరాతలు మార్చేందుకు సహకరించిన నిర్వాసితుల త్యాగానికి తగ్గ ఫలాలు అందిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మొత్తంగా వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో మొత్తంగా 7,225 మంది నిర్వాసితులు ఉంటే కేవలం 96 మందికే ఆర్ అండ్ ఆర్ నిధులను గత ప్రభుత్వం అందిచింది. శనివారం నాడు 2351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్ల మేర ఆర్ అండ్ ఆర్ నిధులు సీఎం చంద్రబాబు అందించారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల రైతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రైతుల మధ్యనే కూర్చొని ముఖాముఖిలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.



### అమరావతి రైతులను పరామర్శించేందుకు వెళ్లారా లేక రౌడీయిజం చేసేందుకు వెళ్లారా?

వైసీపీ నేతలకు వ్యతిరేకంగా అక్కడ నిరసన తెలిపిన వారిలో 90 శాతం మంది రాజధాని కోసం భూములిచ్చిన అసలైన రైతులేనని స్పష్టం చేశారు. వైసీపీ అధినేత జగన్ గతంలో అమరావతిని అంగీకరించి, ఆ తర్వాత మూడు రాజధానుల డ్రామాలతో ఐదేళ్లు నరకం చూపించారని మండిపడ్డారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని అమరావతి రైతుల వద్దకు వస్తున్నారని ప్రశ్నించారు. అమరావతి పూర్తయితే వైసీపీకి మనుగడ ఉండదనే ఈ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అహర్నిశలు కష్టపడుతూ 2027 నాటికి అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయడమే టార్గెట్‌గా పెట్టుకుందన్నారు.

## సాయికృష్ణ అదృశ్యం... వైసీపీ నేతలపై పవన్ కల్యాణ్ ఫైర్

వైసీపీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం కులాలను వాడుకుంటోందని, తనను విమర్శించడానికి కాపు సామాజికవర్గానికి చెందిన నేతలనే ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. "నన్ను తిట్టేవాళ్లలో ఎక్కువమంది కాపులే. వాళ్ల భుజాలపై తుపాకీ పెట్టి నన్ను కాలుస్తున్నారు. లింగమనేని రమేశ్ గారికి రాజ్యసభ ఇస్తే వాళ్లే విమర్శిస్తారు. ఈ కుట్రపూరిత రాజకీయాలను బ్రేక్ చేస్తాను కాబట్టే నాపై కొందరికి అంత కోపం" అని పవన్ అన్నారు. తాను ఎప్పుడూ కులం కార్డు వాడి రాజకీయాలు చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోనని తేల్చిచెప్పారు. "దేశమే నాకు కులం. కులం అనేది ఒక సామాజిక వాస్తవం, దాన్ని గౌరవిస్తాను. కానీ అది ఇంటి గడప దాటకూడదు. గడప దాటితే మానవత్వం, దేశం మాత్రమే గుర్తుండాలి. నేను కులాల ఐక్యతను కోరుకుంటాను తప్ప, వాటిని రాజకీయ పెట్టుబడిగా మార్చను" అని ఆయన ఉద్ఘాటించారు.

**బీసీలు ఐక్యంగా ఉంటే ఇచ్చే స్థాయికి ఎదుగుతారు :** అధికారానికి దూరంగా ఉన్న సామాజిక వర్గాల సాధికారతపై పవన్ కల్యాణ్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గాల గురించి మాట్లాడుతూ, వారు ఐక్యతతో వ్యవహరించాలని సూచించారు. "దాదాపు 50 శాతం జనాభా ఉన్న బీసీలు ఎవరినో పదవులు అడగాల్సిన అవసరం ఏముంది? మీలో మీకు ఐక్యత లేదు కాబట్టే ఆ పరిస్థితి. గొడవలప్పుడు ఏకమవుతారు, ఓట్ల విషయానికి వచ్చేసరికి విడిపోయి సంప్రదాయ పార్టీలకు ఓటేస్తున్నారు. మీరు ఐక్యంగా ఉంటే, మీరు పది మందికి పదవులు ఇచ్చే స్థితిలో ఉంటారు కానీ, ఇలా దేహీ దేహీ అనే స్థితిలో ఉండరు. బీసీలంతా ఏకమైతే, మీకు వైసీపీ లాంటి పార్టీ అవసరం ఉండదు, నాలాంటోడు కూడా అవసరం ఉండదు" అని పవన్ అన్నారు. నాయకుడు అనేవాడు కేవలం తన కులాన్ని కాదు, అన్ని కులాలను కలుపుకొని, అందరి నమ్మకాన్ని చూరగొన్నప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని హితవు పలికారు. కాన్షీరామ్ నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ, ఏ ఉద్యమమైనా ఒకే సామాజిక వర్గానికి పరిమితమైతే దాని ఎదుగుదలకు పరిమితులు ఏర్పడతాయని విశ్లేషించారు.

**సంస్థాగత నిర్మాణమే లక్ష్యం :** పార్టీ కోసం సంవత్సరాలుగా గుర్తింపు ఆశించకుండా పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలను గుర్తించి, భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దడానికే 'జనసేన పార్టీ సారథుల సమాచార సేకరణ కమిటీ'ని ఏర్పాటు చేశామని పవన్ తెలిపారు. గతంలో కొందరికి బాధ్యతలు అప్పగించినా, వారు క్షేత్రస్థాయిలోని శివ, మునీర్ హసన్ వంటి కార్యకర్తలను గుర్తించడంలో విఫలమయ్యారని అన్నారు. "పదేళ్లుగా గుర్తింపునకు నోచుకోకుండా పార్టీ కోసం పనిచేసిన సాధక్‌లకు, జనసైనికులకు ఇప్పుడు గుర్తింపు ఇచ్చే సమయం వచ్చింది. అందుకే 700 మంది సభ్యుల కమిటీలో 600 మంది సాధక్‌లకే అవకాశం కల్పించాం. మీరే క్షేత్రస్థాయిలో ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు పనిచేయడం లేదో గుర్తించి సమాచారం అందించాలి. ఇది నాయకులను ఎంపిక చేసే కమిటీ కాదు, కేవలం పారదర్శకంగా సమాచారాన్ని సేకరించే కమిటీ మాత్రమే" అని పవన్ స్పష్టం చేశారు.

**ఛాయిస్ ఈజ్ యువర్స్ :** గత వైసీపీ ప్రభుత్వంపై పవన్ విమర్శలు గుప్పించారు. కేవలం బటన్ నొక్కి డబ్బులు వేయడమే పాలన కాదని, మౌలిక సదుపాయాలను పూర్తిగా గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. "డబ్బులు వేశారు సరే, రోడ్లు ఎవరు వేయాలి? ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి ఏంటి? ఒక రోడ్డు లేకపోతే ఊరి నుంచి ప్రజలు ఎలా బయటకు వస్తారు? ఎన్ని ఉచితాలు ఇచ్చినా, మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ప్రజలు ఇంకోసారి నమ్మరు అనడానికి వైఎస్ఆర్‌సీపీ ఓటమే క్లాసిక్ ఉదాహరణ" అని అన్నారు. తమ కూటమి ప్రభుత్వం సంక్షేమానికి వ్యతిరేకం కాదని, అయితే సంక్షేమంతో పాటు అభివృద్ధికి, వ్యవస్థల బలోపేతానికి పెద్దపీట వేస్తుందని హామీ ఇచ్చారు. చివరగా, వైసీపీ నేతలకు ఆయన సవాల్ విసిరారు. "మీరు మమ్మల్ని తిట్టడం మానేస్తే, మేము మా పార్టీ నిర్మాణ పనుల్లో ఉంటాం. లేదు, తిడతామంటే.. మిమ్మల్ని తిడుతూనే మేము బలపడతాం. ఏదైనా సరే, మేము బలపడటం గ్యారెంటీ. ఛాయిస్ ఈజ్ యువర్స్" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

## గొడ్డలి పార్టీ కుట్రలు ఇక సాగవు

జీవితాలతో చెలగాటమాడిన వారే ఇప్పుడు 'అమరావతి రైతు పరిరక్షణ' పేరుతో కొత్త నాటకాలు ఆడటం సిగ్గుచేటు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.

అందుకే వైసీపీ నాయకులు ఎక్కడికి వెళ్లినా తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు అని అన్నారు. రాజకీయాల కోసం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, ప్రజల సహనాన్ని పరీక్షిస్తే ప్రజల నుంచి తీవ్ర ప్రతిస్పందనే వస్తుంది. ప్రజలను రెచ్చగొట్టి ఆ తర్వాత బాధితులమని నటించడం వైసీపీకి అలవాటైపోయింది. ఆ రాజకీయాలకు కాలం చెల్లింది అని అచ్చెన్నాయుడు అన్నారు. అమరావతి రైతుల నిరసనలను అణచివేసేందుకు వైసీపీ పాలనలో ఎలాంటి దౌర్జన్యాలు జరిగాయో రాష్ట్ర ప్రజలకు ఇంకా గుర్తున్నాయని, ఇప్పుడు అదే రైతుల పేరుతో రాజకీయ పర్యటనలు చేయడం పూర్తిగా అవకాశవాద రాజకీయమని విమర్శించారు. గొడ్డలి పార్టీ నాయకుల పర్యటన సందర్భంగా శాంతిభద్రతలను కాపాడేందుకు విధుల్లో ఉన్న పోలీసులపైనే దాడి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని మంత్రి మండిపడ్డారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు గాయపడటం అత్యంత విచారకరమని, ప్రజాస్వామ్యంలో పోలీసులపై దాడులకు ఎలాంటి సమర్థన ఉండదని స్పష్టం చేశారు. ప్రజలను రెచ్చగొట్టడం... ఉద్రిక్తతలు సృష్టించడం... తర్వాత నాటకాలు ఆడటం గొడ్డలి పార్టీ రాజకీయాలుగా మారాయి. అలాంటి చౌకబారు రాజకీయాలను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇక ఏమాత్రం నమ్మరు. అమరావతి రైతుల మనోభావాలను గౌరవించాల్సిందే తప్ప, వారిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మానుకోవాలి అని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

## వీకెండ్‌లో భారీగా పెరిగిన బంగారం ..!

ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.13వేల 195గా కొనసాగుతోంది. శనివారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. జూన్ 27, 2026న దేశవ్యాప్తంగా స్థిరంగా కొనసాగుతున్నాయి. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు కేజీకి రూ.10వేలు పెరిగి రూ.2లక్షల 45వేలుగా ఉంది. అంటే గ్రాము దాదాపు రూ.245 దగ్గర ఉంది.



# సమగ్ర ఓటరు జాబితాకు సర్ కసరత్తు

**క్షేత్రస్థాయిలో ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అధికారులకు దిశానిర్దేశం**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఓటరు జాబితాల కచ్చితత్వం ఎన్నికల ప్రక్రియకు అత్యంత కీలకమని, అర్హులైన ఏ ఒక్క ఓటరూ జాబితా బయట లేకుండా.. అనర్హులెవ రూ జాబితాలో లేకుండా దోషరహిత, సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.కలెక్టర్ లక్ష్మీశ శనివారం విజయవాడ అర్బన్ పరిధిలో విజయవాడ తూర్పు, మధ్య, పశ్చిమ నియోజకవర్గాల్లో విస్తృ తంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో బీఎల్వోల ద్వారా ఎన్యూమరేషన్ ఫారాల (ఈఎఫ్) పంపిణీ, స్వీకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ నియోజకవర్గాల్లో సర్ ఇంటింటి సర్వే పకడ్బందీగా జరుగుతోందని.. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అధికారులు విధులు నిర్వర్తిస్తు న్నారని పేర్కొన్నారు. జిల్లాలో 14,99,852 (87.53 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జరిగిందని, అదేవిధంగా 1,84,411 ఫారాల డిజిటైజేషన్ పూర్తయిం దన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఫారాల పంపిణీని పూర్తిచేయడంతో పాటు డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. తిరువూరులో 1,96,351 (94.08 శాతం), విజయవాడ పశ్చిమ 2,04,853 (79.72 శాతం), విజయవాడ సెంట్రల్ 2,30,320 (82.9 శాతం), విజయవాడ తూర్పు 2,27,376 (84.3 శాతం), మైలవరం 2,49,135 (87.36 శాతం), నందిగామ 1,94,997 (93.98 శాతం), జగ్గయ్యపేట 1,96,820 (94.83 శాతం) మేర ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వివరించారు. బీఎల్వోలు, అధికారులు ఈసీఐ నియమ నిబం ధనలు, మార్గదర్శకాలకు అనుగు ణంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా నిష్పక్షపా తంగా నిబద్ధత తో సర్ ప్రక్రియను విజయ వంతంగా పూర్తిచే యడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను తదితరులు ఉన్నారు.




## జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహానికి సమన్వయంతో చర్యలు చేపట్టాలి

**-జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధితో పాటు ఎగుమతులను ప్రోత్సహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి), అనంతరం జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఈపిసి) సమావేశాలు నిర్వహించారు.

డీఐఈపీసీ సమావేశంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమలకు సంబంధించిన అనుమతుల మంజూరు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, ప్రధానమంత్రి విశ్వ క ర్మ యోజన పథకం, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపి) పురోగతి, పార్ట్నర్‌షిప్ సమ్మిట్–2025లో కుదిరిన అవగాహన ఒప్పందాల అమలు, జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ పునర్వ్యవస్థీకరణ, ఎంఎస్ఎంఈలకు వివిధ పారిశ్రామిక విధానాల కింద అందిం చే ప్రోత్సాహకాల మంజూరుపై సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను నిర్ణీత గడువులోగా మంజూరు చేసి, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహ కాలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం జరిగిన డీఈపీసీ సమావేశంలో జిల్లా ఎగుమతుల గణాంకాలు, జిల్లా ఎగుమతుల కార్యాచరణ ప్రణాళిక, అధిక ఎగుమతి సామర్థ్యం కలిగిన ఉత్పత్తుల గుర్తింపు, భాగస్వామ్య సంస్థల సహకారం, ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాల విస్తరణ, ఎగుమతిదారుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. స్థానిక ఎంఎస్ఎంఈలు, కళాకారులు,



రైతులు, పారిశ్రామికవేత్తలు ప్రపంచ మార్కెట్లను చేరుకునేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఎగుమతుల పెరుగుదల ద్వారా జిల్లాలో ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేలా కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.

సమావేశాల్లో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, తపాల శాఖ మచిలీపట్నం డివిజన్ సూపరింటెండెంట్ బి శ్రీనివాసరావు, మల్లవల్లి పరిశ్రమల అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికుమార్, ఇమిటేషన్ జ్యువలరీ పార్క్ ప్రెసిడెంట్ సుబ్బారావు, ఇతర పారిశ్రామికవేత్తలు, అగ్నిమాపక శాఖ అధికారి ఏసురత్నం, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు జ్యోతి రమణి, జే జ్యోతి, బ్యాంకుల ప్రతినిధులు, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపట్టాలి

**కలెక్టర్ డీకే బాలాజీ**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి



ఎన్నికల నిర్వహణలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబ ద్ధీకరణ (రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్స్) ప్రక్రియను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులతో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను రెండు దశల్లో చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తొలి దశలో ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు మేరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్యను నిర్దేశిత పరిమితిలోకి తీసుకురావడం కోసం ఒకే క్రమంలో లేదా పూర్తి వీధులను మాత్రమే బదిలీ చేయాలని, వార్డులో విడివిడిగా కొన్ని ఇళ్లను మాత్రమే మార్చడం వల్ల భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని సూచించారు.రెండో దశలో క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ కాలంలో వాస్తవ నివాస ప్రాంతం ఒకచోట ఉండి, ఓటరు పేరు మరో పోలింగ్ కేంద్రంలో నమోదై ఉన్న వారిని గుర్తించి ఫారం-8 ద్వారా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు మార్చే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియకు అవసరమైన జాబితాలను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని సూచించారు.ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించకపోతే స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఓటర్లు ఏ వార్డులో ఓటు వేయాలో తెలియక తీవ్ర గందరగోళం ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల పోలింగ్ కేంద్రాల భౌగోళిక పరిధిని ముందుగానే స్పష్టంగా ఖరారు చేసి, ఆ పరిధిలో నివసిస్తున్న ప్రతి ఓటరు అదే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించి భౌగోళిక మ్యాప్‌ను రూపొందించి, ప్రస్తుతం అక్కడ నివసిస్తూ అదే పోలింగ్ కేంద్రంలో ఓటు ఉన్నవారిని, వాస్తవ నివాసం వేరే ప్రాంతంలో ఉండి ఓటు మరో పోలింగ్ కేంద్రంలో ఉన్నవారిని ప్రత్యేకంగా గుర్తించాలని సూచించారు. అలాంటి వారందరి వివరాలను ప్రత్యేక జాబితాలుగా సిద్ధం చేసి, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ కాలంలో ఫారం-8 ద్వారా మార్పులు పూర్తి చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రస్తుతం ఉన్న బి.ఎల్. ఓల బాధ్యతలను స్పష్టంగా నిర్ణయించి, కొత్తగా తమ పరిధిలోకి వచ్చే ప్రతి ఓటరిని సంబంధిత పోలింగ్ కేంద్రానికి బదిలీ చేసే ప్రక్రియను వారు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి దశను ముందస్తు ప్రణాళికతో అమలు చేసి, ఎన్నికల నాటికి ఎలాంటి గందరగోళం లేకుండా ఖచ్చితమైన ఓటరు జాబితాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.సమావేశంలో బంద రు, గుడివాడ ఆర్డీవోలు కే సాంబశివరావు, జి బాలసుబ్రమణ్యం, గుడివాడ మున్సిపల్ కమి షనర్ ఎస్ మనోహర్ రావు, మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ప్లానింగ్ సెక్రటరీలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి అందజేత

**కొక్కిలిగడ్డ నాగరాజు మనవరాలి అకాల మరణంపై మంత్రి కొల్లు రవీంద్ర ప్రగాఢ సానుభూతి**

మచిలీపట్నంరూరల్/ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం రూరల్ మండలం తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని ఇటీవల చోటుచేసుకున్న అకాల మరణం తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ నాగరాజు మనవరాలు అకాల మరణం చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, విచారాన్ని వ్యక్తం చేశారు.ఈ క్లిష్ట పరిస్థితుల్లో సదరు కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన రూ. 1,44,232/- (అక్షరాలా లక్షా నలభై నాలుగు వేల రెండు వందల ముప్పై రెండు రూపాయల) ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు.స్వగృహానికి వెళ్లి చెక్కు అందజేత బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు నేరుగా వారి స్వగృహానికి వెళ్లిన నాయకులు, ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చిన్న వయసులోనే పాప అకాల మరణం చెందడం ఎంతో బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు కొండంత మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాం. వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. ప్రభుత్వం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుంది.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులుబాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులుకొనకళ్ళ నాగరాజు,కొక్కిలిగడ్డ జయకృష్ణ,బోట్ల నాగబాబు, అడ్డాల రామాంజనేయులుమరియు స్థానిక నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాధిత కుటుంబానికి తమ మద్దతును, సానుభూతిని తెలియజేశారు.



## బంటుమిల్లి శాంతినగర్ లో ఘోర రోడ్డు ప్రమాదం

ప్రజాభూమి పెడన

బంటుమిల్లి శాంతినగర్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరగగా అటువైపు వెళుతున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మానవత్వం చాటుకుని ముంజులూరు టోల్ ప్లాజా అంబులెన్స్ ని పిలిపించి గాయపడిన వారిని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని అన్నారు.

## గడ్డి బజార్ శ్రీ రామ మందిరంలో ఘనంగా అన్నసమారాధన



**రూ. 10,000 విరాళం ప్రకటించిన డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

దేశాయిపేటలోని గడ్డి బజార్ జానకి శ్రీ రామ మందిరంలో జానకి శ్రీ రామలవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి DCMS చైర్మన్ బండి రామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. స్వామివారి అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి తన వంతుగా 10,000 రూపాయల నగదు విరాళాన్ని ప్రకటించి, ఆయన ఉదారతను చాటుకున్నారు. అనంతరం ఆలయంలో జరిగిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.ఘన సత్కారం:ఆలయానికి విచ్చేసిన DCMS చైర్మన్ బండి రామకృష్ణకు దేవాలయ కమిటీ ప్రతినిధులు శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ భక్తి శ్రద్ధలతో సాగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో గడ్డం రాజు, గుణ్ణం వాసు, గుణ్ణం సోమేశ్, దేవాలయ కమిటీ ప్రతినిధులు, వేద పండితులు, అర్చకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## యువ మేధకు వేదిక..ఎంఎస్ఎంఈ ఉత్సవ్

**ఆలోచన నుంచి ఆవిష్కరణ వరకు చేయూత**

**సృజనాత్మకతకు అనుభవాన్ని జోడించే అద్భుత కార్యక్రమం**

**మొత్తం 80 స్టాళ్లతో యువ కలలకు రెక్కలు తొడిగేలా ఉత్సవ్**

**పరిశ్రమల అభివృద్ధిలో ఆర్టీఐహెచ్ ఓ గేమ్ ఛేంజర్**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

యువతలో దాగిఉన్న సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ముందుకు నడిపించడమే ధ్యేయంగా అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ ) దినోత్సవం సందర్భంగా ఎంఎస్ఎంఈ ఉత్సవ్-2026ను నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.శనివారం విజయవాడ గ్రామీణం ఎనికేపాడులోని రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్)లో కలెక్టర్ లక్ష్మీశ.. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పి.భాస్కర్‌రావు, ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.దుర్గాప్రసాద్, జేఆర్‌డీ టాటా ఐలా ఛైర్మన్ టి.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, ఆర్టీఐహెచ్-విజయవాడ సీఈవో రవితేజ తదితరులతో కలిసి ఎంఎస్ఎంఈ ఉత్సవ్‌ను ప్రారంభించారు. ఈ ఉత్సవ్‌లో యువత, మహిళలు తమ ఆవిష్కరణలు, ఉత్పత్తులకు సంబంధించి 80కు పైగా స్టాళ్లను ఏర్పాటుచేయగా వాటిని కలెక్టర్ పరిశీలించారు. స్త్రీ శక్తి మార్కెట్ హబ్, జాబ్ పాపర్, ఈజీ స్లేట్, గ్లివీ, కూలెక్స్ గ్రీన్ ఇండియా, జెస్ట్ ఈట్, పరివర్తన్, ఫార్మ్ స్టీల్ ప్రొడక్ట్స్ తదితర స్టార్టప్‌లు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త దార్శనికతకు అనుగుణంగా రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లకు చేయూతనివ్వడం జరుగుతోందన్నారు. యువ మేధస్సుకు అనుభవాన్ని జతచేసి ఆ ఆలోచనలను ఆవిష్కరణల వైపు నడిపించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన మార్గదర్శకత్వం, సాంకేతిక సహాయం, మార్కెటింగ్ అవకాశాలు, ఆర్థిక వనరులపై అవగాహన కల్పించడంలో ఇటువంటి ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని, సమాజంలోని ఎన్నో సమస్యలకు పరిష్కారం కూడా లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధన దిశగా..స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధన దిశగా పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తున్నామని.. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేసుకొని తమ కాళ్లపై తాము నిలబడుతూ మరో పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా రైజ్, ఆర్టీఐహెచ్ ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలతో పాటు వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు వివరించారు. యువ పారిశ్రా మికవేత్తలకు ఆవిష్కరణలు దిశగా వేసే అడుగుల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రాలు ఆర్ అండ్ డీ (పరిశోధన, అభివృద్ధి) కేంద్రాలుగా ఉపయోగపడుతున్నాయని పేర్కొ న్నారు. ఓ చిన్న ఆలోచనకు చేయూతనిస్తే అది ఓ మంచి పరిశ్రమగా ఎదుగుతుందని.. ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ ఉత్సవ్‌లో భాగస్వాములైన ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్టీఐహెచ్, వివిధ పారిశ్రామిక సంస్థలు, అసోసియేషన్లు ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియ జేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

స్వర్ణాంధ్ర సాకారం.. ఎంఎస్ఎంఈలతో సులభ తరం: ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పి.భాస్కర్‌రావుఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పి.భాస్కర్‌రావు మాట్లాడుతూ మన రాష్ట్రం పారిశ్రామిక మ్యాపు లో అద్భుతమైన స్థానం సంపాదించుకుంటోందని, స్టార్టప్ ఎకో సిస్టమ్ కూడా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. దాదాపు ఏడెనిమిదివేల స్టార్టప్‌లు ఆర్టీఐహెచ్ ప్రోత్సహంతో నేడు ముందుకెళ్తున్నాయన్నారు. రాష్ట్రంలోని పరిశ్రమల్లో దాదాపు 90 శాతం ఎంఎస్ఎంఈ కేటగిరీ కిందే ఉన్నాయని.. ఇవి మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరముందన్నారు. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో ఆంధ్రప్రదేశ్ స్థానిక ఉత్పత్తులకు మరింత ఆదరణ లభించేలా ప్రత్యేక కార్యాచరణకు ఏపీ ఛాంబర్స్ పిలుపునిస్తోందని భాస్కర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇండస్ట్రీ 4.0 టెక్నికల్ సెషన్ నిర్వహించారు. ఎంఎస్ఎంఈ ఉత్సవ్‌లో 500 మందికిపైగా పారిశ్రామిక ప్రతినిధులు, సంద ర్శకులు పాల్గొన్నారు.కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామచంద్రన్, బీఎన్ఐ ఈడీ జై దేశాయ్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ బి.రాజశేఖర్, ప్రకాశ స్పెక్ట్రో కాస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ టి.పార్థసారథి, ఏపీ ఎంఎస్ఎంఈ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నరాజు గుడిపూడి, పారిశ్రామికవేత్త ఆర్వీ స్వామి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 28న పల్స్ పోలియో కార్యక్రమం

**- ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు**
**- జిల్లాలో 1.69 లక్షల మంది చిన్నారులకు లక్ష్యం**
**- 966 కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం**
**- పల్స్ పోలియో ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

జూన్ 28న నిర్వహించనున్న "పోలియో ఆదివారం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం నగరంలోని ఓల్డ్ జీజీహెచ్ వద్ద నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పుట్టినప్పటి నుంచి ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపా రు. ఆదివారం పోలియో చుక్కలు వేయించు కోలేని పిల్లలకు సోమవారం, మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారని పేర్కొ న్నారు. జిల్లాలో మొత్తం 1,69,810 మంది ఐదేళ్లలోపు చిన్నారులను లక్ష్యంగా తీసుకుని 966 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లోని 47 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. సోమవారం, మంగళ వారం రోజుల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు జిల్లాలోని 6,71,409 గృహాలను సందర్శించి, ఏ ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా పోలియో చుక్క లు వేయించి ఇంటింటికీ మార్కింగ్ నిర్వహిస్తారని వివరించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో 35 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు



చేయడంతో పాటు 34 మొబైల్ బృందాలను ప్రత్యే కంగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్య క్ర మాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు 4,274 మంది వ్యాక్సినేటర్లు, 104 మంది రూట్ సూప ర్‌వైజర్లు విధులు నిర్వర్తించనున్నారని, మొత్తం 3.10 లక్షల పోలియో డోసులను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.అన్ని శాఖల సమన్వ యంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వ హిం చేందుకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్ర మంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సీహెచ్ఎంఓ డా. అర్జునరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఇందుమతి దేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ఎం.శరత్ బాబు, డా. నవీన్, డా. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మహిత బాధ్యతల స్వీకరణ

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా డాక్టర్ మహిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన డాక్టర్ జగన్‌మోహన్‌రావు స్థానంలో ఆమె నియమితులయ్యారు . గతంలో తెనాలి సమీపంలోని సుల్తానాబాద్ యూ పి హెచ్ సి లో ఏడాది పాటు సేవలందించిన డాక్టర్ మహిత, ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి తిరిగి వచ్చాక ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన చికిత్సతో పాటు ఆప్యాయమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో ఆసుపత్రిని సంప్రదించి వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## విద్యార్థులకు రాతపుస్తకాలు, స్వీట్లు పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



బొద్దన్నపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం విజయవాడకు చెందిన విశ్రాంత పోస్టుమెన్ ఆర్. రామచంద్రరావు విద్యార్థులకు రాతపుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం విద్యార్థులకు తన వంతు సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి




అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నూజివీడు అగ్నిమాపక శాఖ అధికారి జి. నాగరాజు సూచించారు. ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అగ్ని ప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ సేఫ్టీ పరికరాల వినియోగం, విద్యుత్ భద్రత, వాయు ప్రసరణ, ఏసీల నిర్వహణ, మాక్ డ్రిల్ నిర్వహణ విధానాలపై వివరించారు. ప్రమాదం సంభవించినప్పుడు భయాందోళనలకు గురికాకుండా వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించి, భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మంజు లాదేవి, వైద్య సిబ్బంది, అగ్నిమాపక శాఖ సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

## శ్రీ సర్వ కార్యసిద్ధి సాయిబాబా మందిర 19వ వార్షికోత్సవం



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలోని సింగన్నగూడెం బస్‌స్టాప్ ఎదురుగా ఉన్న సాయి శివకోటి నగర్‌లోని శ్రీ సర్వకార్యసిద్ధి షిరిడి సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నుంచి జూలై 5 వరకు సాయినామ సప్తాహం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దేవులపల్లి మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, జూలై 5న ఉదయం విశేష ఫలామృతాభిషేకం, స్నపన, విశేష అలంకరణ, అర్చన, అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పుణ్యకార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీ షిరిడి సాయిబాబా అనుగ్రహాన్ని పొందాలని ఆయన కోరారు.

## రేపాక వారి సత్రం ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ...



ప్రజాభూమి ప్రతి నిధి–పాలకొల్లు

పాలకొల్లు పట్టణ పరిధిలో గల రేపాక వారి సత్రం చైర్మన్ రేపాక కృష్ణకుమారి . రేపాక వీర్రాజు ఆధ్వర్యంలో పాలకొల్లు మున్సిపాలిటీ మరియు రూరల్ ప్రాథమిక పాఠశాలలకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ప్రతి మనిషి హక్కు అనే భావనతో ప్రభుత్వ పాఠశాల పని చేస్తాయని. ప్రభుత్వ బడులు దేశ అభివృద్ధికి పునాది వంటివని . గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో ప్రభుత్వ బడుల ద్వారానే విద్యను పొందుతున్నారని. ప్రభుత్వ పాఠశాలలో విద్యతోపాటు. క్రమశిక్షణ నైతిక విలువలు. సామాజిక బాధ్యతలను కూడా నేర్పిస్తాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల లో పనిచేసే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దటంలోనూ. వారికి ఆత్మవిశ్వాసము. క్రమశిక్షణ మంచి అలవాటు నేర్పిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్. కే వెంకటేశ్వరరావు. ఎస్ .రమేష్ కుమార్ పాల్గొన్నారు.

# డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో గంటలో 350 సమస్యలు

- "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమం
- ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ప్రజా భూమి ప్రతినిధి–జీలుగుమిల్లి



పోలవరం నియోజకవర్గ ప్రజలకు తమ సమస్యలను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమం శనివారం జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొని ప్రజల నుంచి నేరుగా ఫోన్ కాల్స్ స్వీకరించి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలు సుమారు 350 ఫోన్ కాల్స్ ద్వారా తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గ్రామీణ రహదారుల దుస్థితి, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా అంతరాయాలు, తాగునీటి సమస్యలు, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. ప్రతి సమస్యను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వెంటనే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను తెలియజేయాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకొని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రజా ప్రతినిధులు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### నేడు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని

# ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**

ప్రజా భూమి ప్రతినిధి–జీలుగుమిల్లి



నేడు (ఆదివారం) నిర్వహించనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని, ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. శనివారం బరింకలపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పల్స్ పోలియో పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమైందని అన్నారు. 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి, గతంలో పోలియో చుక్కలు వేసినా కూడా మరోసారి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు మరియు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఈ సేవలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. చిన్నారుల భవిష్యత్తు ఆరోగ్యవంతంగా ఉండాలంటే ప్రతి తల్లిదండ్రులు బాధ్యతతో ముందుకు వచ్చి తమ పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ డిఎంహెచ్వో సుమతీదేవి. డాక్టర్లు దిలీప్ సాయి చందు. చైతన్య. మణికంఠ. సురేష్ కుమార్ సిహెచ్ఓ శ్రీనివాసరాజు, ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు సర్వేను పరిశీలించిన ఎంపీడీవో



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ సలాం శనివారం నెక్కలం, గొల్లగూడెం, అడవినెక్కలం గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్వేను పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న సర్వే తీరును తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హుల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## అనారోగ్య బాధితునికి వాకర్స్ క్లబ్ , పాలకొల్లు 28 వేల రూపాయల ఆర్థిక సాయం

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు



తోటి వారి కష్టాన్ని ఏదో ఒక రూపం లో పంచుకోవడం ద్వారా సమాజం ఒక కుటుంబం గా మారుతుందని వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. పాలకొల్లు శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి దేవస్థానం లో అర్చకునిగా పనిచేస్తున్న నిమ్మగడ్డ వెంకట నాగేంద్ర ప్రసాద్ కుమారుడు తీవ్ర అనారోగ్యానికి గురై బెంగళూరు లో చికిత్స కు వెళ్లాల్సిన పరిస్థితిలో డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలియడం తో వాకర్స్ క్లబ్ తరపున సభ్యులు సమకూర్చిన 28 వేల రూపాయల మొత్తాన్ని ఆ కుటుంబానికి అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, పూర్వ గవర్నర్ ఆకి రామకృష్ణ, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, కఠారి నాగేంద్ర కుమార్, జవ్వాజి కల్యాణ్, కాపా చిరంజీవి, శ్రీనివాస శాస్త్రి, చామా శ్రీనివాసరావు,గుండుబోయిన నాగేశ్వరరావు,కర్రి కిరణ్,కోట చంటియ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐదు సంవత్సరాల లోపు ప్రతి బిడ్డకి పోలియో చుక్కలు వేయించండి

**ఎంపీడీఓ ఎన్ ఉమామహేశ్వరరావు**

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు



పాలకొల్లు ఎంపీడీవో కార్యాలయం నందు ఆదివారం జరుగు పల్స్ పోలియో కార్యక్రమం పై కన్వర్జెన్సీ సమావేశం డాక్టర్ ఎం నవ్య జీవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎన్.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్ మరియు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలలో ఐదు సంవత్సరాలలోపు ప్రతి బిడ్డకి పోలియో చుక్కలు వేయించేలని సిబ్బందిని కోరారు. డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ లంకలకోడేరు పిహెచ్ సి పరిధిలో 29 బూత్ లు ఏర్పాటు చేశామని ప్రతి బూత్ లోను నలుగురు టీం మెంబర్లు ఉంటారని ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. అనంతరం లంకలకోడే రు హై స్కూల్ నందు పల్స్ పోలియోపై ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎం ఆర్ ఓ. వై. దుర్గా కిషోర్. డాక్టర్ ఎం నవ్య జీవన్. డాక్టర్ జి దినేష్.ఎం ఈ ఓ. ఆర్ ఎన్ వి శర్మ. డిప్యూటీ ఎంపీడీవో టీ మూర్తి బాబు. ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావు. ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు. పీహెచ్ ఎన్ పి ఎలిజిబెత్. ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్. మరియు ఉపాధ్యాయులు. సూపర్వైజర్ ఎస్ కె అమలేశ్వర రావు. ఏ ఎన్ ఎంలు. ఎం ఎల్ హెచ్ పిలు. హెల్త్ అసిస్టెంట్లు. ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలి

**పెదవేగిలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) -2026 పై అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమీక్ష.**

ప్రజాభూమి ప్రతినిధి–పెదవేగి.



ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) - 2026 కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలను నూరుశాతం పంపిణీని వెంటనే పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఎన్యూమరేషన్ సిబ్బందిని ఆదేశించారు. పెదవేగి మండలం పెదవేగి గ్రామంలో శనివారం బి ఎల్ ఓ లు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో బి ఎల్ ఓ లు, సూపర్వైజర్లతో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) -2026 కార్యక్రమంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు 15,79,042 (96.04%) ఎన్యూమరేషన్ ఫారంలు పంపిణి చేయడం జరిగిందని వీటిలో 3 లక్షల 30 వేల 537 ( 20 %) ఎన్యూమరేషన్ ఫారంలు డిజిటైజేషన్ చేశామన్నారు. పెదవేగి మండలంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 95.42% మాత్రమే చేసారని, ఈరోజు సాయంత్రానికి నూరుశాతం ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ జూలై–14, 2026వరకు కొనసాగుతుందని, ఈనెల 15వ తేదీ నుండి ప్రతి బూత్ లెవెల్ అధికారి , తమ పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించి గణన ఫారంను ఓటర్లకు అందజేసి, వారు పూర్తిచేసిన గణన ఫారాలను డిజిటైజేషన్ చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతీ పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడం, అదేసమయంలో అనర్హులైన వ్యక్తుల పేర్లు ఓటరు జాబితాలో చేరకుండా ఉండడం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ యొక్క ప్రధాన ఉద్దేశ్యమన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఓటర్ల జాబితాలో పేర్లను సరి చేయడం, డూప్లికేట్ పేర్లను తొలగించడం, మరియు కొత్తగా అర్హత కలిగిన వారిని ఓటర్లుగా నమోదు చేయడం జరుగుతుందన్నారు. పార్టీలకతీతంగా బిఎల్ఓ లు విధులు నిర్వర్తించాలని, ఎన్యూమరేషన్ ఫారాలను రాజకీయపార్టీల ప్రతినిధులు ఎవరికీ అప్పగించకుండా బిఎల్ఓ లే ప్రతీ ఇంటికి వెళ్లి అందించి, పూర్తిచేసిన తరవాత తిరిగి తీసుకుని, డిజిటైజేషన్ చేయాలన్నారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) -2026 కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. పెదవేగి మండలంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటైజేషన్ ప్రక్రియలో వెనుకబడి నిర్దేశించిన సమయం లోగా పూర్తిచేయని సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలకు ప్రతిపాదనలు పంపాల ని తహసీల్దార్ ను కలెక్టర్ ఆదేశించా రు. తహసీల్దార్ సిహెచ్. హేమ ప్రసాద్, ఎంపిడిఓ ఎం. నాగేంద్ర కుమార్, బి ఎల్ ఓ లు, సూపర్వైజర్లు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే పునాదులు వేస్తాయి

**అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ లు, సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట



చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీల పాత్ర కీలకమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సీడీపీవో గజలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్స్, వంట సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు పునాదుల వంటివని, వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని 285 అంగన్వాడీ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి ఇండక్షన్ స్టవ్‌తో పాటు కుక్కర్, వంట సామాగ్రిని శనివారం అందజేశారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా డివిజనల్ హెడ్ క్వార్టర్ కొత్తపేటలో 78 కేంద్రాలకు గతంలోనే వీటిని అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆలమూరు 76, రావులపాలెం 70, ఆత్రేయపురం మండలంలోని 61 కేంద్రాలకు సామాగ్రిని పంపిణీ చేస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించడంలో ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల పట్ల ప్రేమ, బాధ్యతతో వ్యవహరిస్తూ వారికి మెరుగైన సేవలు అందించాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులకు మెరుగైన సేవలు అం దేలా అన్ని వసతులను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# యువత మాదకద్రవ్యాల బారిన పడకూడదు



ప్రజా భూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా

మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన ద్వారానే వాటి వినియోగాన్ని నివారించవచ్చని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అభిప్రాయపడ్డారు. నషాముక్త్ భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం నివారణ అవగాహన కార్యక్రమంలో జిల్లా లోని వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసే సిబ్బందికి, పోలీస్ సిబ్బంది, ¬త్రికేయుల మధ్య నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతల కు శనివారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) లతో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలు జోలికి పోకుండా చూడవలసిన గురుతరమైన బాధ్యత మనందరిపై ఉందన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అవగాహన ద్వారానే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించగలమని, సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మన జిల్లాను మార్చడానికి అందరి బాగస్వామ్యం ఎంతో కీలకమని, ఈ దిశగా సమాజంలోని ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితాన్ని తీర్చిదిద్దే అత్యంత కీలకమైన సమయమని, ఈ దశలో మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి వంటి మాధకద్రవ్యాలు వాహనాలు, బస్సులు, రైళ్ల ద్వారా రవాణా జరగకుండా నియంత్రిస్తున్నామని, రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాల సమాచారం తెలిసిన వెంటనే నేషనల్ డెడికేషన్ హెల్ప్ లైను నెంబరు 14446, ఈగల్ టోల్ ఫ్రీ నెంబరు 1972 సంప్రదించాలని, ఫోన్ చేసిన తక్షణం టీమ్లు క్షేత్రస్థాయి లోకి అడుగుపెట్టి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. తొలి దశలోనే జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను అతి సులువుగా తప్పించ వచ్చునని తెలిపారు. ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాటాడుతూ చెడు స్నేహలు వల్ల పిల్లలు దొంగతనాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడతారని, పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఎక్కువ దృష్టి పెట్టాలని కోరారు. డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం ద్వారా యువతలో చైతన్యం తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి డిఅడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందించడం జరుగు తుందన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ విచ్చల విడిగా విక్రయించకుండా ఔషధ దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలన్నారు. క్రికెట్ పోటీలలో ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన పోలీస్, స్వర్ణ గ్రామ,వార్డ్ సచివాలయాలు, గృహ నిర్మాణ శాఖ సిబ్బందికి మెమెంటోలు కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో గంజాయి రవాణా ను అడ్డుకుని, నియంత్రణలో ప్రతిభ కనపరచిన డివిజన్ స్థాయి పోలీస్ సిబ్బందిని అభినందిస్తూ కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే లు మెమెంటోలను అందించారు. మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణపై పాఠశాల, కళాశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం నివారణ పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగం నివారించాలంటూ చేపట్టిన సంతకాల కేంపెయిన్ పై కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ జెడి విశ్వ మోహన్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ శారద, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. రామ్‌కుమార్, సర్వశిక్షా అభియాన్ ఏపిడి పంకజ్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అజీజ్, డిఎస్పీ శ్రావణ్ కుమార్, డీసీపీఓ సూర్యచక్రవేణి, ఎన్జీఓ నాయకులు చోడగిరి శ్రీనివాస్, ప్రభృతులు పాల్గొన్నారు.

## హైస్కూల్లో క్రీడా పరికరాలు ఏర్పాటు



ప్రజాభూమి ప్రతినిధి – నూజివీడు

జిల్లాపరిషత్ హైస్కూల్స్‌లో బాస్కెట్ బాల్ క్రీడాపరికరాల ఏర్పాటు.రాష్ట్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన ¬4 పధకాన్ని స్ఫూర్తిగా తీసుకొని కొంతకాలంగా వ్యాయామ ఉపాధ్యాయులు మరియు సీనియర్ బాస్కెట్బాల్ క్రీడాకారుల భాగస్వామ్యంతో 50000 రూపాయల ఖర్చుతో బాస్కెట్‌బాల్ క్రీడా సామాగ్రి (బాస్కెట్ బాల్ ఉడెన్ బోర్డులు, రింగ్ లు, ఐరన్ పోల్స్) ఏర్పాటుచేసుకోవటం జరుగుచున్నదని బాస్కెట్ బాల్ కోచ్ వాకా నాగరాజు తెలిపారు. ఈ రోజు== జిల్లాపరిషత్ హైస్కూల్ లో కార్యక్రమము చేపట్టడం జరిగినది.ఈకార్యక్రమంలోజిల్లాపరిషత్ హైస్కూల్ రమణక్కపేట, జిల్లా పరిషత్ హైస్కూల్ యనమదల, జిల్లాపరిషత్ హైస్కూల్ దిగవల్లి, జిల్లాపరిషత్ హైస్కూల్ అన్నవరం లో విద్యార్థినీ విద్యార్థులు బాస్కెట్ బాల్ ఆట నేర్చుకొనుట కోసం వ్యాయామఉపాధ్యాయులు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల చేస్తున్న ఈ పనిని నూజివీడు ఉపవిద్యాశాఖాధికారి డాక్టర్ పిఎస్ సుధాకర్ అభినందించారు. ఈకార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయలువాకానాగరాజు,వనజ,సతీష్, మరియు నూజివీడు సబ్ జోన్ చైర్మన్ రవీంద్ర ప్రెసిడెంట్ లక్ష్మి సెక్రటరీ సుగుణరావు లు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడిగా చక్రి నియామకం



ప్రజా భూమి ప్రతినిధి – వేలేరుపాడు

వైయస్సార్ కాంగ్రెస్ వేలేర్ పాడు మండల యూత్ ప్రెసిడెంట్‌గా గ్యారా చక్రిని రాష్ట్ర పార్టీ నియమించింది. చక్రి పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించటం, యువతను ఏకతాటిపై నడిపించడంలో తనదైన పాత్ర పోషించడం గమనించిన మండల అధిష్టానం నియోజకవర్గ ఇన్చార్జిలు రాష్ట్ర పార్టీకి నివేదించడంతో చక్రిని మండల యూత్ ప్రెసిడెంట్‌గా నియమించటం జరిగింది. ఈ విషయంపై చక్రి మాట్లాడుతూ, తాను పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి యూత్ ప్రెసిడెంట్ గా ఎంపిక అయ్యేందుకు కృషిచేసిన మండల పార్టీ కన్వీనర్ కేస గాని శ్రీనివాస్ గౌడ్‌కు,నియోజకవర్గ ఇన్చార్జి తెల్లం బాలరాజుకు రాష్ట్రపార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఇకపై మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు సాయిశక్తుల కృషి చేయగలరని పేర్కొన్నారు.

## నేటి సామాన్య జనసైనికుడే...రేపటి జనసేన నాయకుడు

జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి చంద్రమోహన్



ప్రజాభూమి – బుట్టాయగూడెం

జనసేన పార్టీ సిద్ధాంతాలను నమ్మి, పార్టీకోసం నిరంతరం శ్రమ పడే నిజమైన సామాన్య జనసైనికుడే రేపటి జనసేన నాయకుడని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి చంద్రమోహన్ అన్నారు. మంగళగిరిలో శనివారం జరిగిన జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో పాల్గొన్న అనంతరం బుట్టాయగూడెంలో ఏర్పాటు చేసిన ఇష్టాగోష్టిలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం కమిటీ సీనియర్ సభ్యుడు సాయి చంద్రమోహన్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తల వల్లే జనసేన పార్టీ ఉందని, వాళ్లే పార్టీకి నిజమైన ఊపిరి అన్నారు. తమ నాయకుడు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను నమ్మి, గత పుష్కరకాలంగా పార్టీ కోసం శ్రమ పడుతున్న సామాన్య కార్యకర్తలకు పార్టీలో తగిన ప్రాతినిధ్యం కల్పించి, వారి సేవలను పార్టీకి మరింతగా ఉపయోగించుకునే దిశగా కృషి జరుగుతుందన్నారు. కమిటీ సభ్యుడు గుండుమోగుల సత్యనారాయణ మాట్లాడుతూ తమ నాయకుడు పవన్ కళ్యాణ్ పార్టీ కోసం తాము చేసిన శ్రమను గుర్తించి, గురుతరమైన బాధ్యతను అప్పగించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ కోసం పని చేస్తామని అన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్త సమాచారాన్ని సేకరించి, పార్టీ కార్యాలయానికి తెలియజేయడమే తమ బాధ్యత అన్నారు. క్షేత్రస్థాయిలో తాము పార్టీకి చేసిన సేవలను గుర్తించి తమకు అప్పగించిన బాధ్యతను నిష్పక్షపాతంగా నిర్వహించి, పార్టీ ఉన్నతికి పాటు పడతామని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అడపా నాగరాజు, అడపా వెంకట శ్రీను, పాదం నాగకృష్ణ, పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 30న రొయ్యల పట్టుబడులు నిలిపివేత

- రొయ్యల దాణ దుకాణాలు డీలర్స్ స్వచ్ఛందంగా మూసివేయాలి
- ఆక్వా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు



ప్రజాభూమి ప్రతినిధి – పాలకొల్లు

సాక్షాత్తు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు రొయ్యల మేత ధరలు తగ్గించాలని స్వయంగా ఆదేశించిన మేత ధరలు తగ్గించనందుకు నిరసనగా ఈనెల 30వ తేదీన రొయ్యల పట్టుబడులు పట్టకుండా నిలిపివేయాలని ఆక్వా ఏపీ రాష్ట్ర సంఘం తీర్మానించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా ఆక్వా రైతులతో నిత్యం సన్నిహిత సంబంధాలు కలిగిన స్థానిక మేత డీలర్స్ కూడా అదే రోజు తమ దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి తమకు మద్దతు పలకాలని గాంధీ భగవాన్ రాజు కోరారు. వైరస్ వచ్చిన చెరువులు తప్ప మిగిలిన అన్ని చెరువుల రైతులు ఐక్యతతో ఒక్కరోజు రొయ్యల పట్టుబడులను నిలిపివేసి నిరసన తెలపాలని ఆయన కోరారు. వారం రోజుల క్రితం సీఎం, వ్యవసాయ మంత్రి కిలో మేతకు ఎనిమిది రూపాయలు తగ్గించాలని కోరిన అలా తగ్గించకుండా రెండు రూపాయలు మాత్రమే తగ్గించి ఫీడ్ కంపెనీ యజమానులు రైతు లను మోసగించారని ఆయన విమర్శించారు. త్వరలోనే రాష్ట్రస్థాయిలో కోనసీమ,ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల సంఘ కన్వీనర్ లతో సమావేశం ఏర్పాటు చేసి 50, 000 నుంచి నంబర్లు వేయకుండా చూసే విధంగా కోరతమన్నారు. మేత ధరలు పెరిగిపోవడం, మరోవైపు రొయ్యలు ధరలు తగ్గించడం తో ఆక్వా రైతులు తీవ్ర అప్పులలో మునిగిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ దాణ కంపెనీల యజమానులు దిగురాకుంటే భవిష్యత్ కార్యాచరణ రాష్ట్రస్థాయిలో రూపొందించుకుంటామని గాంధీ భగవాన్ రాజు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు కణపతి నరసింహారాజు, ఈశ్వర రాజు, సంజీవరాజు, వేగేసిన శ్రీహరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోలియో మహమ్మారిని తరి మెద్దాం



ప్రజాభూమి ప్రతినిధి – వి.ఆర్.పురం.

మండలంలోని రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ నీలుఫర్ ఆధ్వర్యం లో పల్స్ పోలియో ఇమ్యూనైషన్ ప్రోగ్రాం గురించి, నిండు జీవిత నికి రెండు చుక్కలు, తరి మెద్దాం తరి మెద్దాం పోలియో ను తరి మెద్దాం, వేయిద్దాం వేయిద్దాం పోలియో చుక్కలు వేయిద్దాం ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ రేఖపల్లి పి హెచ్ సి నుండి రేఖపల్లి జంక్షన్ వరకు ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ నేడు పల్స్ పోలియో చుక్కల మందు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అప్పుడే పుట్టిన పిల్లలు నుండి 5సంవత్సరాలు వారికీ తప్పకుండ పోలియో చుక్కలు వెయ్యించాలనీ, పోలియో వ్యాధి ఇక రాకుండ చూడాలనీ అన్నారు. ఈ పోలియో చుక్కలు వేసే ప్రదేశాలు అంగన్వాడీ సెంటర్స్, సబ్ సెంటర్, స్కూల్స్, బస్సు స్టాండ్ లోసంతలో వెయ్యబడును కావున ప్రజలందరూ 0నుండి 5సంవత్సరాలు పిల్లలు కనబడితే తాప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. ఆయుష్ డాక్టర్ స్వర్ణలత, పిహెచ్ఎన్ భద్రకాళి, ఏఎన్ఎంలు హెల్త్ అసిస్టెంట్‌లు, సిహెచ్ఓలు ఆశలు పాల్గొన్నారు.

## సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతులను ఆదుకోవాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్



ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా

ఆక్వా రంగం,ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, సంక్షోభం లో ఉన్న ఆక్వా రైతులను అన్ని విధాలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జులై 3,4,5 తేదీల్లో జరుగుతున్న రైతు సంఘం రాష్ట్ర మహాసభలు సందర్భంగా శనివారం ఏలూరులోని ఉద్దరాజు రామం భవనంలో ఆక్వారంగ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదే శ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రంప్ సుంకాలు, అమెరికా సాగిస్తున్న యుద్ధాలు వలన ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని చెప్పారు. అయితే ఇక్కడ వ్యాపారులు, ఎగుమతి దారులు సిండికేట్ గా మారి రొయ్యలు, చేపలకు తక్కువ ధరలు ఇవ్వడం వలన ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. సిండికేట్ వ్యాపా రాన్ని అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. పైగా ఇటీవల ఫీడ్ కంపెనీలు ఆక్వా మేత ధరలను విపరీతంగా పెంచి వేయడం దారుణమన్నారు. దీనివలన ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రొయ్యల మేత ధరలు కిలోకు రూ.10 లు వరకు పెంచారన్నారు. పెంచిన ఆక్వా మేత ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన ఫీడ్, నాణ్యమైన సీడ్ రైతులకు అందించాలని కోరారు. నష్టపోతున్న ఆక్వారైతులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ వలన కొల్లేరు ప్రాంత రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని, సాంప్రదాయ వ్యవసాయానికి అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్ రద్దు చేయాలన్నారు. విత్తన మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి. విత్తన మొక్కజొన్న రైతులకు కంపెనీల నుండి ఇవ్వాల్సిన పంట బకాయిలు వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు కోరారు. విత్తన కంపెనీల మోసాలను అరికట్టాలన్నారు.

**జులై 3న హాలో రైతన్న – ఛలో ఏలూరు**

జులై 3న రైతు సంఘం రాష్ట్ర మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న హాలో రైతన్న,చలో ఏలూ రు కార్యక్రమంలో అన్ని పంటల రైతులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం ఆహ్వాన సం ఘం నాయకులు ఆర్. లింగరాజు, పి.రవి కుమార్, ఎం.ఇస్సాకు, కె.రామాంజనేయులు, ఎస్.సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాడపాలెంలో ఘనంగా ఛత్రపతి శివాజీ హిందూ సామ్రాజ్య దినోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి – కొత్తపేట

బీజేపీ సీనియర్ నాయకులు, ఆత్మ కమిటీ డైరెక్టర్ పాలాటి మాధవ స్వామి ఆధ్వర్యంలో వాడపాలెంలో ఛత్రపతి శివాజీ హిందూ సామ్రాజ్య దినోత్సవం (పట్టాభిషేక దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పాల్గొని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కోనసీమ బౌద్ధ ప్రముఖ్ తోగరు ఆంజనేయులు మాట్లాడుతూ, హిందూ సామ్రాజ్య స్థాపనలో ఛత్రపతి శివాజీ చేసిన సేవలు చిరస్మరణీయమని, 1674లో జరిగిన ఆయన పట్టాభిషేకం భారత చరిత్రలో ఒక విశిష్ట ఘట్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెదపూడి బాపిరాజు, పాలూరి జయప్రకాశ్ నారాయణ, గొలకోటి వెంకటేశ్వరరావు, కోటిపల్లి రఘురామ్, సిద్ధంశెట్టి గంగారావు, సిద్ధంశెట్టి శంకర్, రేలంగి ఆంజనేయులు, సానబోయిన కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉధృతంగా పొంగి ప్రవహించిన అన్నవరం వాగు



ప్రజాభూమి ప్రతినిధి – వి.ఆర్.పురం.

మండలంలో శనివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షం వల్ల రేఖపల్లి పంచాయతీ పరిధిలోని అన్నవరం ఉమ్మడివరం గ్రామాల మధ్య గల వాగు ఉధృతంగా పొంగి ప్రవహించింది. మండలంలోని చుట్టూ పక్కల అటవీ కొండల ప్రాంతాల్లో కురిసిన వర్షం ప్రభావంతో అన్నవరం వాగు తాత్కాలికంగా పొంగి ప్రవహించింది. దీంతో దాదాపు నలభై గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రాకపోకలు స్తంభించటంతో స్థానిక గిరిజనులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అన్నవరం వాగుపై కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న లోలెవెల్ వంతెన పనులు పూర్తికాకపోటంతో వర్షం వచ్చినప్పుడల్లా వాగు పొంగి ప్రవహిస్తుంది, దీంతో అటుగా ప్రయాణించే వారికి, మండల కేంద్రానికి పలు పనుల మిది వచ్చేవారికి, దూర ప్రయాణాలు చేసే వారికి, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు అంతరాయంగా మారింది ఈ అన్నవరం వాగు. అసలే వర్షాకాలం రానున్న రోజుల్లో మరింతగా వర్షాలు పడే అవకాశం వుంది, ఈనేపథ్యంలో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ అన్నవరం వాగుపై నిర్మిస్తున్న తాత్కాలిక వంతెనను త్వరగా పూర్తి చేయాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

## పోలవరం ముంపు బాధితులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది



ప్రజాభూమి ప్రతినిధి – వి.ఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోతున్న పోలవరం ముంపు బాధితులు అయిన రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులు పడకపోవటం చాలా బాధాకర విషయం అని, పోలవరం ముంపు బాధితులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందనీ, చిన్నమట్టపల్లి మాజీ సర్పంచ్ పిట్ట రామారావు, ఎస్టీసెల్ అధ్యక్షుడు కోటశీజయరాజు విమర్శించారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఈ కూటమి ప్రభుత్వం, 3 జీవో గురించి కూడా ఎన్నికలకు ముందు మాట ఇచ్చి ఇప్పటివరకు దాని గురించి మాట్లాడకపోవడం చాలా బాధ కర విషయం అని అన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా ప్రతి పేద రైతుకి అందే విధంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రైతు ఖాతాలో డబ్బులు వేసి అందరూ సమానమే అని నిరూపించారని, ఇప్పుడున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోవటం లేదు అని అడిగితే మీరు ముంపులో ఉన్నారు అని దాటవేస్తున్నారని, విత్తనాలు గాని ఎరువులు గాని అడిగితే మీరు ముశీపులో ఉన్నారు అని అధికారులు చెప్తున్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ముంపు బాధితులైన రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపచేయలని అలాగే విత్తనాలు ఎరువులు కూడా ముంపు బాధితులకు అందే విధంగా ఆలోచన చెయ్యాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

## రావులపాలెం సి.ఆర్.సిలో ఉచిత రెసిడెన్షియల్ యాక్టింగ్ వర్క్ షాప్



ప్రజాభూమి ప్రతినిధి – కొత్తపేట

కేంద్ర సాంస్కృతిక శాఖ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సి.ఆర్.సిలో జూలై 5 నుంచి మూడు వారాల ఉచిత రెసిడెన్షియల్ యాక్టింగ్ వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రంగస్థల శాఖ హెచ్.ఓ.డి డాక్టర్ ఎల్.వి. భూషన్ తెలిపారు. శనివారం రావులపాలెం సి.ఆర్.సిలో సి.ఆర్.సి సెక్రటరీ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఉభయగోదావరి జిల్లాలు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని నటన పట్ల ఆసక్తి కలిగిన వారి కోసం ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 15 నుంచి 40 ఏళ్ళ లోపు వయసు కలిగి నటన పట్ల ఆసక్తి కలిగిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి ఉచితంగా గురుకుల వాతావరణంలో ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కేవలం 40 మందికి మాత్రమే అవకాశం ఉందని ఆసక్తి ఉన్న వారు రావులపాలెం సి.ఆర్.సిలో గాని, కో ఆర్డినేటర్ భాస్కర్ ( ఫోన్ 9676436363) నెంబర్ ను గాని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకారం అందిస్తున్న సి.ఆర్.సి కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో సి.ఆర్.సి డైరెక్టర్లు సత్తి సూర్య భాస్కరరెడ్డి ( చిన్న బుజ్జి), ఆర్.వి.ఎస్. రామాంజనేయరాజు, గెస్ట్ ఫ్యాకల్టీ, నటి గుడివాడ లహరి, నటులు గంటా రామ్మోహన్, ఆక్వా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఓలు బాధ్యతగా తమ పరిధిలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలి..

## - : అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

బిఎల్ఓలు బాధ్యతగా తమ పరిధిలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవనీ, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురము నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో అనంతపురము రూరల్, అర్బన్, రాప్తాడు, బీకే సముద్రం తదితర దగ్గరలోని మండలాల బిఎల్ఓలు తమ పరిధి లోని ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ పురోగతి



80 శాతం కన్నా తక్కువ ఉన్న వారికి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పురోగతి తక్కువకు గల కారణాలను వారిని అడిగి కలెక్టర్ తెలుసుకుని, అవగాహన కల్పించారు. వారి పరిధిలోని ఓటర్లకు ఫోన్ చేసి వారు అందుబాటులో లేకపోవడానికి కారణాలు, వారి గృహ సంఖ్య నందు లేకపోవడం తదితర కారణాలు తెలుసుకుని వారికి ఈఎఫ్ ఫారాలు పంపిణీ, వివరాల నమోదు చేసే అంశం సమన్వయం చేసుకుని పురోగతి చూయించాలని ఆదేశించారు. ఈఎఫ్ ఫారాలు పూరింపు, డిజిటలైజేషన్ అంశాలను పరిశీలించి వారిని పలు వివరాలు అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. నేటి మధ్యాహ్నానికి పురోగతి ఉండాలని తెలిపారు. మెప్మా, డిఆర్డిఏ ప్రతినిధులు వారి పరిధిలోని గృహాల సందర్శన చేసి వారికి ఎస్ఐఆర్ పై తెలిపి బిఎల్ఓ ఈఎఫ్ ఫారాలు ఇస్తారని వాటిని పూరించడం తెలిపి మళ్ళీ వారికి అప్పగించాలని, బిఎల్ఓ వివరాలు తెలపమని చెప్పామని తద్వారా త్వరితగతిన, పూర్తి అవగాహనతో ఎన్యూమరేషన్ పూర్తికి అవకాశం ఉందని బిఎల్ఓ లు, బిఎల్ఏ సమన్వయంతో ఉదయం గృహ సందర్శనలు అయ్యాక మధ్యాహ్నం పైన ఒక కామన్ ప్రాంతం పోలింగ్ కేంద్రం వద్ద ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మలోల, ఈఆర్ఓ రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ జశ్వంత్ రావు, ఉదయకుమార్, రాజా, ఎలక్షన్ డిటి కనక రాజు,శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగరక్షణకోసం ఛలోవిజయవాడ' కరపత్రాల విడుదల

ప్రజాభూమి, పుట్లూరు.



జూన్ 30న రైతులకోసంజరిగే ధర్నాకార్యక్రమాన్నిజయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘాలుగా పిలుపు నివ్వడం జరిగినది. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జూన్ 30న నిర్వహించనున్న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పుట్లూరు మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కౌలు రైతు నాయకులు కరపత్రాలను విడుదల చేశారు.మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సమీపంలోని హోటల్ దగ్గర కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.టి.రామాంజనేయులు, సిపిఐ సీనియర్ నాయకులు రైతు సంఘం మండల గౌరవ అద్యక్షులు బుసగాని చిన్ని కృష్ణుడు యాదవ్,రైతు సంఘంమండల కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్, మండల అద్యక్షుడు ఎన్. గోపాల్ కృష్ణ, ఆధ్వర్యంలో రైతు సంఘం సీనియర్ నాయకులు, రైతులు,కార్యకర్తలు కలిసి 'చలో విజయవాడ' కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీటి రామాంజనేయులు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలను పట్టించుకోవడం లేదు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి, రూ.2 లక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేయాలి, బకాయి ఉన్న ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.7 లక్షల పరిహారం ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు.స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు కల్పించాలి. 50 ఏళ్ల దాటిన రైతులకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలి. ఈ డిమాండ్ల సాధన కోసమే జూన్ 30న 'చలో విజయవాడ' చేపట్టాం. పుట్లూరు మండలం నుంచి పెద్ద ఎత్తున రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, రైతు సంఘం మండల నాయకులు పూలరంగడు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ చిన్న కులాయప్ప, ఓబుల్ రెడ్డి,ఆంజనేయులు, రైతులు గంగయ్య,నాగేశ్వర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి రామలింగారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యత

## -ఎమ్మెల్యే సొంత నిధులతో చిన్నారుల వైద్యానికి మందుల పంపిణీ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారుల వైద్యానికి తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అందుకు అనుగుణంగానే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కృషి చేస్తున్నారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సొంత నిధులతో చిన్నారులకు అవసరమైన వెయ్యి సిట్రజిన్ హైడ్రోక్లోరైడ్ సిరప్‌లు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వితరణగా సూపరింటెండెంట్ డాక్టర్ రాజగోపాల్ కు అందజేశారు. ఇందులో భాగంగా వీరయ్య మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ, అవసరమైన సమయంలో సేవా కార్యక్రమాలతో ముందుండే వ్యక్తి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. బాలయ్య సేవా దృక్పథానికి ఇది మరో నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నా నియోజకవర్గ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం ఆలోచిస్తుంటారని, అందుకు అనుగుణంగానే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నవీన్ నిశ్చల్ జన్మదిన వేడుకలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



డాక్టర్ బివి సాయిప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నవీన్ నిశ్చల్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీచర్స్ కాలనీలోని తన వ్యక్తిగత కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన అభిమానుల నడుమ నవీన్ నిశ్చల్ కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా అభిమానులు పూలమాలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి తో పాటు పలువురు మాజీ కౌన్సిలర్లు, నాయకుడు నవీన్ నిశ్చల్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నాయకులు పాల్గొన్నారు.

# నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

## -ఆర్.వి. ప్రో అకాడమీ డైరెక్టర్ అర్జున్ భరద్వాజ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశలోనే అలవర్చుకుంటే భవిష్యత్తులో సమాజానికి ఆదర్శవంతమైన నాయకులుగా ఎదగవచ్చని బెంగళూరుకు చెందిన ఆర్.వి. ప్రో అకాడమీ డైరెక్టర్ అర్జున్ భరద్వాజ్ పేర్కొన్నారు. హిందూపురం రూరల్ మండలం కిరికెర సమీపంలో ఉన్న ఎల్‌ఆర్‌జీ నాయుడు జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన విద్యార్థి నాయకత్వ బాధ్యతల అప్పగింత కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్జున్ భరద్వాజ్ మాట్లాడుతూ, నాయకత్వం అంటే పదవి మాత్రమే కాదని,



బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావం, నిజాయితీ, సమన్వయంతో ముందుకు నడిపించే సామర్థ్యమన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకుంటే విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా సాధ్యమవుతుందని చెప్పారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ జట్టును ముందుకు నడిపించే లక్షణాలు ప్రతి విద్యార్థిలో ఉండాలని సూచించారు. అనంతరం నాయకత్వ బాధ్యతలకు ఎన్నికైన విద్యార్థులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బ్రహ్మచారి మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సేవా దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకత్వ బాధ్యతలు చేపట్టిన విద్యార్థులు కళాశాల క్రమశిక్షణకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఎల్‌ఆర్‌జీ విద్యాసంస్థల డైరెక్టర్ నిఖిల్ గోవింద రామ్మూర్తి మాట్లాడుతూ, విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యాసంస్థ కార్యదర్శి బాలసుందరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సంజీవరెడ్డి, ఎల్‌ఆర్‌జీ సీనియర్ సెకండరీ ప్రిన్సిపాల్ భారతి, ఎల్‌ఆర్‌జీ విద్యాలయ ప్రిన్సిపాల్ సుధా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సర్దుబాటుకు జులై 15వ తేదీని ప్రామాణికంగా తీసుకోవాలి

## -వినతి పత్రం అందజేసిన ఎంటీఎఫ్ నాయకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ఉపాధ్యాయుల సర్దుబాటుకు జూలై 15వ తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని మున్సిపల్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు విన్నవించారు. ఈ మేరకు శనివారం మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రకాశ్ కు ఎంటిఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ, 2026- 27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల సర్దుబాటును జూన్ 20వ తేదీ ప్రామాణికంగా సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం జూన్ 20 తర్వాత ఎక్కువ మంది నూతన విద్యార్థులు పాఠశాలల్లో నమోదు కావడం జరిగిందని, పాత తేదీ ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం వల్ల ఎక్కువ మంది ఉపాధ్యాయులు సర్ ప్లస్ గా పరిగణించబడతారని పేర్కొన్నారు. అలాంటి వారిని సర్దుబాటు కింద ఇతర పాఠశాలలకు పంపించడం వల్ల ఇప్పుడు వారు పనిచేస్తున్న పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా తెలుగు, ఉర్దూ ప్రథమ భాషగా కలిగినటువంటి విద్యార్థులు ఒకే పాఠశాలలో చదువుతుండడం వల్ల భాషా ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించి విషయంలో లోపాలు దొర్లుతున్నాయని, పట్టణ ప్రాంతాలలో మైనర్ మీడియా పాఠశాలలకు మినహాయింపులు ఉంటాయని, వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని పని సర్దుబాటుకు జూలై 15వ తేదీ విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని సర్దుబాటు చేయాలని, దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళిన ఉపాధ్యాయుల విషయంలో సర్దుబాట్ల మినహాయింపులు ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నటువంటి మోడల్ ప్రైమరీ స్కూల్ లకు ఉపాధ్యాయుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాస్, సలహాదారు పెన్నోబిలం, జిల్లా అధ్యక్షులు జనార్దన్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ, హిందూపురం పట్టణ శాఖ నాయకులు మురళీకృష్ణ, శివ గంగిరెడ్డి, జగదీష్, పాండురంగ, రామిరెడ్డి, కాలవ మురళి, శాంతాబాయి తదితరులు పాల్గొన్నారు.

# నేడు రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఆదివారం రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం జరిగిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో ఏపీఎస్ ఆర్టీసీ లో ఎలక్ట్రికల్ బస్సులు, బస్టాండ్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం అనే అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆర్టీసీ సంస్థకే ఆ బస్సులు అప్ప చెప్పాలని, ఏ ఒక్క బస్టాండ్ ను ప్రైవేటు పరం చేయకూడదని పేర్కొన్నారు. పురసేవలను మున్సిపల్ రంగంలో 975, 673 జీవోల ప్రకారం 14 పౌర సేవలను ప్రైవేటు వారికి ఇచ్చే ప్రయత్నం సిద్ధమవుతున్నారని, ఇదే జరిగితే పట్టణ ప్రజలపై పెద్ద ఎత్తున భారం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పుడే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంపు కారణంగా ప్రతి నిత్యవసర సరుకుల ధరలు భారీగా పెరిగిపోయాయని, పురసేవల ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడితే పన్నుల భారం తీవ్రంగా ఉంటుందన్నారు. నిత్యవసర సరుకుల ధరల



పెరుగుదలతో హోటల్, రెస్టారెంట్ లో తినుబండారాలు పూర్తిగా తినలేని స్థితికి చేరుకుంటాయని, ఈ విధంగా ప్రజలపై పన్నుల మోత పడుతుందని చెప్పారు. ఆయా విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజల సంక్షేమం కోసం హిందూపురం రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు కలిసి ఆందోళన కార్యక్రమాల నిర్వహించడానికి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి ఏ. శ్రీనివాసులు, బీఎస్పీ రాష్ట్ర నాయకులు శ్రీరాములు, వైయస్సార్సీపి మైనార్టీ సెల్ నాయకులు అమానుల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు జమీల్, ఎమ్మెస్ఎఫ్ నాయకులు రవికుమార్, దళిత సమైక్య జిల్లా అధ్యక్షులు ఎస్.నారాయణ, ఆల్ ఇండియా బిఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు హరి కుమార్, సమాజ్ వాది పార్టీ తౌసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌పీల గౌరవ వేతనాన్ని ప్రభుత్వమే చెల్లించాలి -మెప్మా పీడీకి హిందూపురం ఆర్‌పీల వినతి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మెప్మా విభాగంలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ల (ఆర్‌పీలు) గౌరవ వేతనాన్ని ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని, స్వయం సహాయక సంఘాల సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్) నిధుల నుంచి చెల్లించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ హిందూపురం పట్టణ రిసోర్స్ పర్సన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హిందూపురం పర్యటనకు వచ్చిన మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)కి ఆర్‌పీలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌పీలు మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా మెప్మా సంస్థ ద్వారా పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాల సభ్యులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు, సంఘాల బలోపేతం, మహిళల ఆర్థిక సాధికారత కోసం సేవలందిస్తున్నామని తెలిపారు. తమ సేవలను గుర్తించిన ప్రభుత్వం 2014లో గౌరవ వేతనం మంజూరు చేసిందని, అప్పటి నుంచి ప్రస్తుతం వరకు నెలకు రూ.8 వేల గౌరవ వేతనం మాత్రమే అందుతోందని పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా గౌరవ వేతనాన్ని పెంచాలని ఎన్నోసార్లు ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ 13వ తేదీన జారీ చేసిన జి.ఓ.ఎంఎస్. నెం.319 ప్రకారం ఆర్‌పీల గౌరవ వేతనాన్ని సంబంధిత ఎస్ఎల్ఎఫ్ నిధుల నుంచి చెల్లించాలని, అనంతరం ప్రభుత్వం బడ్జెట్ విడుదలైన తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి ఎస్ఎల్ఎఫ్ ఖాతాలకు జమ చేస్తామని సర్క్యులర్ ద్వారా తెలియజేసినట్లు వివరించారు. ఈ నిర్ణయాన్ని స్వయం సహాయక సంఘాల సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. మహిళలు పైసా పైసా కూడబెట్టి సమకూర్చుకున్న సంఘ నిధులను గౌరవ వేతనాల కోసం వినియోగిస్తే ఎస్ఎల్ఎఫ్‌లు ఆర్థికంగా బలహీన పడే పరిస్థితి ఏర్పడుతుందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎల్ఎఫ్ నిధుల నుంచి గౌరవ వేతనం తీసుకోవడం తమకు కూడా ఇష్టం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వమే తమ సేవలను గుర్తించి గౌరవ వేతనం అందిస్తోందనే నమ్మకంతో ఇన్నేళ్లుగా విధులు నిర్వహించామని, ఇప్పుడు ఆ బాధ్యతను సంఘాల నిధులపై మోపడం సరికాదని ఆర్‌పీలు పేర్కొన్నారు. ప్రభుత్వం నేరుగా గౌరవ వేతనాన్ని కొనసాగించడంతో పాటు ప్రస్తుతం ఇస్తున్న రూ.8 వేల వేతనాన్ని పెంచి తమ సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఈ సమస్యను సానుభూతితో పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆర్‌పీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, హిందూపురం పట్టణ ఆర్‌పీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మి, కార్యదర్శి ఆసియా భాను, రామాంజినమ్మ, ముద్దమ్మ, గంగరత్న, రమణమ్మ, నాగలక్ష్మి, మణి తదితర ఆర్‌పీలు పాల్గొన్నారు.

# జనసేన నూతన కమిటీల ఏర్పాటు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో విజయవాడ మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలులో సమావేశంనిర్వహించారు. పార్టీకి సంబంధించిన నూతన కమిటీల ఏర్పాటు, భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా నూతన కమిటీలను ఏర్పాటు చేశారు.హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గం నుండి 28 మంది సభ్యులను పవన్ కళ్యాణ్ ఎంపిక చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 పార్లమెంట్ నియోజకవర్గాల నుండి ఎంపిక చేసిన సభ్యులతో కలిపి, దాదాపు 700 మంది జనసేన పార్టీ సాధికారిక సమాచార కమిటీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కమిటీలు ఎలా పనిచేయాలి, క్షేత్రస్థాయిలో పార్టీని ఎలా బలోపేతం చేయాలనే అంశాలపై నాయకులకు, సభ్యులకు స్పష్టమైన మార్గదర్శకత్వాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు కొల్లకుంట శేఖర్ తో పాటు హిందూపురం జనసేన పార్టీ నిర్మాణ సాధకుల సమాచార సినియర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా వైకాపా నాయకులు రాజుల భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు

## రాజుల యువసేన ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, అనుచరులు



ప్రజాభూమి, పులివెందుల

వైకాపా నాయకులు రాజుల భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను రాజుల యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన నివాసం వద్ద అభిమానులు, అనుచరులు పెద్ద సంఖ్యలో పాల్గొని భాస్కర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాజుల యువసేన సభ్యులు కేక్ కట్ చేసి భాస్కర్ రెడ్డికి తినిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. భాస్కర్ రెడ్డి ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, రాజుల యువసేన ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

# సీఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని నిరసన

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వేంకటేశ్వర రావు కుమారుడు క్రాంతికుమార్ ఆత్మహత్యకు కారణమైన కృష్ణలంక సీఐ నాగరాజుపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సీఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం అంబేద్కర్ సర్కిల్ లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజధాని కేంద్రమైన విజయవాడలో సాయికృష్ణ, క్రాంతికుమార్ అనే దళిత యువకులను కూటమి ప్రభుత్వం పొట్టనపెట్టుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రతిపక్షంలో ఉన్నపుడు ఏ చిన్న సంఘటన జరిగినా దళితులకు రక్షణ లేదని ఖండించి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక మంది దళితుల వేధింపులు, పోలీసుల వేధింపులు పెద్దఎత్తున పెరిగాయని తెలిపారు. దళిత మహిళలకు పూర్తిగా రక్షణ కరువయిందని, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆయా కుటుంబాలను పరామర్శించక పోవడం శోచనీయమన్నారు. నష్టపోయిన ఆయా కుటుంబాలకు రూ. 50 లక్షల వంతుల నష్టపరిహారం, ప్రభుత్వం ఉద్యోగం, 5 భూమి ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సీఐ నాగరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కేసు నమోదు చేసి విధుల నుండి పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.పి. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బియస్పీ రాష్ట్ర నాయకులు శ్రీరాములు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, దళితసమైక్య జిల్లా అధ్యక్షులు నారాయణ, వైకాపా మైనారిటీ రాష్ట్రనాయకులు అమానుల్లా, నాయకులు హరి, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి నిత్విక హత్య కేసులో మహిళ అరెస్ట్

## వివరాలు వెల్లడించిన డిఎస్పి మురళి నాయక్



ప్రజాభూమి,పులివెందుల

లింగాల మండలంలోని లోపట్నుతల గ్రామంలోని చిన్నారి నిత్విక హత్య కేసులో ముద్దాయి స్వాతిని అరెస్టు చేసినట్లు డి. ఎస్. పి మురళి నాయక్ తెలిపారు. శనివారం స్థానిక డిఎస్పీ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లింగాల మండలం లోపట్నూతల గ్రామానికి చెందిన రామాచారి సృజనల కుమార్తె నిత్విక గ్రామంలోని కృష్ణయ్య ఇంటి ఆవరణలో ఉన్న బాత్రూంలోని నీళ్ల డ్రమ్ములో మృతి చెందిన సంగతి విదేతమే. హత్య జరిగిన అనంతరం రాత్రికి రాత్రే దర్యాప్తు వేగవంతం చేశామన్నారు. ఈ కేసు సంబంధించి జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం,సి సి ఫుటేజ్ ఆధారంగా 24 గంటలలోపే ముద్దాయిని గుర్తించడం జరిగిందన్నారు. స్వాతి అనే ముద్దాయి ని శనివారం రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద అరెస్టు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన శశికళ,సృజన,స్వాతి ఏడు సంవత్సరాలుగా స్నేహితులు వారి మధ్య స్నేహం విడిపోవడంతో మనస్థాపానికి లోనైనా స్వాతి దంపతులు సృజన రామాచారి లతో తరచూ గొడవలు పడేవారన్నారు. అలాగే ఇంటి వద్ద చిన్న పిల్లల గొడవలతో వీరి స్నేహం మరింత దూరమైందన్నారు.దీంతోగతంలో రామాచారి వాహనాలను కూడా స్వాతి వెంకటరామిరెడ్డిలు దగ్ధం చేయడం కూడా జరిగిందన్నారు. ద్విచక్ర వాహనాలు తగలబెట్టడంతో నిత్విక అవ్వ లక్ష్మి స్వాతిని ప్రతిరోజు బూతులు తిడుతుండడంతో సుజనా పై కక్ష పెంచుకొని సృజన కూతురు నిత్వికను నీళ్ల డ్రమ్ములో ముంచి చంపినట్లు విచారణలో స్వాతి ఒప్పుకున్నట్లు డిఎస్పి తెలిపారు. అరెస్టు చేసిన స్వాతిని కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో రూరల్ సీఐ శాంతి లాల్, అర్బన్ సీఐ శ్రీరామ్, ట్రాఫిక్ సిఐ ప్రసాద్ రావు, ఆర్కే వ్యాలీ సిఐ శంకర్ రెడ్డి,వేంపల్లి సిఐ నరసింహులు, ఎస్సైలు జగదీశ్వర్ రెడ్డి,తిమోతి,క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలి

- పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని కేంద్రానికి డిమాండ్
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

ఇటీవల పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వేంపల్లెలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగాయన్న కారణంతో కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచిందని, ప్రస్తుతం ముడి చమురు ధరలు తగ్గిన నేపథ్యంలో పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని కోరారు. పెట్రోల్, డీజిల్పై పెంచిన రూ.8, వంట గ్యాస్ సిలిండర్పై పెంచిన రూ.89, కమర్షియల్ గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, చక్రాయపేట మండల అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, వేముల మండల అధ్యక్షుడు వెంకటేశు, సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య, వేమరాజా తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

## -ప్రజా సమస్యల పరిష్కారంకోసమే ప్రజా దర్బార్

## -ప్రజా దర్బార్లో బీటెక్ రవి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందులలో టిడిపి జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని, ఓటర్ లిస్టులో అవకతవకలు లేకుండా చూసుకోవా ల్సిన బాధ్యత మనందరిపై ఉందని, రాష్ట్రాన్ని చంద్ర బాబు నాయుడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా డని ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, రాష్ట్రంలో వైకాపా పార్టీని ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని, ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) అన్నారు. శనివారంఆయన టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గం నుండి వచ్చిన ప్రజల నుండి పలు సమస్యలను సావదానంగా విని, వారిచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను విని సంబంధిత అధికారులతో చర వాణిలో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారాం కోసం ఎప్పటికీ అందుబాటులో ఉంటాం అన్నారు.ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ముందుంటామన్నారు. పులివెం దుల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే మా ప్రధాన ధ్యేయం అని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒకటి ఒకటి నెరవేర్చుకుంటూ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అన్నా రెడ్డి ప్రసాద్ రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ ఎమ్మెల్యే నానాజి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**-రాజకీయ విమర్శలు హద్దులు దాటకూడదు**

**-డి. ఎన్. పి కి వినతి పత్రం అందజేసిన వైకాపా నాయకులు**



ప్రజాభూమి,పులివెందుల

రాజకీయ విమర్శలు హద్దులు దాటకూడదని కాకినాడ ఎమ్మెల్యే నానాజీ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, పార్నపల్లె కిషోర్, వైకాపా దూదేకుల సంఘం అధ్యక్షుడు ఓతూరు రసూల్, మాజీ కౌన్సిలర్ కోడి రమణ డిమాండ్ చేశారు. శనివారం మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై అసభ్యకరమైన రెచ్చగొట్టే విధమైన వ్యాఖ్యలు చేసిన కాకినాడ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు( నానాజీ )పై చర్యలు తీసుకోవాలని వైకాపా నాయకులు డి. ఎస్. పి కి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై కాకినాడ ఎమ్మెల్యే అసభ్యకరమైన మాటలు మాట్లాడారని జగన్ గాడికి దమ్ముంటే నానాజీ మీద పోటీ చేయమనండి,జగన్ ను కాకినాడ రూరల్ లో పోటీ చేయమనండి అని వ్యాఖ్యానించడమే కాకుండా వ్యక్తిగతంగా కించపరిచే పదజాలాన్ని ఉపయోగించారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ విమర్శల అద్దులను దాటి ఒక ప్రజా ప్రతినిధి మాజీ ముఖ్యమంత్రిని అవమానించేందుకు చేసినవిగా స్పష్టమవుతున్నాయన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలలో విస్తృతంగా ప్రచారం చేస్తుండడం వలన రాజకీయ పార్టీలు వ్యక్తుల, కులాల మధ్య ప్రాంతాల మధ్య విద్వేషాలు, ఉద్విగతలు పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని ఇటువంటి చర్యలు రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందన్నారు. అవునా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్వేషాలను రెచ్చగొట్టిన వ్యక్తులను గురించి వారిపై చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైకాపా నాయకులు కోళ్ల భాస్కర్, ఈశ్వరయ్య, డేరంగుల చంద్రమౌళి, మాజీ కోఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, కొంగనపల్లె మురళి, కొంగనపల్లె రవి, సోఫాల వీరా, రవి, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏటి గంగమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

## - పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని భాకరాపేట సమీపంలో నూతనంగా నిర్మించిన ఏటి గంగమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఏటి గంగమ్మ అమ్మవారి మూలవిరాట్టు విగ్రహాన్ని టీడీపీ సీనియర్ నేత, రాజంపేట పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షులు పుత్తా



రామచంద్రయ్య సమర్పించగా, పోతురాజు విగ్రహాన్ని ఆర్టీసీ కండక్టర్ మనోహర్ రెడ్డి అందించారు. అమ్మవారి ఆలయ నిర్మాణం గ్రామస్తుల సహకారంతో పూర్తి చేసి, వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ప్రత్యేక చండీ హోమం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పూర్ణాహుతి, మంగళ హారతి తదితర విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా వేద పండితులు సురేష్ బాబు మాట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో గ్రామానికి శుభం కలుగుతుందని, ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరిపై అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని తెలిపారు. భక్తుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. సిద్ధవటం ఎస్సై హారిక అమ్మవారిని దర్శించుకొని పూలమాల సమర్పించారు. అనంతరం పుత్తా రామచంద్రయ్య కుటుంబ సభ్యులు ఎస్సై హారికను పూలమాలతో, శాలువాతో ఘనంగా సత్కరించి వేద పండితుల ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో భాకరాపేట పరిసర ప్రాంతాల్లో భక్తి వాతావరణం నెలకొంది.

# భాకరాపేట చెక్పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు



ప్రజాభూమి, సిద్ధవటం: కడప--చెన్నై జాతీయ రహదారిలోని భాకరాపేట ఫారెస్ట్ చెక్పోస్ట్ వద్ద శనివారం సిద్ధవటం మండల ఎస్సై హారిక ఆధ్వర్యంలో విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని, అతివేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమని ఎస్సై సూచించారు. హెల్మెట్ ధరించని, సరైన వాహన పత్రాలు లేని 10 మంది ద్విచక్ర వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.185 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక కేంద్రం ఆకస్మిక తనిఖీ



ప్రజాభూమి,పులివెందుల

అగ్నిమాపక సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబా టులో ఉండాలి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ మురళీమోహన్ అన్నారు శనివారం ఆయన పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్,పరిసర ప్రాంతాలను వాహనములను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏదైనా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ అధికారి సునీల్ కుమార్,అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించాలి

## -మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్. నాగరాజు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్వయం సహాయక సంఘాలు, ఏరియా సమాఖ్యలు, పట్టణ సమాఖ్యలను మరింత బలోపేతం చేయడం ద్వారానే మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించడం సాధ్యమవుతుందని మెప్మా శ్రీ సత్యసాయి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్. నాగరాజు పేర్కొన్నారు. హిందూపురం పురపాలక సంఘంలోని మెప్మా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా సమైక్య నెలవారీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్వయం సహాయక సంఘాలు, చిన్న సంఘాలు, ఏరియా సమాఖ్యలు, పట్టణ సమాఖ్యల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. సమావేశాల ద్వారా సంఘాల పనితీరును సమీక్షిస్తూ సమస్యలను గుర్తించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మహిళా సంఘాల సభ్యులు పొదుపు, రుణాల వినియోగంతో పాటు స్వయం ఉపాధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. ప్రతి సంఘం ఆదర్శవంతంగా పనిచేస్తూ సభ్యులకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించే దిశగా కృషి చేయాలన్నారు. సంఘాల రికార్డుల నిర్వహణ, బ్యాంకు లావాదేవీలు, పొదుపు, రుణాల చెల్లింపులు, సభ్యుల హాజరు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాలకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహాయం, మార్కెటింగ్ అవకాశాలను కల్పించేందుకు మెప్మా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నాగరాజు సూచించారు. జిల్లా ఐబి రమాదేవి, జిల్లా టీఈ మాధవి మాట్లాడుతూ, మహిళా సంఘాల బలోపేతానికి అధికారులు, సంఘాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, జీవనోపాధి పథకాలను ప్రతి అర్హత కలిగిన మహిళకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో శ్రీసత్యసాయి జిల్లాలోని ఆరు పురపాలక సంఘాలకు చెందిన పట్టణ సమాఖ్యల అధ్యక్షులు, కార్యదర్శులు, పదాధికారులు పాల్గొన్నారు. హిందూపురం పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మి, మెప్మా డీఎంసీ ఎల్. గంగులయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎన్. సదానంద్, నాగేంద్ర, వరలక్ష్మి, గంగరత్నమ్మతో పాటు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి: ఎక్సైజ్ సీఐ రాజశేఖర్



ప్రజాభూమి, సిద్ధవటం:

మాదక ద్రవ్యాల వినియోగంతో యువత పెడదారి పడుతున్నారని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. శనివారం సిద్ధవటం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో మాట్లాడుతూ గంజాయి, కొకైన్, ఎఫెడ్రిన్ వంటి మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం దెబ్బతిని కుటుంబ సమస్యలు తలెత్తుతాయని అన్నారు. మత్తు పదార్థాలకు బానిస కాకుండా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయాలు, నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటామని, విక్రయించిన వారి ఇళ్లను కూడా చట్ట ప్రకారం స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# మాధవరం-1లో స్వచ్ఛ రథం పర్యటన

## పాత సామాన్లు, ప్లాస్టిక్ వస్తువుల సేకరణపై ప్రజలకు అవగాహన

ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో శనివారం స్వచ్ఛ రథం వీధుల్లో పర్యటించింది. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా పాత సామాన్లు, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి, వాటికి సంబంధించిన సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి చేపూరి లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ పరిశుభ్రత కోసం స్వచ్ఛ రథం సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట..



- విస్తృతంగా వాహన తనిఖీలు

ప్రజాభూమి, సిద్ధవటం: అక్రమ మద్యం, గంజాయి తదితర మాదక ద్రవ్యాల రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. సిద్ధవటం మండలంలోని టక్కోలి గ్రామ సమీపంలో కడపకు వెళ్లే ప్రధాన రహదారిపై శనివారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై నారాయణ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు, ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ సూచనల మేరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అనుమానాస్పదంగా కనిపించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, వాహనదారులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు మార్గమధ్యంలో ప్రయాణిస్తే వారి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. ఎవరైనా గంజాయి, అక్రమ మద్యం లేదా ఇతర మాదక ద్రవ్యాలను తరలించినట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై నారాయణ హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు కూడా ఎక్సైజ్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

## తెల్లపాడులో పారిశుద్ధ్య నిర్లక్ష్యం.. గ్రామస్థుల ఆవేదన



ప్రజాభూమి పోరుమామిళ్ల :

కడప జిల్లా కలసపాడు మండలం తెల్లపాడు ఎస్సీ కాలనీలో మురికి పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒడ్డెపోగు నతనెల్, తిమోతి ఇళ్ల సమీపంలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, విషపురుగుల బెడద పెరిగిందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో తక్షణమే కాలువలు శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాభూమి,పులివెందుల

నేడు మండలంలోని కొన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునుందని రూరల్ విద్యుత్ రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆదివారం రోడ్డు విస్తరణ పనులు ఉన్నందువలన ఆర్ తుమ్మలపల్లి, రాయలపురం, రచ్చుమారి పల్లె గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని,కావున దయచేసి విద్యుత్తు వినియోగదారులు రైతులందరూ విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు

# ఈ- ట్రాన్స్పోర్ట్ పర్మిట్ విధానము విజయవంతానికి సహకరించాలి

ప్రజాభూమి, పులివెందుల

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నూతనముగా ప్రవేశపెట్టిన ఈ-ట్రాన్స్ పోర్ట్ పర్మిట్ విధానము విజయ వంతానికి సహకరించాల ని పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షులు జి. అమర్ నాథ్ కోరారు. పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయములో శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటి పరిధిలో వ్యాపారులు, గుమాస్తాలు, సిబ్బందికి ఈ- ట్రాన్స్ పోర్ట్ పర్మిట్ విధానముపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జి. అమర్ నాథ్ మాట్లాడుతూ జులై 1వ తేదీ నుండి ఈ- ట్రాన్స్ పోర్ట్ పర్మిట్ విధానము అమలు అవుతుందని తెలిపారు. వ్యాపారులు అందరూ మార్కెట్ రుసుము ఆన్ లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ నూతన విదానము విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి వి. శ్రీధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

ఆదివారం 28 జూన్ 2026

# తప్పిపోయిన చిన్నారిని గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు

ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట.



సూళ్లూరుపేటలో తప్పిపోయిన చిన్నారి సేఫ్.. గంటల వ్యవధిలోనే తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఎస్సై అజయ్ కుమార్! పోలీసుల తక్షణ స్పందన....ఒంటరిగా ఏడుస్తున్న బిహార్ వలస కూలీల బిడ్డను సురక్షితంగా అప్పగించిన పోలీసులు! చిన్నారి ప్రాణం కాపాడిన స్థానికుల సమాచారం.. సూళ్లూరుపేట పోలీసుల వేగవంతమైన చర్యపై సర్వత్రా ప్రశంసలు సూళ్లూరుపేట పట్టణంలో ఒంటరిగా ఇక్కట్లలో చిక్కుకున్న ఒక చిన్నారిని పోలీసులు అత్యంత వేగంగా స్పందించి కాపాడారు. శుక్రవారం పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో ఒక చిన్నారి ఒంటరిగా రోడ్డుపై ఏడుస్తూ తిరుగుతుండటాన్ని గమనించిన స్థానికులు, వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.

## బిహార్ వలస కూలీల కుటుంబానికి అప్పగింత:

సమాచారం అందుకున్న వెంటనే సూళ్లూరుపేట ఎస్సై అజయ్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చిన్నారిని ఆత్మీయంగా దగ్గరకు తీసి వివరాలు ఆరా తీశారు. సదరు చిన్నారి డేగలపాలెం ప్రాంతానికి చెందిన బిహార్ వలస కూలీల బిడ్డగా పోలీసులు గుర్తించారు. ఎస్సై స్వయంగా చొరవ తీసుకుని ఆ చిన్నారిని వారి తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లి సురక్షితంగా అప్పగించారు. తమ బిడ్డ దొరకడంతో ఆ వలస కూలీల కుటుంబం కన్నీటి పర్యంతమై పోలీసుల వేగవంతమైన స్పందనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి చిన్నారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఎస్సై అజయ్ కుమార్ ని, సిబ్బందిని పట్టణ స్థానికులు పెద్ద ఎత్తున అభినందిస్తున్నారు.

# పీర్ల పండుగ సందర్భంగా భాషికం సమర్పించిన బైసాని తిరుపాలు కుటుంబ సభ్యులు

ప్రజా భూమి ప్రతినిధి జిల్లా రైల్వే కోడూరు



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని వై.కోట గ్రామంలో మొహరం పీర్ల పండుగ సందర్భంగా బైసాని తిరుపాలు, బైసాని రాజరాజేశ్వరి దంపతులు భక్తిశ్రద్ధలతో భాషికం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వారి కుమారుడు బైసాని సుధీర్, కోడలు బైసాని సాయి రచన, కుమార్తెలు, అల్లుళ్లు గుంటూరు గోవర్ధన్--భార్గవి, రాచిపుటి శ్రీనివాస్--జయంతి, గుంటూరు బాలకిషోర్--రోహిణి పాల్గొన్నారు. అలాగే బైసాని కిరణ్ కుమార్, బైసాని చైతన్య శ్రీ, సాయి ధార్మిక, సారిక, వీర రాఘవ సాయి, వైష్ణవి, హన్విత, లీలా కృష్ణ, మహాదిత్య, కారుణ్య శ్రీ, వక్రత్ సాయి తదితర కుటుంబ సభ్యులు హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు ప్రాణాపాయం తప్పింది

ప్రజా భూమి ప్రతినిధి పెళ్లకూరు



తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పరిధిలోని నాయుడుపేట--పూతలపట్టు ఎన్హెచ్-71 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే, బెంగుళూరు నుంచి నాయుడుపేటలోని తన బంధువుల ఇంటికి కారులో వెళ్తున్న శశి ప్రీతం (26) మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యాడు. ముందు వెళ్తున్న లారీని అతని కారు వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో శశి ప్రీతంకు చేతులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 1033 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)కి తరలించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# స్వచ్ఛభారత్ కు పాతరేసిన గూడూరు మున్సిపాలిటీ

## డంపింగ్ యార్డ్ గా మారిన నక్కల గిరిజన కాలనీ

## ఇళ్ల మధ్యనే డంపింగ్ యార్డ్

## గిరిజన కాలనీ అంటే అంత అలుసా!

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెల మూడవ శనివారం పారిశుద్ధ్యం పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ స్వచ్ఛభారత్ స్వర్ణ భారత్ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు అధికారులు అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. అందుకు భిన్నంగా గూడూరు మున్సిపాలిటీలో ఏ ప్రాంతంలో చూసినా చెత్త చేదారాలు తోకుప్పలు కుప్పలుగా మురికివాడలను తలపిస్తూ ఉన్నాయి. ముఖ్యంగా గూడూరు సనత్ నగర్ గిరిజన కాలనీలో ఇళ్ల మధ్యనే చెత్త పోగులు డంపింగ్ ఏర్పాటుచేసి అక్కడ నుండి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తరలించడం



జరుగుతున్నాయి ఆ ప్రాంత గిరిజనవాసులు పాపుతున్నారు. ఎక్కడైనా మున్సిపల్ పరిధిలో ఇళ్లకు దూరంగా డస్ట్ బిన్ ఏర్పాటుచేసి ప్రతి ఇంటి నుండి చెత్తని అక్కడ వేసే విధంగా చూడడం జరుగుతుంది కానీ గూడూరు మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యమో లేదా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం తెలియదు కానీ సనత్ నగర్ గిరిజన కాలనీ ఇళ్ల మధ్య ఉన్న చెత్త డంపింగ్ యార్డ్ ను తలపిస్తుందని ఆవేదన చెందుతున్నారు. గిరిజనులు అంటే చులకన భాగంగా చూస్తున్నారని వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా గూడూరు మున్సిపల్ కమిషనర్ అటువైపు దృష్టి పెట్టి ఆ ప్రాంతాన్ని పరిశీలించి డంపింగ్ యార్డ్ గా ఉన్న చెత్తను తరలించేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

# జిల్లా వ్యాప్తంగా "పల్లెనిద్ర" కార్యక్రమం నిర్వహించిన చిత్తూరు జిల్లా పోలీసులు

## గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల భద్రత, అవగాహన, పోలీసు--ప్రజల భాగస్వామ్యానికి పెద్దపీట వేస్తున్న జిల్లా పోలీసులు

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు





చిత్తూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుషార్ డూడి, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో "పల్లెనిద్ర" కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల భద్రతను మరింత పటిష్ఠం చేయడం, చట్టాలపై అవగాహన పెంపొందించడం, పోలీసు--ప్రజల మధ్య విశ్వాసాన్ని బలోపేతం చేయడం, ప్రజల భాగస్వామ్యంతో నేరాల నివారణకు కృషి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు "ధైర్య--స్పర్శ" కార్యక్రమం గురించి వివరించి, మహిళలు, బాలికలు, చిన్నారులకు భద్రతా సమస్యలు ఎదురయ్యే ప్రాంతాలను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణ, బాధితులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణ, ఫిర్యాదు నమోదు విధానం, అత్యవసర సహాయ సేవల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా సైబర్ నేరాల నివారణపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ, సోషల్ మీడియా వినియోగం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాల భద్రత విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిస్తూ, వాటి వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాలను వివరించారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, నిర్దేశిత చట్టబద్ధమైన వయస్సు అనంతరమే వివాహాలు జరగాలని ప్రజలకు తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని, అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలను పూర్తిగా నివారించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, ఆధారాల సేకరణలో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారం, పోలీసుల నిరంతర పర్యవేక్షణ, సమిష్టి కృషి ద్వారానే గ్రామాలను మరింత సురక్షితంగా, శాంతియుతంగా, నేరరహితంగా తీర్చిదిద్దడం "పల్లెనిద్ర" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పోలీసులు స్పష్టం చేశారు.

# సింహవాహనంపై యోగనారాయణ స్వరూపంలో భక్తులను కటాక్షించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు

## ధైర్యం, పరాక్రమం, ధర్మరక్షణకు ప్రతీకగా దివ్య వాహనసేవ

ప్రజా భూమి ప్రతినిధి వడమాలపేట



తిరుమల తిరుపతి అనుబంధ ఆలయమైన అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు యోగనారాయణ స్వామి అలంకారంలో సింహవాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భజనలు,



కోలాటాల నడుమ ఆలయ మాడవీధుల్లో జరిగిన వాహనసేవ భక్తిరసాన్ని పంచింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వాహనసేవలో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి గోవింద నామస్మరణల మధ్య స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు

సింహవాహన మహిమ : దుష్టశిక్షణ, శిష్టరక్షణ ధర్మాన్ని చాటిచెప్పే స్వామివారు సింహవాహనాన్ని అధిష్ఠిస్తారు. సింహం పరాక్రమం, ధైర్యం, తేజస్సు, నాయకత్వం, విజయస్ఫూర్తికి ప్రతీక. సింహదర్శనం ద్వారా భక్తుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, ధర్మనిష్ఠ పెంపొందుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు వివరిస్తున్నాయి. అజ్ఞానాన్ని తొలగించి ధర్మమార్గంలో నడిపించే దైవసందేశాన్ని ఈ సింహవాహనోత్సవం ద్వారా స్వామివారు ప్రసాదిస్తున్నారని విశ్వసిస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# కాణిపాక వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న డీజీపీ

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు



చిత్తూరు జిల్లా కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్) మధుసూదన్ రెడ్డి, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆయనతో కలిసి పాల్గొన్నారు. ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, అర్చకులు వేదాశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలు, శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం కావాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, ప్రజా కేంద్రిత పోలీసు సేవలను అందించేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే శాంతియుత, సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# తిరుపతి పార్లమెంట్ కార్యాలయ భవనం పనులను తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు డా. పనబాక లక్ష్మి

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి రూరల్



తిరుపతి పార్లమెంట్ పరిధిలోని అవిలాలలో నిర్మాణంలో ఉన్న నూతన తిరుపతి పార్లమెంట్ కార్యాలయ భవనం పనులను తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు డా. పనబాక లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతపై సమీక్ష



నిర్వహించిన ఆమె, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత వారికి సూచించారు. అనంతరం మాట్లాడుతూ, పార్టీ కార్యకలాపాల సమర్థ నిర్వహణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంలో ఈ నూతన కార్యాలయం కీలక కేంద్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని సౌకర్యాలతో కార్యాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ మునిరామయ్య, తిరుపతి పార్లమెంట్ సెక్రటరీ రేవతి పాల్గొన్నారు.

# నూతన వధూవరులు

## సాయి దీపిక-సాయి కృష్ణలను మనస్ఫూర్తిగా ఆశీర్వదించి: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి మండలం, మన్నవరం గ్రామానికి చెందిన వాధి కోటేశ్వరరావు-లత కుమార్తె వివాహానికి అనివార్య కారణాల వల్ల హాజరుకా లేకపోయిన నేపథ్యంలో.. ఈరోజు వారి స్వగృహాని కి విచ్చేసి, నూతన వధూవరులు సాయి దీపిక - సాయి కృష్ణలను మనస్ఫూర్తిగా ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అనం తరం, మాకెంతో ఆప్తులు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సీనియర్ కీలక నాయకులు రాంబాబు నాయుడు స్వగృహానికి (మన్నవరం) వెళ్లడం జరిగింది. వారి పొలంలో వారితో కలిసి కాసేపు సరదాగా, ఆత్మీయంగా సమయాన్ని గడపడం ఎంతో సంతోషాన్నిచ్చింది.

# ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ వేగవంతం చేయండి.

## కాలువల్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగించండి

## -కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



ప్రత్యేక ఓటర్ జాబితా సవరణప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఉదయం నగరంలోని పోస్టల్ కాలనీలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను, పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఎన్యుమరేషన్ పారాలను ఇప్పటికే



అందరికీ చేర్చడం జరిగిందని తెలిపారు. బి.ఎల్.ఓ. లు అందరి ఇండ్లకు వెళ్లి ఈ పారాలను గూర్చి కూలంకుశంగా వివరించి తప్పులు లేకుండా పూర్తి చేయించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రత్యేక కార్యాచరణతో ఓటర్ల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నగరంలోని ప్రధాన కాలువల్లో చెత్త, మట్టి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. లలిత, శానిటరీ సూపర్వైజర్ సుమతి, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

# సర్వే నంబర్ 476/1లో భూములు కొనవద్దు -- కాంగ్రెస్ పార్టీ ప్రజలకు విజ్ఞప్తి

## ఎస్ఎల్ఎన్ రియల్ ఎస్టేట్ సంస్థ విక్రయిస్తున్న ప్లాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి: ఐరాల లోకేష్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



ఈరోజు తిరుపతి ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఐరాల లోకేష్ రెడ్డి గారి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐరాల లోకేష్ రెడ్డి మాట్లాడుతూ, చంద్రగిరి నియోజకవర్గంలోని అవిలాల గ్రామం, సర్వే నంబర్ 476/1లో ఉన్న భూమికి సంబంధించిన వివాదం కోర్టు పరిధిలో ఉండటంతో పాటు పలు న్యాయపరమైన అంశాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఎస్ఎల్ఎన్ రియల్ ఎస్టేట్ సంస్థ ఆ భూమిలో ప్లాట్లు ఏర్పాటు చేసి, సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విట్టర్ తదితర మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు ప్లాట్లు విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజలు పూర్తి స్థాయిలో భూమి యాజమాన్య పత్రాలు, చట్టపరమైన అంశాలు పరిశీలించకుండా ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో తీవ్రమైన న్యాయపరమైన ఇబ్బందులు, ఆర్థిక నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల సర్వే నంబర్ 476/1లోని భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, అవిలాల గ్రామంలోని సర్వే నంబర్ 476/1లో ఉన్న భూమి వృద్ధ దంపతులైన ద్వారకానాథ్ రెడ్డి, వనజమ్మకి చెందినదని, ఆ భూమిని అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నాయకులు కుమ్మక్కై అక్రమంగా కబ్జా చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన సంబంధిత రెవెన్యూ అధికారులు, ఎమ్మార్వో, ఆర్డీవో, సబ్-రిజిస్ట్రార్, సబ్-కలెక్టర్ తదితర అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపించి, నిజాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు సంస్థల ద్వారా విచారణ జరిపించి, తప్పు చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు విక్రమ్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నే మల్లికార్జున, కాంగ్రెస్ నాయకులు శోభరాజు, ఖాదర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై రెండు పోలింగ్ కేంద్రాల్లో తహసీల్దార్ లక్ష్మీనారాయణ సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కారనణి మిట్ట పోలింగ్ కేంద్రం అలాగే వేణుగోపాలపురం పోలింగ్ కేంద్రాలను స్థానిక తహసీల్దార్ లక్ష్మీనారాయణ శనివారం పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న



ఓటరు నమోదు పేర్ల చేర్పులు తొలగింపులు సవరణలు చిరునామా మార్పులు తదితర ప్రక్రియలను పరిశీలించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలని, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు తమ వివరాలను సరిచూసుకొని అవసరమైతే సవరణలు చేయించుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, రెవెన్యూ సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు తిరుపతి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కందిరీ కార్తీక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమశీ గోడ పత్రికలు విడుదల

## - రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రామానాయుడు పిలుపు



ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి రైతులు కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ ఈనెల 30వ తేదీ ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నాకు రైతులు వ్యవసాయ కార్మికులు తరలిరావాలని స్థానిక కార్యాలయంలో గోడ పత్రికలను విడుదల చేయడం జరిగింది ముఖ్య అతిథిగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రామానాయుడు పాల్గొని మాట్లాడుతూ గత రెండేళ్లుగా మన రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్లాడుతుందని ఎన్నికల ముందు కూటమినేతలు గుప్పించిన రంగురంగుల హామీలు వాగ్దానాలు గద్దిని ఎక్కిన తరువాత అటక ఏ కాయని క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను తీర్చడానికి ఎలాంటి చర్యలు తీసుకొని ఈ ప్రభుత్వం తమ పెద్ద ఎత్తున సంక్షేమం అందిస్తున్నామంటూ ప్రసార మాధ్యమాల్లో కోట్లాది రూపాయలతో దొంగ ప్రచారాలు చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు పంటలకు కనీసం మద్దతు ధర దక్కడం లేదు సిండికేట్ మార్కెట్లో మాయాజాలంలో చిక్కుకొని రైతులు నష్టపోతున్నారని అప్పుల ఊబిలో కూరుకుపోయి అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మండిపడ్డారు ఇక కౌలు రైతుల పరిస్థితి వర్ణాన్న తీతం వారికి ఏ ఒక బ్యాంకు వ్యవసాయ ఉద్యాన పథకాలు గాని అందడం లేదన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం మాదిరిగా మన రాష్ట్రంలో రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసి ఆత్మహత్య లనుంచి రైతాంగాన్ని కాపాడాలని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అనుసరించి సమగ్ర ఉత్పత్తి 50% అదనంగా అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి చట్ట బద్ధత కల్పించాలని ఇటీవల పెరిగిన ఎరువులు పురుగుమందులు విత్తనాలు పెట్రోలు డీజిల్ వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు తగ్గించాలి అని ఆర్బిఐ నిబంధనల ప్రకారం ఎలాంటి హామీలు లేకుండా కౌలు రైతులకు రెండు లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేయాలని అన్నదాత సుఖీభవ మొదట ఏడాది 2024 25 బకాయిలు 10,716 కోట్లు కౌలు రైతులకు రెండు సంవత్సరాల బకాయిలు చెల్లించాల్సిన 3,200 కోట్లు తక్షణమే విడుదల చేయాలని ప్రస్తుత సీజన్ నుండి ఈ సాయాన్ని 20,000 నుండి 50 వేల వరకు పెంచి ఒకే విడతలో ఇవ్వాలని డిమాండ్ చేశారు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జనమాల గురవయం మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభము వలన అప్పుల బాధలతో ఆత్మహత్య చేసుకున్న సుమారు 200 మంది బాధిత రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి ఏడు లక్షల రూపాయలు చొప్పున మొత్తం 140 కోట్లు తక్షణమే ఎక్స్రేషియా అందించాలని కొనియాడారు అదేవిధంగా 50 సంవత్సరాలు పైబడిన ప్రతి రైతుకు 10,000 వేలు పింఛన్ ఇవ్వని డిమాండ్ చేశారు అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని రైతు లోకమా,,, మేలుకో నీ హక్కులకై పోరాడు అని నినాదంతో కూటమి ప్రభుత్వ ప్రజా రైతు వ్యతిరేక విధానాలపై సమరభేరి మోగిద్దాం జూన్ 30న విజయవాడ ధర్నా చౌక్ వద్దకు రైతులు కౌలు రైతులు వ్యవసాయ కార్మికులు వేలాదిగా తరలి రావాలని పిలుపునివ్వడం జరిగింది. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి చార్ లత రైతు నాయకులు వెంకటకృష్ణ సుబ్రహ్మణ్యం రామిరెడ్డి కిరణ్ కుమార్ చెంగలరాయిలు రెడ్డి సుబ్రహ్మణ్యం వెంకటయ్య గంగమ్మ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేయండి - జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు





ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీన చిల్లకూరు మండలం, పొన్నపరవారిపాలెం లో పర్యటించే అవకాశం ఉంది. అయితే ఇంకా అధికారికంగా మినిట్ టు మినిట్ అందాల్సి ఉంది. ఈ సందర్భంగా అధికారులందరు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేయాలని నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు రానున్న సందర్భంగా... శనివారం చిల్లకూరు మండలం, పున్నపువారిపాలెంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ , అధికారులతో కలసి జేసి మొగిలి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు.. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. సమయం తక్కువ.ఉందని, అన్ని పనులను వేగవంతగా పూర్తిచేయాలన్నారు. గూడూరు ఎమ్మెల్యే వి సునీల్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను పకడ్బందీగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నిబంధనల మేరకు ప్రజలను అనుమతించే విషయంలో పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు అలాగే కంచెను పంపిణీలో ముఖ్యమంత్రి పాల్గొంటున్నందున పెన్షన్లు పొందిన లబ్ధిదారులను ఎంపిక చేసి వారి కుటుంబ జీవన విధానం గురించి సీఎం వివరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ విషయంలో తమ పార్టీ నేతలు అధికారులు సమన్వయంతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, డిఆర్డీఏ, మెప్మా పిడీలు నాగరాజ కుమారి,కిరణ్ కుమార్, డిపివో వసుమతి, డీఎస్పీ గిరిధర్, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు, ఎయిడ్స్, క్షయ,వ్యాధులపై, అవగాహన కార్యక్రమం





ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

తిరుపతి జిల్లా కుష్టు, ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారిణి డాక్టర్ శైలజ మరియు రేణిగుంట మండల వైద్యాధికారిణి డాక్టర్ తేజస్విని ఆదేశాల తో,శనివారం 27/06/2026 వ తేదీన రేణిగుంట లోని శనివారపు సంతలో "ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్" అనే 100 రోజుల పాటుగ దేశంలో జరిగుతున్న టిబి ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమాన్ని హెల్త్ సూపర్వైజర్ కామరాజు మరియు సీనియర్ టిబి సూపర్వైజర్ సుమశ్రీ నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ కామరాజు సంతలోని వర్తకులు మరియు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ "టిబి ముక్త్ భారత్" అంటే "క్షయవ్యాధి (టీ బి) లేని భారతదేశం" అని అర్థం అని, భారత దేశం నుండి క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.దీని కోసం ప్రభుత్వం వ్యాధి నిర్ధారణ పరీక్షలు,ఉచిత మందులు మరియు టి.బి రోగులకు పౌష్టికాహార సహాయం కూడా అందిస్తోందని తెలిపారు.ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ( పి ,ఎం ,టి, బి,య్యం, బి,ఏ) అనేది 2025-2030 నాటికి దేశం నుండి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి భారత ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక జాతీయ కార్యక్రమంగా పేర్కొన్నారు.ఈ పథకం కింద,టీబీ రోగులకు ఉచిత చికిత్సతో పాటు, పోషకాహారం, మరియు సామాజిక మద్దతును అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. దాతలు,కార్పొరేట్ సంస్థలు,రాజకీయ నాయకులు లేదా సాధారణ పౌరులు టీబీ రోగులను దత్తత తీసుకొని,వారికి 6 నెలల నుండి 3 సంవత్సరాల వరకు అవసరమైనటువంటి పోషకాహారాన్ని అందించ వచ్చునని, ఉచిత క్షయ నిర్ధారణ మరియు చికిత్సలను ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో,టీబీ పరీక్షలు,మందులు పూర్తిగా ఉచితంగా లభిస్తాయని పేర్కొన్నారు.టీబీ వ్యాధి గ్రస్తులపై సమాజం ఎలాంటి వివక్ష చూపకుండా, వారికి అండగా నిలవాలని ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ప్రజలలో అవగాహన కోసం ,రెండు వారాలకు మించి దగ్గు,సాయంత్ర సమయంలో జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం,బరువు తగ్గడం వంటివి టీబీ లక్షణాలు కావొచ్చని, టీబీ అనేది పూర్తిగా నయం చేయగల వ్యాధేనని,వైద్యుల సూచనల ప్రకారం మందులు వాడటం, ద్వారా దీనిని పూర్తిగా తరిమి కొట్టవచ్చునని పేర్కొన్నారు.ఈ కార్య క్రమంలలో హెల్త్ అసిస్టెంట్ ముని వెంకటప్ప,ఆశాకార్యకర్తలు రుక్మిణి, ఆశాలత పాల్గొన్నారు.

# ప్రతి వ్యక్తి,జీవితంలో ఎదగాలంటే విద్యతోనే సాధ్యం

## -(ఎం, ఈ ,ఓ) రంగనాథ్




ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్ పంపిణీ. రేణిగుంట ఆర్.సి.యం యూపీ స్కూల్లో శనివారం ఒష్టుఎఋ ఖఅఆ (షామ్, దా సాని) ఫౌండేషన్ హాంకాంగ్ సహకారంతో చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు ప్రత్యూష ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రేణిగుంట మండల విద్యాశాఖ అధికారి రంగనాథ్ హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్,మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలంటే,చదువు ఎంతో అవసరమని, చదువుతోపాటు సంస్కారం కూడా అంతే అవసరం అన్నారు. బడిపాఠాలలో పాటు,పెద్దలను గౌరవించడం, విలువలు, సంస్కారం ఉపాధ్యాయులు నేర్పుతారన్నారు. చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు ప్రత్యూష మాట్లాడుతూ మా నాన్న జూలియన్ రాజు పేద విద్యార్థులకు ఉచితంగా చేస్తున్న సేవలను గుర్తించి నేను పెద్దయ్యాక ఆయన స్ఫూర్తితో తన వంతు సేవగా పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఉచితంగా స్టేడియంలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మీరు కూడా బాగా చదివి మంచి ఉన్నత స్థానానికి ఎదిగి చదువుకున్న పాఠశాలలోనే తిరిగి పేద విద్యార్థులకు మీ వంతు సాయం చేయాలని కోరారు. పేద విద్యార్థులు విద్యావంతులు అవ్వడం తోనే , అభివృద్ధి సాధించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ,పి ,జె మేరీ ఏంజెల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# జనసేన చొరవతో ఎస్సీ కాలనీకి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## బోర్వెల్ తవ్వించి పైప్లైన్ ఏర్పాటు చేసిన అధికారులు



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలోని సంతవేలూరు గ్రామ ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు జనసేన పార్టీ చొరవతో పరిష్కారం లభించింది. కాలనీవాసులు ఎదుర్కొంటున్న మంచినీటి ఇబ్బందులను జనసేన పార్టీ నాయకులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు వెంటనే స్పందించి బోర్వెల్ తవ్వించి పైప్లైన్ ఏర్పాటు చేశారు. దీంతో ఎన్నో రోజులుగా తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీ ప్రజలకు ఉపశమనం కలిగింది. సమస్య పరిష్కారంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ వరదయ్యపాలెం మండల అధ్యక్షుడు చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన పార్టీ లక్ష్యమని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యపై స్పందించి వెంటనే చర్యలు చేపట్టిన సంబంధిత అధికారులకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీ ప్రజలు జనసేన పార్టీ నాయకులకు, అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# గోవిందా గోవిందా... జగన్నాథం మిత్ర బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ప్రతి శనివారం నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు కూడా జగన్నాథం మిత్ర బృందం ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా దేవతా మూర్తులకు టిఫిన్ సమర్పించి, పక్షులకు మేత ఏర్పాటు చేసి తమ సేవా కార్యక్రమాలను కొనసాగించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ, ప్రతి శనివారం ఇలాంటి ఆధ్యాత్మిక మరియు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. అన్నదానం మహాదానమని, ఆకలితో ఉన్న వారికి భోజనం అందించడం ద్వారా సమాజానికి సేవ చేసిన ఆనందం కలుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని జగన్నాథం మిత్ర బృందం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

# నరేంద్ర దండి నాయకత్వంలో వేగంగా సాగుతున్న సార్ కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి రూరల్

వేలవేడు గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ. బి ఎల్ ఏ లక్ష్మణ్ కుమార్, బి ఎల్ ఓ సాయికుమార్ సమన్వయానికి నరేంద్ర దండి అభినందనలు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వేలవేడు గ్రామంలో, జనసేన నాయకుడు నరేంద్ర దండి మార్గదర్శకత్వంలో సార్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. జనసేన బి ఎల్ ఏ చెరువు లక్ష్మణ్ కుమార్ సమన్వయంతో, బి ఎల్ ఓ విడిచెర్ల సాయికుమార్ సహకారంతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సార్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంకితభావంతో శ్రమిస్తున్న బి ఎల్ ఏ లక్ష్మణ్ కుమార్, జనసైనికులు, వెలవేడు గ్రామ ప్రజలను నరేంద్ర దండి అభినందించి, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# అరుంధతిపాలెంలో మురుగునీటి వలయం

## రోడ్లపైనే నడవలేక ప్రజల అగచాట్లు

## వ్యాధుల భయంతో కాలనీవాసుల ఇక్కట్లు



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంలో నిర్లక్ష్యం గూడూరు పట్టణంలోని అరుంధతి పాలెంలో పీఎస్ఆర్ పార్కు సమీప ప్రాంతం తీవ్రమైన డ్రైనేజీ సమస్యతో సతమతమవుతోంది. దశాబ్దాలుగా నెలకొన్న డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారడంతో వ్యర్థ జలాలు బయటకు వెళ్లే దారి లేక వీధుల్లో రోడ్లపైనే పారుతున్నాయి. దీనివల్ల కాలనీలో నివసించే వందలాది మంది ప్రజలు, చిన్నారులు, వృద్ధులు నిత్యం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దైనందిన అవసరాల కోసం ఇంటి బయటకు రావాలంటేనే స్థానికులు భయపడే పరిస్థితి నెలకొంది. కలుషిత నీటిలో నుంచి అడుగులు వేస్తూ వెళ్లడం వల్ల పాదాలకు చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, ముఖ్యంగా వృద్ధులు ఆ నీటిలో జారిపడి గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ?ఈ మురుగునీటి నిల్వల కారణంగా వెలువడుతున్న తీవ్ర దుర్వాసనతో ఇళ్లలో గడపడం కూడా కష్టంగా మారింది. దీనికి తోడు ఈ మురుగునీరు దోమలకు నిలయంగా మారడంతో కాలనీ మొత్తం డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధుల భయంతో వణికిపోతోంది. పలుమార్లు సంబంధిత మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గూడూరు మున్సిపల్ యంత్రాంగం వెంటనే స్పందించి పీఎస్ఆర్ పార్కు సమీపంలో డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై బిఎల్ఏలకు దిశానిర్దేశం చేసిన..నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

వాకాడు మండలం పరిధిలోని 36 పోలింగ్ కేంద్రాలకు చెందిన వైఎస్సార్సీపీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఏలు)తో ఈరోజు వాకాడులోని నేదురుమల్లి నివాసంలో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా బిఎల్ఏలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అలాగే బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఓటర్ల జాబితాలో అనవసర తొలగింపులు, తప్పులు, అవకతవకలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైనదని, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించాలని సూచించారు.రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించాలని, ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో వైఎస్సార్సీపీ సీఈసీ సభ్యులు భక్తవత్సల రెడ్డి, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బిఎల్ఏలకు క్షుణ్ణంగా వివరించారు.ఈ కార్యక్రమంలో వాకాడు మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, పార్టీ నాయకులు, బిఎల్ఏలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# పల్స్ పోలియో విజయవంతానికి అవగాహన ర్యాలీ

## ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలని వైద్యాధికారుల పిలుపు



ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి ఎన్ కండ్రిగ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శనివారం అవగాహన ర్యాలీ మరియు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. మన దేశంలో పోలియో పూర్తిగా నిర్మూలించబడినప్పటికీ, సమీప దేశాలైన ఆఫ్ఘనిస్తాన్, కజకిస్తాన్, పాకిస్తాన్ దేశాల్లో పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వలసల ద్వారా వ్యాధి మళ్లీ వ్యాపించే అవకాశం ఉన్నందున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పల్స్ పోలియో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాయని వైద్యాధికారులు తెలిపారు. జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలో 30 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసి ఐదేళ్లలోపు 3,891 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు బూత్‌ల వద్ద అందుబాటులో లేని పిల్లలను జూన్ 29, 30 తేదీల్లో వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తాయని వివరించారు. అలాగే క్వారీలు, కంపెనీలు, తోటలు, నిర్మాణ ప్రదేశాలు, ఇటుక బట్టీలు, వలస కార్మికుల నివాస ప్రాంతాలు, బాతులు మరియు గొర్రెల కాపరుల కుటుంబాల్లోని చిన్నారులను ప్రత్యేకంగా గుర్తించి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుచ్చినాయుడు కండ్రిగలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ప్రజలకు పోలియో నివారణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం కూడలిలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ రెడ్డి, డాక్టర్ ఉదయ్ కుమార్, ఆరోగ్య అధికారి డి.ఎన్. వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# త్రినేత్ర వైద్యాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష నిర్వహించడం జరిగింది



ప్రజా భూమి ప్రతినిధి: తొట్టంబేడు

మండలంలోని కంచన పల్లి లో త్రినేత్ర వైద్యాలయ ట్రస్ట్ శ్రీ భక్త కన్నప్ప కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంచినపల్లి గ్రామము శ్రీరామాలయం దగ్గర ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగినది ఈ పరీక్షలలో లి31 మంది పేషెంట్లు చూపించుకోవడం జరిగినది వీరిలో 13 మంది కంటి శుక్లాలు మరియు 1 గురికి టెర్రిజంఉన్నాయని గుర్తించడం జరిగినది. వచ్చిన వారందరికీ ఉచిత మందులు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ స్టాప్ చీ దామోదర్ లలిత మరియు గ్రామస్తులు తులసి కుమార్ వెంకటేష్ ముందుండి ఐ క్యాంపు ని విజయవంతం చేశారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

ఆదివారం 28 జూన్ 2026


## రైతు బజారులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ను ప్రారంభించిన డీఈవో ప్రసాద్ రావు

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి

తిరుపతిలోని అన్నమయ్య సర్కిల్ రైతు బజార్ లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ను తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు శనివారం ప్రారంభించారు. ఈ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియాగదారులకు అందించడం కోసం రైతు బజార్ లో ఈ స్టాల్ ఏర్పాటు చెయ్యడం జరిగిందని ఈ స్టాల్ వల్ల ప్రతి ఒక్కరికి ప్రకృతి వ్యవసాయ పద్దతి లో పండించిన ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం జరుగుతుందని అదేవిధంగా ప్రకృతిలో పండించినటువంటి ఉత్పత్తులను తీసుకోవడం వల్ల మనవ జీవన ప్రమాణాలు పెరిగి ఆరోగ్యకరంగా ఉంటామని ఆయన తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు ఎ.మేనేజర్ షణ్ముఖం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించినటువంటి రైతులకు ఈ రైతు





బజార్ లో స్టాల్ ఏర్పాటు చెయ్యడం వల్ల అమ్ముకోవడానికి మార్కెటింగ్ అనేది సులభతరం అవుతుందని అదేవిధంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కావాలి అనుకున్నవారికి ఈ రైతు బజార్లో స్టాల్ ఏర్పాటు చెయ్యడం వల్ల కొనుగోలు దారులకు ఆకుకూరలు, కూరగాయలు పండ్లు , చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనెలు మొదలగు అన్ని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఈ స్టాల్ లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించినటువంటి రైతుల దగ్గర నుంచి నేరుగా ఈ ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతు బజార్లో అగ్రికెటర్ ద్వారా అందుబాటులో ఉంచడం జరుగుతునదాని వివరించారు. మార్కెటింగ్ ఏ డి ఏసురేంద్ర మాట్లాడుతూ ఈ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారం తీసుకోవడం వల్ల మన ఆరోగ్యం బాగుంటుందని తెలియజేశారు. రైతు బజార్ లో డిజి రైతు బజార్ ను డి ఏ ఓ ప్రసాద్ రావు విజిట్ చెయ్యడం జరిగింది. రైతు బజారు లో డిజి ఆన్లైన్ వాట్సాప్ మరియు కాల్ లో ఆర్డర్ చేసుకోవడం వల్ల రైతు బజార్ ధరలకే నేరుగా రైతుల నుంచి తాజా కూరగాయలు, పండ్లు మీ ఇంటి వద్దకే డెలివరీ పొందవచ్చు అని ఏ డి ఏ మార్కెటింగ్ సురేంద్ర వివరించారు. రైతుబజార్ నుంచి తక్కువ ధరలకే తాజా కూరగాయలు, పండ్లు వినియోగదారులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతుల నుంచి సరఫరా చేసి సులభతరమైన ఆన్లైన్ ఆర్డర్ మరియు డోర్ డెలివరీ సేవలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరూ కూడా ఈ రైతు డీజీ రైతు బజార్ సేవలను ఉపయోగించుకోవాలని తెలియజేయడం జరిగింది.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం.... డా. బాలు



ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూపీహెచ్ శ్రీరామ్ నగర్ కాలనీ మెడికల్ ఆఫీసర్ డా. బాలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, గతంలో ఎన్నిసార్లు పోలియో చుక్కలు వేసినా ఈ ప్రత్యేక కార్యక్రమంలో మరోసారి వేయించడం అత్యంత అవసరమని తెలిపారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలియో బూత్లతో పాటు అవసరమైన ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కూడా చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు. అన్ని తల్లిదండ్రులు తమ 5 సంవత్సరాల లోపు పిల్లలను సమీపంలోని పోలియో బూత్కు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని, ఒక్క చిన్నారి కూడా ఈ అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని యు పి హెచ్ సి శ్రీరామ్ నగర్ కాలనీ మెడికల్ ఆఫీసర్ డా. బాలు ఓ ప్రకటనలో కోరారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రేణిగుంట - చెన్నై మార్గంలో 5ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### - ఒక కారు సీజ్ - ఒక స్మగ్లర్ అరెస్టు

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి



తిరుపతి జిల్లా రేణిగుంట – చెన్నై మార్గం లో చేపట్టిన తనిఖీల్లో కారులో తరలిస్తున్న 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని కారును టాస్క్ ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. ఒక స్మగ్లర్ ను అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో రైల్వే కోడూరు ఆర్ఎస్ఐ ఎన్. బాల చెంచయ్య టీమ్, ఎఫ్ ఆర్ ఓ సుభాష్ తో కలసి తిరుపతి డివిజన్ రేణిగుంట మండలం, కరకంబాడీ బీటు పరిధిలోని రేణిగుంట – చెన్నై మార్గం లో శుక్రవారం రాత్రి వాహనాలను తనిఖీ చేపట్టారు. రామావిలాస్ సర్కిల్ వద్ద తనిఖీ చేస్తుండగా శనివారం తెల్లవారుజామున ఒక కారు వేగంగా వచ్చింది. అయితే టాస్క్ ఫోర్స్ సిబ్బందిని చూసి వాహనం కొద్ది దూరంలో ఆపి అందులోని దిగిన ఇద్దరు వ్యక్తులు పారిపోసాగారు. అయితే వారిని వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. కారులో ఐదు ఎర్రచందనం దుంగలను, కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న వ్యక్తిని కేరళ రాష్ట్రం కొలికోడ్ జిల్లాకు చెందిన వ్యక్తి గా గుర్తించారు. ముద్దాయితో సహా వాహనం, దుంగలను టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన వారిని డీఎస్పీ వీ.శ్రీనివాసులు రెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్ విచారించారు. ఈ కేసును సీఐ ఖాదర్ బాషా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు తిమ్మారెడ్డి మృతి అత్యంత బాధాకరం

### -జనసేన ఇన్చార్జ్ దేవర మనోహర్

ప్రజా భూమి ప్రతినిధి, పాకాల



పాకాల మండలం దేవినేని ఇండ్లు గ్రామంలో ఏనుగు దాడిలో రైతు తిమ్మారెడ్డి దారుణంగా మృతి చెందిన విషయం తెలుసుకున్న జనసేన పార్టీ ఇన్ఛార్జ్ దేవర మనోహర్ తక్షణమే స్పందించారు. ఆయన ఈ రోజు బాధిత కుటుంబ సభ్యులను స్వయంగా కలిసి, వారిని పరామర్శించి



కొండంత ధైర్యాన్ని ఇచ్చారు. పొలం వద్ద కాపలా ఉన్న రైతుపై ఏనుగు దాడి చేసి, మొండెం, కాలు విడిపోయేలా తొక్కి చంపేసిన ఘోర కలికలిని విన్న దేవర మనోహర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఉదయం నుండి ఫోన్ ఎత్తకపోవడంతో వెతికిన బంధువులకు పంట పొలాల్లో మృతదేహం కనిపించిన ఉదంతాన్ని అడిగి తెలుసుకున్న ఆయన, ఈ క్లిష్ట సమయంలో బాధితులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ దారుణ ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పందించి బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటించగా, దేవర మనోహర్ క్షేత్రస్థాయిలో ఉండి ఆ ప్రక్రియను వేగవంతం చేసేందుకు నడుం బిగించారు. వన్యప్రాణుల దాడి కారణంగా ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబానికి ప్రభుత్వం నుండి అందాల్సిన రూ. 10 లక్షల పరిహారాన్ని వీలైనంత త్వరగా ఇప్పించేలా పూర్తి బాధ్యత తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాకాల మండల నాయకులు వినోద్,చెంగల్రాయులు,కిరణ్ ,గిరి ,రూపేష్,ధనుష్ ,రాజశేఖర్,కిరణ్ ,నాని ,శివ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకఅక్రమ తవ్వకాలపై, గాజుల మన్యం పోలీసుల,ఉక్కు పాదం

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట మండలం (రూరల్)గాజుల మన్యం పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం పోలీసులు మరియు రెవెన్యూ శాఖ అధికారులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై దాడులు నిర్వహించి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ



మంజునాథ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై హరీష పోలీస్ సిబ్బంది కి వచ్చిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కొత్త మంగళం గ్రామ పరిధిలోని ప్రైవేట్ స్థలంలో అక్రమంగా ఇసుక నిల్వచేసి అక్కడ నుండి తరలిస్తున్న 10 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. మరొక బృందం పిల్ల పాలెం సమీపంలో ఇసుక తవ్వకాలకు వినియోగిస్తున్న జెసిబి ని నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా జరిగితే ప్రజలు పోలీసులకు మరియు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## మిరియాల బాబా గౌసియా ఆశ్రమంలో అంగరంగ వైభవంగా, పీర్ల పండుగ వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మిరియాల బాబా గౌసియా ఆశ్రమంలో షహాదత్ కార్యక్రమాన్ని అశ్రు నయనాలతో నిర్వహించారు. మొహర్రం మాస 10వ రోజుని షహాదాత్ కార్యక్రమంలో భాగంగా ప్రతిష్ఠించిన పీర్ల నీటి ప్రస్థాన కార్యక్రమాన్ని గౌసియా ఆశ్రమ పీఠాధిపతి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మషాయక్ అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి ఖ్వాజా జుబేర్ హయాత్ అలీ ,షా ఖాదరీ ఆశ్రమ శిష్య బృందం తో కలిసి భక్తి శ్రద్ధలతో అశ్రు నయనాలతో నిర్వహించారు. పీఠాధిపతి జుబేర్ హయాత్ ఖాదరీ మాట్లాడుతూ ప్రపంచ మానవ జాతి ధర్మ సంస్థాపన, కోసం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి మనువడు హజరత్ హుస్సేన్



షహీదీ తన కుటుంబీకులతో కలిసి ప్రాణాలను త్యజించిన రోజు మొహర్రం పదవ రోజైన షహదత్ పేరిట మహోన్నత చరిత్ర కలిగిన రోజు గా తెలిపారు. ఇటువంటి చారిత్రాత్మక మహోన్నతమైన నాటిని పురస్కరించుకొని కర్బలా యుద్ధంలో అమరులైన అమరవీరుల జ్ఞాపకార్థం పీర్లను ప్రతిష్ఠించి 10వ రోజు షహదత్ న పీర్ల ను నీటి ప్రస్థానాన్ని ఆశ్రమ ఆనవాయితీ గా కొనసాగిస్తూ ప్రజలకు సన్మార్గ ధర్మ బద్ధమైన జీవనాన్ని కొనసాగించుటకు దిక్సూచి గా నిలుస్తుంది అని తెలిపారు. అమరవీరుల జ్ఞాపకార్థం మొహర్రం మాస 10వ రోజు న పీర్లను ప్రతిష్ఠించిన నాటి నుండి తిరుపతి జిల్లా, కడప జిల్లా, అనంతపురం జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మహనీయుల కృపను పొందారని, ఈ కార్యక్రమంలో హిందూ ముస్లింలు సోదర భావంతో పాల్గొన్నట్లు పీఠాధిపతి తెలిపారు, ఆ సర్వేశ్వరుడైన అల్లాహ్ రబ్బుల్ ఇజ్జత్ కి కర్బలా అమరవీరుల పేరిట ఫాతెహా నిర్వహించి సుమారు 500లీటర్ల పానకము, అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సద్గురు మిరియాల బాబా ఆధ్యాత్మిక శిష్య బృందం, గురువులు జుబేర్ హయాత్ ఖాదరీ ఆధ్యాత్మిక శిష్య బృందం, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పూజారి శ్రేష్ఠ బ్రాహ్మణులు, ఏ1 క్యాటరింగ్ తిరుపతి ఎస్ మస్తాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మషాయిక అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఎస్ రహమాన్ షరీఫ్, రేణిగుంట మండల అధ్యక్షులు, రైటర్ మహబూబ్ బాషా, సత్తార్ ఖాదరీ, సుభాన్ ఖాదరీ, తిరుపతి జాఫర్, బాలాజీ, నందా, రహమత్, భక్తులు రేణిగుంట గ్రామ ప్రజలు,పాల్గొన్నారు.

## పుష్పిత్ పరిశ్రమలో వేతనాల ఎగవేత రోడ్డెక్కిన కార్మికులు పలువురి నిర్బంధం

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి







తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలో ఉన్న పుష్పిత్ స్టీల్ పరిశ్రమ యాజమాన్య నిరంకుశ వైఖరి మరో సారి బట్టబయలైంది. తమకు చెల్లించాల్సిన వేతనాలు ఇమ్మన్నందుకు కార్మికులకు మంచినీటి సరఫరాను బంద్ చేశారు. నలుగురు కార్మిక నాయకులను ఏర్పేడు పోలీస్ స్టేషన్ లో బంధించి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో తిరగబడ్డ కార్మికులు యాజమాన్యం తీరుకు నిరసనగా శనివారం విధులను బహిష్కరించారు. కాలినడకన.. కాలిన కడుపుతో ఎండను, వానను సైతం లెక్క చేయకుండా శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ పుష్పిత్ స్టీల్ పరిశ్రమలో బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 200 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. రెండు నెలలుగా వేతనాలు అందక కార్మికుల కుటుంబాలు అర్థాకలని అనుభవిస్తున్నా యాజమాన్యం కనికరం లేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వేతనాలు అడిగితే కాంట్రాక్టర్ పేరు చెప్పి తప్పించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్, యాజమాన్యం మధ్య అర్థిక సమస్య తలెత్తినప్పుడు యాజమాన్యమే కార్మికుల జీతాల బాధ్యతను తీసుకోవాలన్న కార్మిక చట్ట నిబంధనను విస్మరించారన్నారు. పైగా తిరిగబడ్డ కార్మికులను బెదిరించి లొంగదీసుకోవాలనే ధోరణిలో పోలీస్ స్టేషన్ కు తరలించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆర్డీవో యాజమాన్యంతో తాను మాట్లాడినట్లు వివరించారు. సదరు కాంట్రాక్టర్ పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వేతనాల చెల్లింపు పై యాజమాన్యం హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, రంగయ్య, అన్వర్ బాషా, పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంతో కొత్త కమిటీల కార్యాచరణకు మరింత వేగం

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి



మంగళగిరిలోని సిక్ కన్వెన్షన్లో నిర్వహించిన "జనసేన సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశం"లో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కమిటీ సభ్యులు, పార్టీ సారథులు, కార్యకర్త



లను ఉద్దేశించి ప్రసంగించారు. కమిటీ భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించడంతో పాటు, అధ్యయనం చేయాల్సిన అంశా లపై సమగ్ర సమాచార పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జనసేన మేధావులు, సీనియర్ నాయకులు వీఎన్ వీ ప్రసాద్ లోకం , పంతం నానాజీ , శ్రీరామ్ తాళ్లూరి, కందుల దుర్గేష్, టీ. శివశంకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, నూతన కమిటీ కార్యాచరణ, పార్టీ బలోపేతం, కొత్త చేరికలు, అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధి మరియు సంస్థాగత బలోపేతం వంటి కీలక అంశాలపై సార్థకంగా చర్చించాం. ఈ సమావేశం, చర్చలు పార్టీ భవిష్యత్ కార్యాచరణకు మరింత స్పష్టతను, సానుకూల దిశను అందించాయి. జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు సమిష్టిగా పనిచేయాలనే సంకల్పాన్ని మరింత బలోపేతం చేశాయి.

## కార్యకర్తల,సమావేశసభ, ప్రాంగణాన్ని పరిశీలించిన కాలాస్త్రి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జూలై 1న రేణిగుంట మండలం ఎల్లమండ్యం పంచాయతీ కొత్తపాలెం సమీపంలో నిర్వహించనున్న కార్యకర్తల సమావేశానికి హాజరుకానున్న నేపథ్యంలో సభా ప్రాంగణాన్ని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, వేదిక నిర్మాణం, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి,చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నాగరాజు నాయుడు, ధనుంజయ నాయుడు, పట్టణ అధ్యక్షుడు,మాభాష వీరేంద్ర,పోలీసు అధికారులు, సీఐ మంజునాథరెడ్డి, ఎస్సై హరీష, మనీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గిరి పుత్రులు సమస్యలను జిల్లా కలెక్టర్ కి వివరిస్తున్న

### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి



తిరుపతి కలెక్టరేట్ ఆఫీస్ లో తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ నీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు. మాసారపు. సుబ్బయ్య కలిసి తిరుపతి జిల్లాలో ఉన్నటువంటి గిరిజనలుకు ఉన్నత విద్య,ఆరోగ్యం, ప్రత్యేకమైన గురుకులాలపై వసతులు కల్పించాలని గిరిజన గురుకులాలు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అలాగే గ్రామాలలో పట్టణాలలో నివసిస్తున్న గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారికి తగిన సహాయం చేయాలని ప్రతి గిరిజన కాలనీలో మినీ అంగనవాడి కేంద్రాలుపెట్టాలని కలెక్టర్ వెంకటేశ్వరరావు ని సుబ్బయ్య విన్నవించడం జరిగినది.

### సభ ప్రాంగణాన్ని ముఖ్య నాయకులు అధికారులతో

## క్షేత్రస్థాయిలో పరిశీలన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి

రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. మొదటిసారిగా మన శ్రీకాళహస్తి నియోజకవర్గానికి విచ్చేస్తుండడం నాకు మరియు మన కూటమి శ్రేణులందరికీ ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని ఇస్తోంది. జూలై 1వ తేదీన మన నియోజకవర్గంలో నిర్వహించబోయే భారీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి లోకేష్ అన్న ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. ఈ పర్యటనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, అట్టహాసంగా నిర్వహించే ఏర్పాట్లలో భాగంగా.. ఈరోజు మన నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో సభా ప్రాంగణాలను కూటమి ముఖ్య నాయకులు, అధికారుల బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. సభకు విచ్చేసే కార్యకర్తలకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించడమైనది. నియోజకవర్గ ప్రగతికి సరికొత్త ఊపునివ్వబోతున్న మన లోకేష్ అన్న పర్యటనను కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కదిలివచ్చి బ్రహ్మాండంగా విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాను.

# ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసమే సంజీవని

**● టెక్నాలజీ వినియోగంలో నేను జెన్ జీ వర్గమే ● నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష ● కాలర్ ఎగరేసి చెప్పకునేలా అమరావతి నిర్మాణం ● నిర్మాణాల వేగం చూసి తట్టుకోలేకే రాజధానికి వైసీపీ నేతలు ● ఛీ ఛీ అంటున్నా... మావిగన్ పట్టుకుని వేలాడుతున్నారు. ● వైసీపీ క్రిమినల్ పాలిటిక్స్ తో సమాజానికి, ఆడబిడ్డలకు రక్షణ లేదు ● గిద్దలూరు కిష్టంశెట్టి పల్లెలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

ప్రజాభూమి ప్రతినిధి,మార్కాపురం:
రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్ట అమలు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులతో కూడిన సంజీవని ప్రాజెక్టును అమలు చేయనున్నట్టు వెల్లడించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం కిష్టంశెట్టి పల్లెలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ కేర్ వరకూ వైద్య సేవలు అందేలా ఈ సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా వ్యక్తిగత ఆరోగ్య పర్యవేక్షణ ఉంటుందని సీఎం వివరించారు. ప్రజలు అందరికీ సంపూర్ణ వైద్య సేవలు అందించేలా సంజీవని కార్యక్రమం అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరెటివ్ విధానం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడతామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సూపర్ స్పెషాలిటీ వరకూ మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానిస్తామని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ..” సంజీవని ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్ బుకింగ్, ఆరోగ్యంపై ఫాలోఅప్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్యసేవలు అందుతాయి. సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డ్స్ ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2.61 కోట్ల మందికి ఎన్సీడీ స్క్రీనింగ్ నిర్వహించాం. డి స్ట్రిక్ట్, స్టేట్, విలేజ్ డిసీజ్ ప్రొఫైల్ లను విశ్లేషిస్తాం. సంజీవని లాంటి కార్యక్రమాల అమలుకు ప్రజల నుంచి కూడా పూర్తి మద్దతు కావాలి. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామంతో ఆరోగ్యం కాపాడుకోవాలి. యోగా, ధ్యానం, ప్రాణాయామం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని కోరుతున్నాను. తాజా ఆహారం, రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటివి తీసుకోవాలి. ఆహారంలో కార్బొహైడ్రేట్స్ తగ్గించాలి. పేదల సంక్షేమంపై ఉన్న ఆలోచనతోనే పథకాలు అందిస్తున్నాం. స్త్రీశక్తితో ఉచిత ప్రయాణం, దీపం 2.0 లాంటి పథకాలు మహిళలకే అమలు చేస్తున్నాం. అన్నదాతకు అండగా ఉండేలా మొదటి విడత నిధులు విడుదల చేశాం. వచ్చే నెలలో తల్లికి



వందనం పథకం కింద నిధులు తల్లుల ఖాతాలో జమ చేస్తాం. ప్రభుత్వ పాఠశాలల పరపతి పెరిగింది. చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగుమందులు వాడకుండా రైతుల కోసం ఓ యాప్ తీసుకువచ్చాం. మన దగ్గరి నుంచి ఎగుమతి చేసిన మిరపలో క్రిమి సంహారకాలు ఉన్నాయని చైనా వెనక్కు తిప్పి పంపింది. అందుకే ప్రకృతి సేద్యం చేసి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేద్దాం.” అని ముఖ్యమంత్రి అన్నారు.

**జెన్ జీ కంటే వేగంగా ఆలోచన**

“ప్రస్తుత జెన్ జీ, జెన్ ఆల్ఫా వర్గానికి చెందిన యువతలానే నేనూ జెన్ జీని. భవిష్యత్తును ముందే ఊహించి దానికి అనుగుణంగా టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నాను. ఏఐ, క్వాంటం టెక్నాలజీల్లో మన యువత నిష్ణాతులు కావాలి. చిన్న కుటుంబాలు భారత దేశ సంప్రదాయం కాదు, ఉమ్మడి కుటుంబమే ఆనందదాయకం అని గుర్తించాలి. జనాభా నిర్వహణ ఇప్పుడు తక్షణ అవసరంగా మారింది. ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఆలోచన చేస్తున్నాం. ప్రపంచంలోని కొన్ని దేశాలు జనాభా లేక ఇబ్బందులు పడుతున్నాయి. అమరావతి రాజధాని నగరాన్ని హరిత నగరంగా, నివాసయోగ్య ప్రాంతంగా నిర్మిస్తున్నాం. మన రాజధాని అమరావతి అని కాలర్ ఎగరేసి చెప్పేలా అభివృద్ధి చేస్తాం. గొడ్డలి పార్టీ ముందు అమరావతిని అంగీకరించి ఆ తర్వాత మూడు ముక్కల ఆట ఆడింది. ఐదేళ్ల పాటు తాత్సారం చేసిన గొడ్డలి పార్టీ అభివృద్ధిని ఆమడ దూరం పెట్టింది. గొడ్డలి పార్టీ నేతలు మోసాలు చేయటంలో దిట్టలు. అమరావతి చట్టం కూడా అయి పోయాక మావిగన్ అంటున్నారు. మావిగన్ అంటే ఎవరికీ అర్థం కాదు. అందరూ ఛీ కొడుతున్నారు. బాధ్యతలేని రాజకీయ పార్టీ ప్రజల్ని వారి నిర్ణయాన్ని అపహాస్యం చేస్తోంది.” అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష**

“మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత కూడా నాకే వచ్చింది. రూ.3,900 కోట్ల పనులు చేయాల్సి ఉన్నా గత పాలకుడు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పునరావాసం కింద నేడు రైతులకు రూ.300 కోట్లు ఇచ్చాం. త్వరలోనే మరో రూ.600 కోట్లు విడుదల చేస్తాం. రెండు దశలలో 4 లక్షల ఎకరాల పైచిలుకు ప్రాంతంలో ఆయకట్టుకు నీరు అందుతుంది. రామాయపట్నం పోర్టు కూడా త్వరలోనే పూర్తై పరిశ్రమలు వస్తాయి ఇక్కడి యువతకు స్థానికంగానే ఉద్యోగాలు వచ్చేలా పారిశ్రామిక క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తున్నాం. ఉమ్మడి ప్రకాశం జిల్లా సహా రాయలసీమను హార్టీకల్చర్ హబ్ చేస్తాం. వివిధ రకాల పండ్ల తోటలతో పాటు వాణిజ్య పంటలు పండించేందుకు వీలుగా కార్యాచరణ చేపడతాం.
తుంగభద్ర గేటు కొట్టుకు పోతే వెంటనే స్పందించి ఆ గేటు బిగించి 33 కొత్త క్రస్ట్ గేట్లు ఏర్పాటు చేశాం. ఏపీ, తెలంగాణా, కర్ణాటక కలిసి రైతుల ప్రయోజనాల కోసం పని చేస్తున్నాం. గంగా-కావేరి నదుల అనుసంధానం జరిగేలా గోదావరి-నల్లమల సాగర్ లింక్ తో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం. గోదావరి నుంచి కావేరి నది వరకూ నీటిని తీసుకెళ్తాం. నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష. ఈ ప్రాజెక్టుల విషయంలో ఎవరికీ కడుపు ఉబ్బరం అవసరం లేదు. రైతు ప్రయోజనాలే ముఖ్యం కావాలి. ఎల్ నినో వల్ల వర్షాలు లేక నదుల్లో నీటి ప్రవాహాలు తగ్గాయి. పర్యావరణం, నీటిని పొదుపుగా వాడుకోవాలి. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చటమే ఇప్పుడు మన తక్షణ కర్తవ్యం. చెక్ డ్యామ్ లు కడితే ఎగతాళి చేశారు. సాగునీరు ఇచ్చి రాష్ట్రాన్ని ప్రగతి పథం వైపు నడపాలన్నదే నా లక్ష్యం. జలధార ద్వారా భూగర్భజలాలు పెంచి అన్నమయ్య జిల్లా విజయం సాధించింది. ఇంత చేస్తుంటే కులం, మతం, ప్రాంతం అని కొందరు కుట్రలు చేస్తున్నారు. సమర్థవంతమైన ప్రభుత్వమే ప్రజల సమస్యల్ని పరిష్కారం చేయగలుగుతుందని” సీఎం స్పష్టం చేశారు.

**రాజధాని నిర్మాణం అడ్డుకోడానికే వైసీపీ కుతంత్రాలు**

“గత పాలనలో విధ్వంసంతో నలిగిపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మించాలనే బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా పనిచేస్తున్నాం. రూ.10 లక్షల కోట్ల అప్పులు, వ్యవస్థల విధ్వంసం, కనీసం నలుగురు వ్యక్తులు కలిసి మాట్లాడుకోలేని దుస్థితి గత పాలనలో ఉంది. నేడు మనం అంతా స్వేచ్ఛగా మాట్లాడు కోగలుగుతున్నాం. ఇదే నాటికి నేటికి ఉన్నతేడా. బ్లేడ్, గంజాయి బ్యాచ్ లు రాబందుల తరహాలో వేచి ఉన్నారు. ఏమీ జరక్కపోయినా ఏవో నేరాలు చేసి ఎవరో ఒకరిపై నెట్టేసి గొడ్డలి పార్టీ డైవర్ట్ చేస్తోంది. ఇటీవల విజయవాడలో జరిగిన ఓ ఘటనకు కులం రంగు పులిమి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై విమర్శలు చేశారు. హోం మంత్రి అనిత మేకప్ గురించి ఆమెను అవమానించేలా కొందరు వ్యక్తులు మాట్లాడుతున్నారు. మహిళల మేకప్ గురించి మాట్లాడటానికి ఆ పార్టీ వారికి సిగ్గు అనిపించటం లేదు. పోలీసులపై ఇష్టాను సారంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇవన్నీ చూస్తూ ఊరుకోం. అమరావతిపై కుట్రచేయడానికే వైసీపీ నేతలు అక్కడికి వెళ్లారు. రాజధాని రైతుల్ని రెచ్చగొట్టడానికే అమరావతికి వెళ్లారు. రాజధాని నిర్మాణం జరుగుతుంటే దానిని అడ్డుకోడానికే వైసీపీ నేతలు రాజధాని ప్రాంతానికి వెళితే రైతులు వారిని అడ్డగించారు. గొడ్డలి పార్టీ నిరంతరం కుట్రలు చేస్తూనే ఉంది. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత దానికి లేదు. దేవాలయాలపై దాడులు చేసిన వ్యక్తులు ఇప్పుడు దేవాలయాల సందర్శనకు వెళ్లి నాటకాలు ఆడుతున్నారు. కళ్లార్పకుండా అబద్దాలు, మోసాలు చేస్తున్నారు. నేరాలు చేస్తారు, ఘోరాలు చేస్తారు. నేరస్థులైన రాజకీయ పార్టీలు, నేతలతో నేను పోరాడలేదు. ఆ పార్టీది పూర్తిగా క్రిమినల్ పాలిటిక్స్. గంజాయి బ్యాచ్ , రౌడీ బ్యాచ్ ను తయారు చేసి అరాచకం చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులతో ఆడబిడ్డలకు, సమాజానికి రక్షణ లేదు. వారు చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బాగు చేయడానికి సుదీర్ఘ సమయం పడుతోంది.”అని ముఖ్యమంత్రి అన్నారు. అనంతరం మార్కాపురం జిల్లాలో ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలకు సంబంధించిన రిపోర్టు కార్డును సీఎం ప్రజల ముందు ఉంచారు. ప్రజామోదం లేని పాలనను సహించేది లేదని స్పష్టం చేశారు. పౌర సేవలను అందించే అంశంపై ఆకస్మిక తనిఖీలకూ వస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డీబీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# గాదె సాయికృష్ణది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

**● పోలీస్ బాసులను, రాజకీయ సూత్రధారులను రక్షించేందుకే సిట్ డ్రామాలు- వైసీపీ నేత మనోహర్ రెడ్డి**
**● మే 25 నాటికి సీసీటీవీలు పనిచేస్తున్నాయన్న ప్రభుత్వం ● రిమాండ్ రిపోర్టులో సీసీ ఫుటేజ్ లేదనడం కోర్టును తప్పుదోవ పట్టించడమే. - సాయికృష్ణ తల్లి ఫోన్ లాక్కొని, 15 రోజుల డేటా డిలీట్ చేయడం చట్టవిరుద్ధం**
**● సాక్ష్యాల ధ్వంసం కింద పోలీసులపైనే కేసు పెట్టాలి ● సాయికృష్ణ కేసును తక్షణమే సీబీఐకి అప్పగించాలి**

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి:
గాదె సాయికృష్ణ లాకప్‌డెత్, శవం మాయం ఉదంతంలో పోలీసు ఉన్నతాధికారులను, వారి వెనుక ఉన్న రాజకీయ పెద్దలను రక్షించేందుకు ప్రభుత్వం క్రూరమైన కుట్రలు చేస్తోందని వైయస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, ఈ హత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, బాధ్యులను తప్పించేందుకు వ్యవస్థలన్నీ కుమ్మక్కై ‘కంటితుడుపు’ దర్యాప్తు చేస్తున్నాయని మండిపడ్డారు. బాధితురాలైన తల్లి గాదె విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదును పక్కనపెట్టి, కేవలం ఒకే ఒక్క సీఐపై తూతూమంత్రంగా 302 కేసు పెట్టి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంకా ఏమన్నారంటే...
సాధారణంగా ఒక నిందితుడిపై నాన్-బెలబుల్ వారెంట్ (ఛీదీఔ) ఉంటే, సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ లేదా స్థానిక పోలీసులు వెళ్లి పట్టుకోవాలి. కానీ, సాయికృష్ణ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా టాస్క్ ఫోర్స్ రంగంలోకి ఎందుకు దిగిందో సమాధానం చెప్పాలి. మే 5వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు టాస్క్ ఫోర్స్ పోలీసులు మార్కాపురం వెళ్లి సాయికృష్ణను తీసుకొచ్చినట్లు రిమాండ్ రిపోర్టులో రాశారు, అయితే సిటీ కమిషనర్ లేదా ఏసీపీ ఆదేశాల కాపీ ఎక్కడా లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జగ్గయ్యపేటకు సంబంధించిన ఒక పెద్ద భూ వివాదంలో కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందని, వారి కోసమే టాస్క్ ఫోర్స్‌ను అక్రమంగా ఉపయోగించి సాయికృష్ణను మట్టుబెట్టారని ప్రజల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది.



“కొడుకుని చూపించమని పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన బాధిత తల్లికి సహాయం చేయాల్సింది పోయి, ఆమె వద్ద ఉన్న సెల్ ఫోన్‌ను పోలీసులు అక్రమంగా లాక్కున్నారు. 15 రోజుల పాటు తమ వద్దే ఉంచుకుని, అందులోని డేటా మొత్తాన్ని డిలీట్ చేసి తిరిగి ఇచ్చారు. ఇది చట్టప్రకారం నేరం. సాక్ష్యాలను ఉద్దేశపూర్వకంగా తుడిచిపెట్టే ప్రయత్నం చేసిన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి”. అలాగే మే 7, 8 తేదీల్లో సాయికృష్ణ లాకప్‌లో ఉన్నాడని ఒక ఎస్సై చూసినట్లు రాయడం మినహా రిమాండ్ రిపోర్టులో ఎలాంటి బలమైన అంశాలు లేవన్నారు. పోలీసు అధికారులు ప్రతిరోజూ సమర్పించే ‘డైలీ స్టేటస్ రిపోర్ట్’లో కానీ, స్టేషన్ జనరల్ డైరీలో కానీ చట్టప్రకారం చేయాల్సిన ఎంట్రీలు ఎందుకు చేయలేదు. విజయవాడ నగరంలో సీసీటీవీలు పనిచేస్తున్నాయా లేదా అని మల్లేమూడి సతీష్ బాబు అనే అడ్వకేట్ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయగా, మే 25, 2026 న పోలీస్ శాఖ అధికారికంగా లిఖితపూర్వక సమాధానం ఇస్తూ... విజయవాడ కమిషనరేట్ పరిధిలో సీసీటీవీలన్నీ పద్ధతి ప్రకారం సక్రమంగా పనిచేస్తున్నాయని, తాము రెగ్యులర్‌గా మానిటర్ చేస్తున్నామని పోలీసులే స్వయంగా ఒప్పుకున్నారన్నారు. “మే 25 నాటికి కెమెరాలన్నీ పక్కాగా పనిచేస్తున్నప్పుడు.. మే మొదటి వారంలో జరిగిన సాయికృష్ణ లాకప్‌డెత్ ఫుటేజ్ రికార్డుల్లో భద్రంగా ఉన్నట్టే కదా? మరి జూన్ 19 తర్వాత కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ‘ఫుటేజ్ ఏమీ లేదు, అంతా డిలీట్ అయింది’ అని రాయడం కోర్టును సైతం దారుణంగా తప్పుదోవ పట్టించడమే”.
మూడంచెల వ్యవస్థ, క్లౌడ్ స్టోరేజ్ డేటా ఏమైంది? సుప్రీంకోర్టు ‘పరంవీర్ సింగ్ సైనీ’ జడ్జిమెంట్ మార్గదర్శకాల ప్రకారం..
జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో కూడా స్వతంత్ర కమిటీలు ఉండాలి, ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఆడియో-వీడియో రికార్డింగ్ సౌకర్యంతో 12-14 కెమెరాలు ఉండాలి. కృష్ణలంక పోలీస్ స్టేషన్ కెమెరాలు నేరుగా ‘కమాండ్ కంట్రోల్ రూమ్’కు, ఆర్టీజీఎస్ కు, డీజీపీ ఆఫీస్‌కు అనుసంధానమై ఉంటాయి. ఈ మూడంచెల వ్యవస్థలో అన్ని చోట్లా ఫుటేజ్ ఎలా మాయమవుతుంది?. ఈ కెమెరాలను నిర్వహిస్తున్న ‘మాట్రిక్స్ కంపెనీ’ క్లౌడ్ స్టోరేజ్‌లో 90 రోజుల పాటు ఫుటేజ్ భద్రంగా ఉంటుంది, సిట్ అధికారులు ఆ క్లౌడ్ డేటాను ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? అసలు ఫుటేజ్‌ను డిలీట్ చేసి, సర్వర్లలో వేరే డేటాను నింపి కప్పిపుచ్చే ప్రయత్నంచేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆడిట్ లాగ్ ద్వారా ఏ యూజర్ ఐడీ నుంచి డేటా డిలీట్ అయిందో తెలుసుకోవచ్చు, దీనిని ఫోరెన్సిక్ కు పంపి రికవర్ చేయడంలో దర్యాప్తు అధికారులు ఎందుకు ముందడుగు వేయడం లేదు?
ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో కూడిన ‘మాట్రిక్స్ కెమెరాలు’ పెట్టామని, నెంబర్ ప్లేట్ ఆధారంగా వాహనాల కదలికలను కనిపెడతామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. అలాంటప్పుడు నగరంలోకి సాయికృష్ణను తెచ్చిన ఆనుపానులు, శవాన్ని తీసుకెళ్లిన ఆనుపానులు, అలాగే శవాన్ని ‘స్వర్గపురి’ శ్మశాన వాటికలో దహనం చేశారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో.. ఆయా పరిసరాల్లోని కెమెరాల ఫుటేజ్ ఏమైంది? ఒక చెట్టు కింద కూర్చుని గంజాయి తాగినా డ్రోన్లతో పట్టుకుంటామని ప్రగల్భాలు పలికే హోంమంత్రి గారు.. సాక్షాత్తూ పోలీస్ స్టేషన్ లోనే హత్య జరిగి శవం మాయమైతే ఎందుకు నోరు మెదపడం లేదు?”. నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు గానీ, హోంమంత్రి గానీ ఇంతవరకు ఈ హత్యపై ప్రెస్ మీట్ ఎందుకు పెట్టలేదు?
ఈ నేపథ్యంలో మృతుని తల్లి విజయలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు అంగీకరిస్తూ.. హార్డ్ డిస్కులు, సీసీటీవీ ఫుటేజ్ పరికరాలను ప్రొడ్యూస్ చేయాలని, అలాగే భారతి ఎయిర్‌టెల్ సిమ్ కార్డుల కాల్ డేటా రికార్డ్స్ , టవర్ లొకేషన్ల వివరాలను సమర్పించాలని ఆదేశించినా పోలీసులు ఇంతవరకు స్పందించకపోవడం వారి నేరాన్ని అంగీకరించినట్లే.ప్రస్తుతం అమలులోకి వచ్చిన బీఎన్ ఎస్ ఎస్ ప్రకారం కస్టోడియల్ డెత్‌లపై జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ విచారణ జరగాల్సి ఉండగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాయిదాలు కోరుతూ కాలయాపన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ కొడుకు శవాన్ని కాల్చి బూడిద కూడా లేకుండా మాయం చేశారని ఓ తల్లి గర్భశోకంతో ఏడుస్తోందని, ఆమెకు న్యాయం జరగాలన్నా, నిజాలు బయటకు రావాలన్నా ఈ కేసును తక్షణమే సీబీఐ కి అప్పగించాలని మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల తరఫున న్యాయస్థానాల్లో మరియు ప్రజా క్షేత్రంలో వైయస్సార్‌సీపీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని మనోహర్‌రెడ్డి హెచ్చరించారు.

# చిన్నారి నిత్విక హత్య బాధాకరం

**బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం**

**-బీటెక్ రవి**



ప్రజాభూమి, పులివెందుల
లింగాల మండలం లోపట్నూతల గ్రామానికి చెందిన సృజన, రామాచారి దంపతుల నాలుగేళ్ల కుమార్తె నిత్వికను స్వాతి అనే మహిళ నీళ్ల డ్రమ్‌లో ముంచి హత్య చేసిన ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితురాలు స్వాతిని పోలీసులు అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ నేపథ్యంలో పులివెందుల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవిని కలిసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ చిన్నారి మృతి విషయం తెలిసిన వెంటనే తన సతీమణి పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి , తన తమ్ముడు జోగిరెడ్డి ,లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ కూటమి నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారని తెలిపారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింద ని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు.అలాగే, ఈ కేసులో నిందితు రాలు స్వాతిపై పోలీసులు ఇప్పటికే చట్టపరమైన చర్యలు చేపట్టారని, బాధిత కుటుంబానికి తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి వారికి ధైర్యం చెబుతానని, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని బీటెక్ రవి హామీ ఇచ్చారు.

# ముత్యపు కవచంలో భక్తులను మురిపించిన శ్రీ మలయప్పస్వామి...

ప్రజాభూమి ప్రతినిధి, తిరుమల:
తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకంలో భాగంగా రెండో రోజు శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ముత్యపు కవచం ధరించి నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను మురిపించారు. అంతకుముందు ఉదయం 6.30 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు ఉభయనాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఉదయం 8 గంటలకు ఆలయ అర్చకులు మరియు వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీ మలయప్ప స్వామివారికి, దేవేరులకు అభిదేయక అభిషేకాన్ని కన్నులపండుగగా చేపట్టారు.
సాయంత్రం శ్రీ మలయప్పస్వామివారికి ముత్యపు కవచ సమర్పణ వేడుకగా జరిగింది. అనంతరం సహస్రదీపాలంకార సేవలో స్వామి ముత్యపు కవచంలో భక్తులను అనుగ్రహించారు. కాగా సంవత్సరంలో ఒకమారు మాత్రమే ముత్యపు కవచాన్ని ధరించిన స్వామివారి ముగ్ధమనోహర రూపాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, శ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ , అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# అంధుల ఆశ్రమంలో అన్నదానం

**కొంగనపల్లె వెంకట నారాయణకు కు ఘన నివాళులు**

**ఐదో వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమంనిర్వహించిన కుటుంబ సభ్యులు**



ప్రజాభూమి,పులివెందుల
పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న శ్రీ వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో కీర్తిశేషులు కొంగనపల్లె వెంకట నారాయణ ఐదవ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొంగనపల్లె కుటుంబ సభ్యులు శ్రీనివాసులు, కృష్ణవేణి, రవి, అరుణ, కొండలరావు, రాజేశ్వరి, దేవి, మురళీమోహన్, సుభద్ర తదితరుల ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆశ్రమంలో వెంకట నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులు ఘన నివాళులర్పించారు. అనంతరం అంధులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ తండ్రి కొంగనపల్లె వెంకట నారాయణ వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో సేవా భావాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో అంధుల ఆశ్రమంలో అన్నదానం చేయడం ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా తమ తండ్రి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అనిమెల రామమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమంలోని అంధులు కుటుంబ సభ్యుల సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

# గిరిజిన మహిళ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి :కాకాణి పూజిత

ప్రజాభూమి ప్రతినిధి,నెల్లూరు:
కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళల మీద జరుగుతున్న దాడులు, అరాచకాలు, అత్యాచారాలపర్వం రెండేళ్లకే పరాకాష్టకు చేరుకుందని వైయస్సార్‌సీపీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళలను తాకాలంటే భయపడే పరిస్థితి నుంచి తాము ఏం చేసినా పోలీసులు ఏమీ చేయరనే ధైర్యంతోనే టీడీపీ నాయకులు మహిళలపై దాడులు, అత్యాచారాలకు దిగుతూ బరితెగిస్తున్నారని ధ్వజమెత్తారు. భర్త చనిపోయి పిల్లలతో ఒంటరిగా ఉంటున్న గిరిజన మహిళను టీడీపీ నాయకులు వివస్త్రను చేసి దారుణంగా కొట్టి హింసించడమే కాకుండా ఆమె కొడుకుపైనే కేసు నమోదు చేయడం చూస్తే పోలీస్ వ్యవస్థ మీద ప్రజలకు ఎలా నమ్మకం కలుగుతుందని ప్రశ్నించారు. ఈనెల 19న ఘటన జరిగితే 26వ తేదీ వరకు కేసు నమోదు చేయలేదని, పైగా ఆమె ఎక్కడుందో కూడా చెప్పకుండా రహస్యంగా చికిత్స చేయిస్తున్నారని చెప్పారు. ఆమె కొడుకు ఒక ముస్లిం యువతిని ప్రేమించడమే నేరమైందని, దానికి టీడీపీ మాజీ కౌన్సిలర్ ఇబ్రహీం కుటుంబసభ్యులు బహిరంగంగా బట్టలూడదీసి అవమానిస్తే పోలీసులు వంతపాడటం సిగ్గుచేటన్నారు. నెల్లూరు జిల్లా కావలి కచేరిమిట్ట ప్రాంతంలో జరిగిన ఈ ఘటన చూస్తే కూటమి ప్రభుత్వంలో మహిళల రక్షణపై ఆందోళనలు కలుగుతున్నాయని చెప్పారు. మరో ఘటనలో దుత్తలూరు మండలం భీమవరంలో సుజాత అనే మహిళను దారుణంగా కొట్టినా ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని చెప్పారు.

ప్రజాభూమి

జనరల్

ఆదివారం, జూన్ 28, 2026



# కుర్చీ కోసం ఆరాటం మీది..

# ప్రజా సేవ కోసం పోరాటం మా నాయకుడు పవన్ కళ్యాణ్ ది

మంత్రి కందుల దుర్గేష్



**ప్రజారాజధాని అమరావతి పై , పవన్ కళ్యాణ్ పై వైసీపీ నేతల బాధ్యతారాహిత్య వ్యాఖ్యలపై పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర ఆగ్రహం**

**సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వాన్ని విమర్శించే నైతిక హక్కు వైసీపీకి లేదు: మంత్రి దుర్గేష్**

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎదుగుదలను చూసి వైసీపీ కాపు నేతల కడుపు మంట**

అమరావతి ప్రజాభూమి ప్రతినిధి

ఐదేళ్ల పాటు అధికార దాహంతో రాష్ట్రాన్ని దోచుకున్న వైసీపీ నేతలకు, పదవులు ఉన్నా లేక పోయినా నిత్యం ప్రజల పక్షాన నిలబడే జనసేనాని పవన్ కళ్యాణ్ నైతికతను విమర్శించే స్థాయి లేదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందు ల దుర్గేష్ శనివారం ఒక ప్రకటనలో ఫైర్ అయ్యారు. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ సాధిస్తున్న అద్భుత విజయాలు, ప్రజాదరణను చూసి వైసీపీలోని కాపు నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. రాజకీయాల్లో ఇచ్చిన మాట పై నిలబడ్డ ఏకైక వ్యక్తి పవన్ కళ్యాణ్. ఆయన వ్యక్తిత్వాన్ని, విజన్‌ను అర్థం చేసుకోవడానికి వైసీపీ నేతలకు ఈ జన్మ సరిపోదు. ఆయన పదవులు చూసి మురిసిపోయే నాయకుడు కాదు.. వచ్చిన పదవికి వంద శాతం న్యాయం చేసే గట్స్ ఉన్న వ్యక్తి..'పల్లె పండుగ' ద్వారా దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన గ్రామాల్లో, ఏజెన్సీ ఏరియాల్లో రహదారులు నిర్మించి, పంచాయతీరాజ్ శాఖకు అవార్డుల పంట పండించిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ది అన్నారు.సొంత ప్రయోజనాల కోసం కాకుండా, భవిష్యత్తు తరాల కోసం అవసరమైతే తన సర్వస్వం వదులుకునే నాయకుడు పవన్ కళ్యాణ్ అని పేర్కొన్నారు...రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజల శ్రేయస్సు కోసం తన స్వార్థాన్ని పక్కన పెట్టి కూటమిని ఏర్పాటు చేసిన త్యాగశీలి ఆయన..కేవలం రాబోయే ఎన్నికల కోసం మాత్రమే కాకుండా, రాబోయే పాతిక సంవత్సరాల భవిష్యత్తు తరాల ఆంధ్రప్రదేశ్ యువతకు ఉపాధి, రక్షణ, అభివృద్ధి దక్కాలనేది ఆయన నిరంతర తపన.. సంక్షేమ పథకాలు ఇస్తూనే అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా న్యాయం జరగాలనే వైపు ఉంటా యి ఆయన ఆలోచనలు..రూపాయి అవినీతి లేకుండా, ప్రభుత్వ నిధులు ప్రతి పైసా నేరుగా ప్రజలకే చేరాలనేది ఆయన నైజం..ప్రజా క్షేత్రంలో జవాబుదారీతనంతో కూడిన నూతన రాజకీయ సంస్కృతిని ఆయన తీసుకొచ్చారు.. అలాంటి వ్యక్తి పైనా మీరు విమర్శలు చేసేది? అని వైసిపి నేతలను సూటిగా ప్రశ్నించారు. రెండు చోట్ల ఓడిపోయిన కూడా మొక్కవోని ధైర్యంతో, ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతో నూటికి నూరు శాతం సీట్లు సాధించిన ఘనుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని సమాధానం ఇచ్చారు.. నాడు ఆయన తగ్గారు కాబట్టే నేడు నెగ్గారని స్పష్టం చేశారు..కుర్చీ కోసం ఆరాటం మీది.. ప్రజా సేవ కోసం పోరాటం మా నాయకుడు పవన్ కళ్యాణ్ ది అని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేసారు..ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ మొదటి నుంచీ కక్షగట్టిందని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో ఇప్పుడు అక్కడ జరుగుతున్న శరవేగ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆ పార్టీ నేతలు నిత్యం విషం చిమ్ముతున్నారని మంత్రి కందుల దుర్గేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతిలో వైసీపీ నేతల పర్యటనలు కేవలం ప్రజలను రెచ్చగొట్టేందుకేనని ఆయన మండిపడ్డారు."రాజధాని విషయంలో ఈ దేశంలోనే అత్యంత అస్పష్టత, చేతకానితనం ఉన్న ఏకైక పార్టీ వైసీపీ. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడి, ఆపై మాట మార్చి రాష్ట్రాన్ని దిక్కులేనిదిగా చేసిన చరిత్ర మీది. నోరు ఉంది కదా అని అమరావతిపై అడ్డగోలుగా మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరు. మీ అధినాయకుడిని అసలు రాష్ట్ర రాజధాని ఏదో అడిగే దమ్ముందా?" అని మంత్రి దుర్గేష్ ప్రశ్నించారు..అమరావతి రాజధానిపై, కూటమి ప్రభుత్వంపై మీ అక్కసు ఇలాగే కొనసాగితే.. వచ్చే ఎన్నికల్లో మీకు గుడ్లు రావడం కాదు, కనీసం డిపాజిట్లు కూడా దక్కకుండా ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. ఇప్పుడు గుడ్లతోనే కొట్టారు.. రాజధానిపై గేమ్ ఆడితే ప్రజలు 11 కు పరిమితం చేశారు.. ఇలాగే రాజధానిపై విషం కక్కితే ఇప్పుడు గుడ్లతోనే సమాధానం చెప్పారు.. నెక్స్ట్ ఏం చేస్తారో మీ ఊహకే వదిలేస్తున్నామని మంత్రి దుర్గేష్ హెచ్చరించారు .

కూటమి బలపడుతుందన్న భయంతోనే వైసీపీలో వణుకు*"ప్రపంచం మొత్తం అమరావతి వైపు చూసేలా చేసిన విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు, ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో కూటమి రోజురోజుకూ బలపడుతోంది. ఈ భయమే వైసీపీ నేతల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఐదేళ్లు అధికారంలో ఉండి, మీ నాయకుడు ఎటు టర్న్ తీసుకుంటే అటు మాట్లాడిన చేతగాని వ్యక్తులు మీరు. జనసేన గురించి, కూటమి నాయకుల గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు. మీ హయాంలో జాబ్ క్యాలెండరు, సీపీఎస్ రద్దు, మద్య పాననిషేధం హామీలపై ముందు స్పష్టత ఇవ్వండి. మేము చెప్పిందే చేస్తున్నాం.. చేసేదే చెప్తున్నాం. భవిష్యత్తు తరాల కోసం అందమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించి తీరుతాం" అని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.సోషల్ మీడియాలో, ప్రెస్ మీట్లలో నోటికొచ్చినట్టు అబద్ధాలు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోవడానికి ఇది మీ తుగ్లక్ రాజ్యం కాదు.. ఇది ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం.. ప్రతి అబద్ధాన్ని నిజాలతో తిప్పికొడతామని మంత్రి కందుల దుర్గేష్ ఘాటుగా స్పందించారు.



## 29 నుంచి జూలై 3 వరకు చిట్టినగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ, ఈనెల 29 నుంచి జూలై 3వ తేదీ వరకు చిట్టినగర్ లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ నగరాల సీతారామ స్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం దేవస్థానం ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను వారు ఆవిష్కరించారు. 29వ తేదీన సహస్ర కలశాభిషేకం,స్వామి వారిని పెండ్లి కుమారుని చేయుట తదితర కార్యక్రమాలు, 30వ తేదీన అగ్ని ప్రతిష్ట ,నవగ్రహారాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే జూలై ఒకటో తేదీన సామూహిక కుంకుమార్చన తదితర కార్యక్రమాలు, అదేరోజు సాయంత్రం ఏడు గంటలకు 250 మంది దంపతులచే శ్రీ స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. రెండో తేదీ ఉదయం పుష్పయాగం, సాయంత్రం గరుడ వాహనంపై శ్రీ స్వామి వారి నగరోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. మూడో తేదీ ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం పవళింపు సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని, ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మజ్జి శ్రీనివాస రావు, పోతిన ధర్మారావు, కామందుల నరసింహారావు, పిళ్ళా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## 60 లక్షల విలువైన 400 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ శ్రీ వి. విద్యాసాగర్ నాయుడు



మచిలీపట్నం/క్రైమ్ ప్రజాప్రతినిధి

CEIR పోర్టల్ ద్వారా మూడు నెలల కాలంలోనే 400 మొబైల్ ఫోన్ల రికవరీ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ప్రతి ఒక్కరూ వెంటనే CEIR పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేస్తే, దానిని గుర్తించి తిరిగి అందించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు కూడా ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు,పేర్కొన్నారు.జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరు ల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, నేటి ఆధునిక జీవితంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో విడదీయరాని భాగమైందన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ సేవలు, విద్య, ఉద్యోగం, వ్యాపారం వంటి అనేక అవసరాలకు మొబైల్ ఫోన్ కీలక సాధనంగా మారిందని తెలిపారు. అలాంటి మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడం, దొంగతనానికి గురికావడం లేదా ఇతర కారణాలతో కోల్పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు.ప్రజలకు త్వరితగతిన సహాయం అందించాలనే లక్ష్యంతో CEIR (Central Equipment Identity Register) పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందిస్తున్నామని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా పోగొట్టుకున్న, దొంగిలించబడిన లేదా ఇతర కారణా లతో కోల్పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించేందుకు CCS ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ టీం ఐటీ కోర్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ CEIR పోర్టల్ ద్వారా IMEI వివరాలను విశ్లేషించి, వివిధ ప్రాంతాల్లో గుర్తించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందించడంలో విశేష కృషి చేస్తోంది.ఈ ప్రత్యేక చర్యల ఫలితంగా కేవలం మూడు నెలల కాలంలోనే మొత్తం 400 మొబైల్ ఫోన్లు, సుమారు రూ.60 లక్షల విలువైన వాటిని రికవరీ చేయడం జరిగింది.



వీటిలో:మచిలీపట్నం CCS – 100 పెనమలూరు CCS – 63గుడివాడ CCS – 237 మొబైల్ ఫోన్లు ఉన్నాయి. ఈ మొబైల్ ఫోన్లను ఈరోజు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు.ప్రజలు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు CEIR పోర్టల్‌లో కూడా వివరాలు నమోదు చేయాలి. దీంతో మొబైల్‌ను బ్లాక్ చేయడంతో పాటు గుర్తించి తిరిగి అందించే ప్రక్రియ వేగవంతమవుతుంది. ప్రజల ఆస్తుల రక్షణకు కృష్ణాజిల్లా పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని తెలిపారు.మొబైల్ ఫోన్లు తిరిగి అందుకున్న బాధితులు జిల్లా ఎస్పీ కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమర్థవంతమైన సేవలు అందిస్తున్న కృష్ణాజిల్లా పోలీసులను అభినందించారు.



మంగళగిరి లో శనివారం జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో పాల్గొన్న మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి

## రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం

**ఉండవల్లి క్యాంప్ ఆఫీసులో సిఎం చంద్రబాబు, వైజాగ్ లో మంత్రి సత్యకుమార్ యాదవ్ చే ప్రారంభం**

**49.20 లక్షల మందికి పైగా పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు భారీ ఏర్పాట్లు**

**రూ.6.20 కోట్ల వరకు వ్యయం**

**ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు**



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి:

రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు (FAC) నేడొక ప్రకటనలో వెల్లడించారు. ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైజాగ్ లో వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలో 5 ఏళ్లలోపు ఉన్న 49.20 లక్షల మందికి పోలియో చుక్కల్ని వేస్తామని చెప్పారు. ప్రత్యేక బూత్ లలో పోలియో చుక్కలు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం అందజేసిన డోస్‌లను ఇప్పటికే అన్ని జిల్లాలకు పంపించామని తెలిపారు. మాములుగా జరిగే ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా 5ఏళ్ల లోపు పిల్లలందరికీ (పుట్టగానే, 6 వారాలకు, 10 వారాలకు, 14 వరాలకు, 16 నెలలకు ) 5 డోస్ ల పోలియో (ఓపీవీ) చుక్కల్ని వేస్తారు. పల్స్ పోలియో రోజున అదనంగా ఒక డోస్ ( 2 చుక్కలు) వేస్తారు. పల్స్ పోలియో కార్యక్రమాల నిర్వహణ కోసం రూ. 6.20 కోట్ల వరకు ఖర్చు పెడుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయిలో( ఎఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్వాడీ వర్కర్, స్టాఫ్ నర్సుల బృందం) పిల్లలకు ఆదివారం పోలియో చుక్కల్ని వేస్తారు. ఆరోజు పలు కారణాలవల్ల పోలియో చుక్కలు వేసుకోలేకపోయిన పిల్లలకు వారి ఇళ్లకు మరసటి రెండు రోజులు ప్రత్యేక వైద్య బృందాలు వెళ్లి.. చుక్కలు వేస్తాయి. మెడికల్ అధికారులు, ఫార్మసిస్టులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతరులు, నేషనల్ ఇమ్యునైజేషన్ డే కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే సదరు జిల్లాలోని మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూడా పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొంటారు 5 ఏళ్లలోపు ఇంటిలోని పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తే "P" గుర్తుతోనూ, ఏ చిన్నారైనా మిస్ అయితే "X" గుర్తు వేస్తారు. అన్ని ట్రాన్సిట్ పాయింట్లలో (బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రధాన ఆస్పత్రులు, మేళాలు, బజార్‌లు మొదలైనవి) ట్రాన్సిట్ బృందాలు పర్యటస్తాయి. గుర్తించిన పలు ప్రాంతాలను (స్లమ్‌లు, సంచార జాతులు, నిర్మాణ స్థలాలు, ఇటుక క్షేత్రాలు, ఇతర వలస ప్రాంతాలు) కవర్ చేయడానికి ప్రత్యేక మొబైల్ బృందాలు పనిచేస్తాయి. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, మేళాలు, బజార్‌లు, పర్యాటక ప్రదేశాలలో ట్రాన్సిట్ బూత్‌లను ఏర్పాటు చేశారు.పల్స్ పోలియో కార్యక్రమాల నిర్వహణ కోసం రూ. 6.20 కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. వ్యాక్సిన్ తరలింపు, బూత్ ల ఏర్పాటు, సిబ్బందికి శిక్షణ, ఇన్సెంటివ్ చెల్లింపు, మౌలిక సదుపాయాలు, ప్రచార కార్యక్రమాలు, ఇతర అవసరాలకు కలిపి రూ. 6.20 కోట్ల వరకు ఖర్చు పెడుతున్నారు. ఇందులో కొంత మొత్తాన్ని జిల్లాలకు నేరుగా పంపించారు.2014, మార్చినాటికి భారత్ పోలియో రహిత దేశంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్( WHO ) ఇప్పటికే ప్రకటించింది. అయితే పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో ఇంకా పిల్లలపై వైల్డ్ పోలియో వైరస్ వ్యాప్తి ప్రభావం ఉండొచ్చన్న ఉద్దేశంతో ప్రపంచ వ్యాప్తంగా దీని నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఈ వైరస్ అక్టోబర్,2025లో జర్మనీకి వ్యాప్తి చెందింది. ఇక మన రాష్ట్రం విషయానికొస్తే 2008, జులైలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చివరి పోలియో కేసు నమోదైంది. భారత్ ను పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు గాను ఇండియా ఎక్స్‌పెర్ట్ అడ్వయిజరీ గ్రూప్(IEAG) చేసిన సిఫారసుల మేరకు 1995 నుంచి నేషనల్ ఇమ్యునైజేషన్ డే(పల్స్ పోలియో దినం) కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తూ వస్తున్నారు.

## బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు



**జిల్లా ఎస్పీ శ్రీ వి. విద్యాసాగర్ నాయుడు**

**సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే బైండోవర్ చర్యల ప్రధాన ఉద్దేశం : జిల్లా ఎస్పీ**

మచిలీపట్నం/ క్రైమ్ ప్రజాభూమి ప్రతినిధి

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు భంగం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులు, తరచూ నేరాలకు పాల్పడు తున్న నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, గొడవలు, దాడులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వారి పట్ల చట్టప్రకారం బైండోవర్ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ శ్రీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ తెలిపారు.విలేక రుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, బైండోవర్ అనేది ఒక శిక్ష కాదని, వ్యక్తి తన సత్ప్రవర్తనను కొనసాగిస్తూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు చట్టం కల్పించిన ఒక ముందస్తు నివారణ చర్య అని పేర్కొన్నారు. సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట బాండ్ అమలు చేయించబడుతుందని, నిర్ణయించిన కాలంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని తెలిపారు.

జిల్లాలో 2026 జనవరి నుండి ఇప్పటి వరకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 1,997 మంది ముద్దాయిలను సంబంధిత మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల ఎదుట హాజరుపరచి బైండోవర్ చర్యలు చేపట్టడం జరిగింది.అయితే, బైండోవర్‌లో ఉన్నప్పటికీ 18 మంది ముద్దాయిలు మళ్లీ ఇతర నేరాల్లో పాల్గొన్నట్లు గుర్తించామని ఎస్పీ తెలిపారు. వారిని తిరిగి సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల ఎదుట హాజరుపరచగా,

3 గురు ముద్దాయిలకు ఆరు నెలల జైలు శిక్ష విధించగా, వారిని నెల్లూరు జిల్లా జైలుకు తరలించడం జరిగింది. 7 మంది ముద్దాయిలు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ విధించిన జరిమానాను చెల్లించారు.

మిగిలిన 8 మంది ముద్దాయిల కేసులు సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల వద్ద విచారణలో ఉన్నాయి.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారు.

నేరాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో జీవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హెచ్చరించారు.ప్రజల భద్రత, శాంతియుత వాతావరణం, నేరాల నియంత్రణే కృష్ణా జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

## చిత్తూరు మామిడి రైతులకు శాశ్వత పరిష్కారాలు అవసరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

చిత్తూరు జిల్లాలో ముఖ్యంగా తోతాపురి మామిడి రైతులు మార్కెట్‌లో ధరలు భారీగా పడిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.4 చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించడం తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ, ఇది శాశ్వత పరిష్కారం కాదని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఏడాది రైతులు ఇలాం టి సంక్షోభాన్ని ఎదుర్కొంటుండటం ఉద్యానవన రంగంలో నిర్మాణాత్మక సంస్కరణల అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. చిత్తూరు మామి డి పరిశ్రమను విలువ ఆధారిత ఉత్పత్తులు, విభిన్నీకరణ, బ్రాండింగ్, బలమైన మార్కెట్ అనుసంధానంతో అభివృద్ధి చేయాలని పీవీఎన్ మాధవ్ సూచించారు. కేవలం పచ్చి మామిడి విక్రయాలపైనే ఆధారపడకుండా, మామిడి పల్ప్ తయారీ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డీహైడ్రేషన్ కేంద్రాలు, ఎగుమతులకు అనువైన మౌలిక వసతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు.మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల మామిడి సాగును ప్రోత్సహించడంతో పాటు, విజయవంతమైన వ్యవసాయ బ్రాండింగ్ నమూనాలను అనుసరించాలని సూచించారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (FPOలు) మరింత బలోపేతం చేయడం ద్వారా రైతుల బేరసారాల శక్తి పెరిగి, సమిష్టి మార్కెటింగ్ ద్వారా మెరుగైన ధరలు లభిస్తాయని తెలిపారు.చిత్తూరు ఉద్యానవన రంగ దీర్ఘకాలిక అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (MSMEs), ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు మరియు ఇతర భాగస్వాములు కలిసి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు."గిట్టుబాటు ధరలు లేక రైతులు తమ పంటను రోడ్లపై పారబోయాల్సిన పరిస్థితి ఇకపై రాకూడదు. చిత్తూరు మామిడి రైతులకు స్థిరమైన ఆదాయం, లాభదాయకమైన వ్యవసాయం, ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యం కలిగిన మామిడి ఆర్థిక వ్యవస్థను నిర్మించడం మనందరి లక్ష్యంగా ఉండాలి" అని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

వారం 28, జూన్ 2026

# తుని ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలపై ఫోకస్

## ఎమ్మెల్యే యనమల దివ్య

ప్రజాభూమి ప్రతినిధి - తుని

తుని ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు అందుకు తగిన సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే శ్రీమతి యనమల దివ్య తెలిపారు. తుని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించబడింది. సమావేశంలో అజెండా లోని అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంతో పోలిస్తే ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, అలాగే పారిశుద్ధ్యం సహా ఇతర సౌకర్యాల్లో కూడా గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని పేర్కొన్నారు. ఆసుపత్రికి ఇంకా అవసరమైన మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె, కార్పొరేట్ సంస్థల సీఎస్ఆర్ నిధుల ద్వారా మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. దక్కన్ కెమికల్ యాజమాన్యం తమ సూచన మేరకు ఆసుపత్రి మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ నిధులతో అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో తుని ఏరియా ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందని ఎమ్మెల్యే యనమల దివ్య వెల్లడించారు. ఈ సమావేశంలో టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి, మండల టీడీపీ అధ్యక్షురాలు తామరాన వరలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్, అభివృద్ధి కమిటీ సభ్యులు చోడిశెట్టి త్రిమూర్తి స్వామి, తటవర్తి రాజా, పూడి సత్యవేణి, రాజాల నిర్మల తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా ప్రారంభించిన ఎమ్మెల్యే ముప్పిడి

## 58 మందికి ఉద్యోగాలు



ప్రజాభూమి ప్రతినిధి - తాళ్లపూడి

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొవ్వూరు మరియు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ తూర్పుగోదావరి జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఉపాధి కార్యక్రమాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడడంతో పాటు దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాబ్ మేళాలో 16 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 113 మంది అభ్యర్థులు హాజరుకాగా, వారిలో 58 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, మద్దిపాటి శివరామకృష్ణ, కరుటూరి సతీష్, ఎం. రామకృష్ణ, ముత్యాల రావు, జయరాజు, ఎ పి ఎస్ ఎస్ డి సి ప్రతినిధులు మురళి, జేఈఓ శిరీష, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పొట్ట కొట్టి పెత్తందారులకు దోచిపెడుతున్న పాలకులు



ప్రజాభూమి ప్రతినిధి - వేలేరుపాడు

దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలైనా నేటికీ పేదవాడు పేదవాడు గానే ఉంటున్నారని, పాలక వర్గాలు పెట్టుబడిదారులకు పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయలు అనేక రాయితీలు కల్పించి వంద, వేల ఎకరాల భూములు అప్పనంగా కట్టబెడుతున్నారని, సామాన్య మనిషి బ్రతకడానికి చారెడు భూమి ఇవ్వాలనే ఆలోచన పాలకవర్గాలకు లేదని, అడవికి మూలం ఆదివాసులు.. అడవిని కాపాడే ఆదివాసి లు సాగు చేసే పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా, వారి హక్కులను కాలరాస్తున్నారని, పోడు సాగులో క్విడ్ ప్రోకో పద్ధతి కొనసాగుతుందని, ఆర్థిక వసూళ్లలో పైరవీకారుల, మధ్య దళారుల అక్రమాలను అరికట్టాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నత అధి కారులను కోరుతుంది. పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, బి సత్యనారాయణ, కట్టం వీరస్వామి, పోలవరం పార్టీ డివిజన్ కార్యదర్శి కట్టం ముత్యాలరావు, పి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి ఎస్కేమున్ని పాల్గొన్నారు .

# ఎరువుల దుకాణం నుండి పక్కదారి పడుతున్న యూరియాకు స్పందించిన అధికారులు

- 15 రోజులు ఆ దుకాణదారుడు లైసెన్స్ రద్దు
- దుకాణానికి నోటీసులు అంటించిన అధికారులు



ప్రజాభూమి ప్రతినిధి - కూనవరం

మండలంలోని పోచవరం పంచాయతీ పోచవరం కాలనీకి చెందిన జనశక్తి ఫెర్టిలైజర్స్ దుకాణం నుండి యూరియా బస్తాలు అక్రమ రవాణా జరుగుతుందని మన పత్రికలో ప్రచురించడం జరిగింది. దానిపై వ్యవసాయ శాఖ ఏడి ఏవో అధికారులు స్పందించి ఆ దుకాణం తనిఖీ నిమిత్తం వెళ్ళగా అతను ఆ దుకాణ యాజమాన్యం తన ఊర్లో లేనని తాను రావడానికి కొన్ని రోజులు సమయం పడుతుంది అని సర్వాణి (ఫోన్ )ద్వారా అధికారులకు తెలియజేయడం జరిగింది మీకు గుమస్తాని పంపించమని అడగగా అతడు కూడా ఊరిలో లేడని సదరు దుకాణ యజమానదారుడు తెలియచేశాడు సంబంధిత అధికారులు సంబంధిత పంచాయతీ విఆర్ఓ ద్వారా పంచనామా నిర్వహించి వెంటనే ఆ దుకాణాన్ని 15 రోజులు పాటు సస్పెన్షన్ చేశారు ఆదేశాలు వచ్చేవరకు ఆ దుకాణాన్ని తెరవడానికి వీల్లేదని తమ దగ్గర ఉన్న మిగిలి ఉన్న ఎరువులు పురుగుమందు రికార్డును కార్యానికి సమర్పించాలని సదరు దుకాణదారుడు కి తెలియజేస్తూ దుకాణానికి నోటీసులు అంటించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎటపాక ఇంచార్జ్ ఏఓ దుర్గా రమేష్ తేజస్విని వీఆర్ఓ ఆంజనేయులు పాల్గొన్నారు..

# కావాలని సొసైటీ మీద బురద జల్లుతున్న ఎరువుల దుకాణాల యాజమాన్యం...?

ప్రజాభూమి ప్రతినిధి - కూనవరం



మండలంలోని ఎరువుల దుకాణదారులు సరిగ్గా ఎరువులు రైతులకు అందకుండా పక్కదారి పట్టిస్తున్నారు సొసైటీ నుండి ప్రతి ఒక్క రైతుకు వారి ఆధార్ కార్డు ద్వారా ప్రతి సంవత్సరం అందించటం జరుగుతుంది గత ప్రభుత్వం కంటే మాకూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత యూరియా బస్తాలు రైతులందరికీ సక్రమంగా అందుతున్నాయి కావాలని కొంతమంది కూటమి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండల కేంద్రానికి దూరంగా తెలంగాణ రాష్ట్రానికి దగ్గరగా ఒక చిన్న ఊరిలో ఒక దుకాణాన్ని ఏర్పాటు చేసుకొని అక్కడికి వచ్చిన ఎరువు (యూరియా) బస్తాలన్నిటిని కూడా తెలంగాణ రాష్ట్రానికి తరలించడం జరుగుతుంది, అలా తరలిస్తున్న యూరియా బస్తాలను మీడియా మిత్రులు బయట పెట్టడంతో తను ఏం చేయాలో అర్థం కాక మా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎరువులు యూరియా అందిస్తూ ఉంటే మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని రైతులకు సకాలంలో ఎరువుల దుకాణాలను నుండి ప్రతి ఒక్క రైతుకి సక్రమంగా యూరియా అదేవిధంగా చూడాలని యూరియా పక్కదారి పట్టిస్తున్న ఎరువుల దుకాణదారుల లైసెన్స్ వెంటనే తొలగించాలని అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను అలాగే పై అధికారులు కూడా మా సొసైటీ తరపున రైతు సోదరుల తరపున మేము కోరుకుంటున్నాము అని సొసైటీ చైర్మన్ తోటకూరి వెంకటేశ్వరరావు తెలియజేశారు.

# ఉద్యోగుల పునర్విభజన జీవోలో అసంబద్ధాలను సవరించాలి

## ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ డిమాండ్



ప్రజాభూమి ప్రతినిధి, - తాళ్లపూడి

నూతన జిల్లాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 ముసాయిదా ప్రకారం ఉద్యోగుల విభజనలో ఉన్న అసంబద్ధతలను వెంటనే సవరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ జేఏసీ తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నివాసం ఉండి ఉద్యోగం పొందిన కొవ్వూరు డివిజన్ ఉద్యోగులు 2022 జిల్లాల పునర్విభజనలో తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించబడి ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 ముసాయిదాలో వీరిని తూర్పుగోదావరి జిల్లా ఉద్యోగులుగా పరిగణించి అదే జిల్లాకు కేటాయించాలని, లేదా తూర్పుగోదావరి జిల్లాను ఆప్షన్‌గా ఎంచుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడంతో పాటు జీవోలోని అసంబద్ధతలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ప్రభుత్వానికి తమ గోడును వినిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సనపల రాజశేఖర్, వెంకటరమణ, జిల్లా సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు గెద్దం గణేష్, పాలూరి అప్పలనాయుడు, వీర్వోల సంఘ నాయకులు ప్రకాష్, నాగేశ్వరరావు, విజయ, లీలావతి, సంజీవరావు, పోలీసు శాఖ ప్రతినిధి వేగిలియా తదితరులు పాల్గొన్నారు.

# ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

- పీజీఆర్ఎస్‌కు హాజరైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ
- ప్రత్తిపాడు పీజీఆర్ఎస్ కు 79 అర్జీలు



ప్రజాభూమి ప్రతినిధి - ప్రత్తిపాడు

రాష్ట్ర ప్రభుత్వ సూచనలు మేరకు "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" కార్యక్రమం వరుసగా మూడో వారం శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయిలో ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రత్యక అధికారి ఏ.శ్రీనివాసరావు తదితరులతో కలిసి హాజరై, ప్రత్తిపాడు నియోజకవర్గం చుట్టుపక్కల ప్రజల నుంచి నేరుగా వినతులను అర్జీలను స్వీకరించారు. పింఛన్లు, ఇళ్ల స్థలాల మంజూరు, సధరం సర్టిఫికెట్, భూ రికార్డులు ఆన్ లైన్ లో నమోదు, రీ సర్వే, పంట నష్టం, సీసీ రోడ్లు, డ్రైన్స్, మురుగు కాలువలు, పారిశుద్ధ్యం, స్మశాన వాటికల్లో షెడ్ ఏర్పాటు, విద్యుత్తు వంటి అంశాలపై మొత్తం 79 అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు సూచిస్తూ నిర్దిష్ట సమయంలోపు తగిన పరిష్కారాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వారం ప్రజల నుంచి అందిన అర్జీలకు వచ్చే శుక్రవారం నాటికి పరిష్కారించాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గత రెండు వారాలలో నమోదైన అర్జీలు పరిష్కార పురోగతిని జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రకారం "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండ జిల్లాలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కరించునేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామ స్థాయిలో ప్రజల నుంచి అందిన అర్జీలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు అవసరమని చర్యలు చేపట్టాలని, ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు తహసీల్దార్ సూర్య ప్రభ, ఎంపీడీవవో కుమార్ బాబు, ఇతర మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీలో ఘనంగా 6వ స్నాతకోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి - నూజివీడు

ఆర్జీయూకేటీ ఆంధ్రప్రదేశ్ 6వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. 2022, 2023, 2024, 2025 విద్యాసంవత్స రాలలో ఆంధ్రప్రదేశ్ ఆర్జీయూకేటీ పరిధిలో గల నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు శ్రీకాకుళం ప్రాంగణాలలో బీ.టెక్ మరియు ఎం.టెక్ చదివిన విద్యార్థినీ విద్యార్థులకు పట్టా ప్రదానోత్సవం జరిగింది. పైన పేర్కొన్న విద్యా సంవత్సరాలలో బీ.టెక్ చదివి టాపర్స్‌గా నిలిచిన 26 మంది విద్యార్థినీ విద్యార్థులకు, ఎం.టెక్ చదివిన 8మంది విద్యార్థినీ విద్యార్థులకు ముఖ్య అతిథి, భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ సభ్యులు ఆచార్య గోబర్ధన్ దాస్, ఆర్జీయూకేటీ కులపతి ఆచార్య కొత్త మధుమూర్తి, ఉప కులపతి ఆచార్య మద్దాలి లక్ష్మీ నారాయణ రావు చేతుల మీదుగా పట్టా ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మరియు భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ సభ్యులు ఆచార్య గోబర్ధన్ దాస్ మాట్లాడుతూ "ప్రతిభావంతమైన గ్రామీణ యువతకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడం మరియు నిజమైన విద్యా సమానత్వాన్నిప్రోత్సహించడం అనే దృష్టితో ఈ సంస్థ స్థాపించబడింది. మీరు విభిన్న నేపథ్యాల నుండి ఈ సంస్థలో ప్రవేశించి, నేడు సమాన స్థాయిలో బలమైన ఇంజినీరింగ్ పునాదులతో పట్టభద్రులవు తున్నారు. భారతదేశం ప్రస్తుతం ఒక మార్పు దశలో ఉంది. నీప్-2020 బహు శాఖల అభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ సంప్రదాయ విద్యా విభజనలను తొలగిస్తోంది. నేటి సమస్యలు పరిష్కరించడానికి ఇంజినీరింగ్, సైన్స్ మరియు హ్యూమానిటీస్ కలిసిన సమగ్ర ఆలోచన అవసరం. వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించడానికి మీరు కేవలం ఉద్యోగార్థులు కాకుండా ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు మరియు సమస్య పరిష్కారకులుగా మారాలి. ఈ రోజు పట్టభద్రు లలో దాదాపు రెండు- మూడవ వంతు మహిళలు ఉండటం నాకు ప్రత్యేక గర్వకారణం. ఇది భారతదేశం యొక్క సమగ్రత మరియు మహిళా సాధికారత పట్ల ఉన్న కట్టుబాటును ప్రతిబింబిస్తుంది. ప్రతి మహిళా ఇంజినీర్ తన కుటుంబానికి, సమాజానికి మరియు దేశానికి పురోగతిని తీసుకు వస్తుంది. మీ వృత్తి జీవితంలో విజయానికి కేవలం సాంకేతిక నైపుణ్యం మాత్రమే కాకుండా మానసిక సమతుల్యత కూడా అవసరం. మన సంప్రదాయ జ్ఞానం మరియు యోగ వంటి సాధనాలు ఈ వేగవంతమైన సాంకేతిక ప్రపంచంలో ఏకాగ్రత, సహనశక్తి మరియు స్థిరత్వాన్ని అందిస్తాయి. ఇంజినీర్లుగా మీ బాధ్యత ఉద్యోగం పొందడానికే పరిమితం కాదు. కంప్యూటింగ్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ లేదా ఇతర రంగాల్లో మీరు పని చేసినా, వాతావరణ మార్పు, శక్తి, ఆరోగ్యం మరియు గ్రామీణ అభివృద్ధి వంటి సమస్యలకు స్థిరమైన, సమానమైన మరియు సమాజానికి




ఉపయోగపడే పరిష్కారాలనురూపొందించడం మీ కర్తవ్యం. ముగింపుగా, మీ పట్టా కేవలం ఒక సాధన మాత్రమే కాదు, ఒక బాధ్యత కూడా. మీ జ్ఞానాన్ని లక్ష్యంతో, నైతికతతో మరియు మానవత్వంతో ఉపయోగించి మెరుగైన భవిష్యత్తును నిర్మించండి" అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ మరియు ఆర్జీయూకేటీ ఆంధ్రప్రదేశ్ కులపతి ఆచార్య మధుమూర్తి మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఆర్జీయూకేటీ నేడు రాష్ట్రానికి, దేశానికి ప్రతిభావంతులైన ఇంజినీర్లను అందిస్తున్నదని ఆయన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐఅ ఎం.ఎల్)లో బీటెక్, మైనర్ కోర్సులు, కొత్త ఎం.టెక్ కోర్సులను ప్రారంభించడంతో పాటు ప్రయోగశాలలు, డిజిటల్ లెర్నింగ్, హాస్టళ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.20 కోట్లకు పైగా వ్యయం చేసినట్లు వెల్లడించారు. దేశంలోనే ప్రభుత్వ విద్యాసంస్థలలో అత్యధికంగా 11,539 ఎన్పీటీఈఎల్ సర్టిఫికేషన్లు సాధించడం, 539 మంది విద్యార్థులు దేశవ్యాప్తంగా టాప్-1 శాతంలో నిలవడం విశేషమని పేర్కొన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఆర్జీయూకేటీ విశేష పురోగతి సాధించిందని, ఐబీఎం నిర్వహించిన క్విజిట్ ఫాల్ ఫెస్ట్-2025కు ప్రపంచంలోని ఎంపికైన 11 ఉన్నత విద్యాసంస్థల్లో ఆర్జీయూకేటీ చోటు దక్కడం విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను మరింత పెంచిందన్నారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్లలో జాతీయ క్వాంటమ్ మిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో విశ్వవిద్యాలయం మొత్తం 84 శాతం ప్లేస్మెంట్లు నమోదు చేసిందని, 557 ఉద్యోగ అవకాశాలు లభించాయని, అత్యధికంగా రూ.28 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ సాధించారని పేర్కొన్నారు. కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జికల్ విభాగాల్లో 100 శాతం ప్లేస్మెంట్లు నమోదయ్యాయని, 75 ప్రముఖ సంస్థలు క్యాంపస్ నియామకాలు నిర్వహించాయని వెల్లడించారు. అలాగే 800 మందికి పైగా విద్యార్థులు గేట్ అర్హత సాధించగా, పలువురు ఐఐటీలు, ఎన్ఐటీలలో ఉన్నత విద్యకు ఎంపికయ్యారని తెలిపారు. మహిళా విద్యార్థుల సాధికారత కోసం 'నారీ శక్తి' కార్యక్రమం ద్వారా యూపీఎస్సీ, గేట్ శిక్షణకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నట్లు వివరించారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు నిజాయితీ, విలువలు, సామాజిక బాధ్యతను జీవితాంతం పాటించాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమ జ్ఞానాన్ని వినియోగిస్తూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని" విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య మద్దాలి లక్ష్మీ నారాయణరావువిశ్వవిద్యాలయం వార్షిక నివేదికను ప్రకటిస్తూ "నాణ్యమైన విద్య, వినూత్న బోధన, ఫలితాధారిత విద్యా విధానం నైపుణ్యాభివృద్ధి ద్వారా మా విశ్వవిద్యాలయం విద్యా ప్రగతిలో నిరంతరం ముందుకు సాగుతోంది. మా విద్యార్థులు NPTEL సర్టిఫికేషన్లు, ఇంటర్న్‌షిప్లు, ప్రముఖ సంస్థల్లో క్యాంపస్ నియామకాలలో విశిష్ట విజయాలు సాధించారు. మహిళా సాధికారత ఆర్జీయూకేటీ ప్రత్యేకతల్లో ఒకటి. మా విద్యార్థినులు విద్య, పరిశోధన, ఆవిష్కరణ, క్రీడలు మరియు నాయకత్వ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయానికి గౌరవాన్ని తీసుకు వచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, మెరిట్ పతకాలను ప్రదానం చేయడం మాకు ఎంతో గర్వకారణం. విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిరంతర సహకారం అందించిన అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు మరియు పరిశ్రమల భాగస్వాములు కావడం ఎంతో సంతోషదాయకం" అని పేర్కొన్నారు. ఈ 6వ స్నాతకోత్సవంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ మరియు ఒంగోలు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ లతో పాటు నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య గోపాలరాజు, శ్రీకాకుళం డైరెక్టర్ ఆచార్య గిరిధర్ మద్రాస్, ఇడుపులపాయ డైరెక్టర్ ఆచార్య గెద్దం విజయప్రకాష్, సెంట్రల్ డీన్ దువ్వూరి శ్రావణి, సెంట్రల్ ఫైనాన్స్ ఆఫీసర్ డా. నాగార్జున దేవి, ఈఐటీపీ డీన్ శ్యాం, సెంట్రల్ ఇవాల్యుయేషన్ డీన్ రియాజ్, నాలుగు క్యాంపస్‌లకు చెందిన అకడమిక్ డీన్స్, ఏవో డా. లక్ష్మణరావు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్స్ డా. రాజేష్, డా. దుర్గాభవానీ, చీఫ్ వార్డెన్ సురేష్ బాబు ఇంకా అధ్యాపకులు పాల్గొన్నారు.

# కాకినాడ రూరల్‌లో జీడీడీపీ-జీఎండీపీ కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ విజయవంతం






ప్రజాభూమి ప్రతినిధి – కాకినాడ

స్వర్ణాంధ్ర ఏ2047 విజన్ సాధనలో భాగంగా గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీడీపీ), గ్రాస్ మండల్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎండీపీ) అంశాలపై కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం శనివారం కాకినాడ రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ముఖ్య అతిథిగా హాజరై అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మల్లి బాబు మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర ఏ2047 లక్ష్యాల సాధనకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, ఖచ్చితమైన డేటా ఆధారంగా ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ఉన్న అభివృద్ధి అవకాశాలను గుర్తించి, వాటిని కార్యాచరణలోకి తీసుకురావడంలో ప్రతి అధికారి కీలక పాత్ర పోషించాలని ఆయన తెలిపారు. అనంతరం ఈ నెల 28, ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్డీవో పేర్కొన్నారు. అర్హులైన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా అందేలా వైద్య, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, గ్రామలోని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సర్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, సంబంధిత అధికారులు తమ పరిధిలో కేటాయించిన ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ సర్ ప్రక్రియను బీఎల్వోలు బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అధాకారులు సమన్వయం, సమయపాలనతో పనిచేసి ఎన్నిల సంఘం లక్ష్యాలను విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ఈ శిక్షణలో పహలే ఇండియా ఫౌండేషన్ (పీఐఎఫ్) ప్రతినిధులు జీడీడీపీ, జీఎండీపీ భావనలు, ప్రాథమికోన్నత, ద్వితీయ, సేవా రంగాల అభివృద్ధి, ఆర్థిక ప్రొఫైలింగ్, అభివృద్ధి అవకాశాలు, శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో అధికారులు తమ సందేహాలను నివృత్తి చేశారు చేసుకొని, సూచనలు అందించగా, ఫీడ్‌బ్యాక్ సేకరించి శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, విద్య, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ, గృహనిర్మాణ, గణాంక శాఖ అధికారులు, యంగ్ ప్రొఫెషనల్స్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రిత్విక మృతి ఘటనపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ కార్యాలయం ద్వారా ఏలూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రభుత్వానికి వినతి



ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా

వైఎస్ఆర్ కడప జిల్లా లింగాల మండలంలో విశ్వబ్రాహ్మణ కుటుంబానికి చెందిన చిన్నారి రిత్విక అనుమానాస్పద మృతి ఘటనపై సమగ్ర, నిష్పాక్షిక దర్యాప్తు జరిపి, దర్యాప్తులో బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏలూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం కన్వీనర్ అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ) మాట్లాడుతూ, అమాయక చిన్నారి మృతి రాష్ట్ర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ కేసులో ఎలాంటి ఒత్తిళ్లు, ప్రభావాలకు తావులేకుండా పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులను చట్టం ముందు నిలబెట్టి బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘ నాయకులు యలబాక కృష్ణ, అనుపోజు త్రినాథ్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఏలూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : డాక్టర్ శిరీష

ప్రజాభూమి ప్రతినిధి – చంద్రగిరి



దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా, ఐదు సంవత్సరాల లోపు వయసు ఉన్న ప్రతి చిన్నారికీ తప్పనిసరిగా పోలియో నివారణ రెండు చుక్కల మందును వేయించాలని డాక్టర్ శిరీష తెలిపారు. చంద్ర గిరి మండలం పరిధిలో గల డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో సిహెచ్ సి చంద్రగిరి నుంచి టవర్ క్లాక్ వరకు పల్స్ పోలియో కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ పౌర సమాజానికి, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నాము. "రెండు చుక్కల మందు – జీవితానికి రక్షణ" అనే నినాదంతో, పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ఐదేళ్ల లోపు పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచి, వారిని పక్షవాతం (పోలియో) బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. కాబట్టి, ఈ సమాచారాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి, మీ చుట్టుపక్కల ఉన్న వారందరినీ అప్రమత్తం చేస్తూ, నేడు ఉదయాన్నే మీ పిల్లలను పోలియో బూత్‌లకు తీసుకెళ్లి ఈ రక్షణ చుక్కలను వేయిం చి, వారి భవిష్యత్తును సురక్షితం చేయవలసిందిగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ఈశ్వర య్య శివరాజ్ చింతామణి వాసుదేవ వెంకటేష్ తో పాటు ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మోడరన్లో సందడి చేసిన నోస్ ఆర్టిస్ట్ రాంబాబు

ప్రజాభూమి ప్రతినిధి – రామచంద్రపురం



నాసికాకళతో ప్రపంచవ్యాప్తంగా అరుదైన గుర్తింపు పొందిన ప్రముఖ చిత్రకారుడు, విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఫౌండర్ అండ్ సీఈవో సత్యవోలు రాంబాబు శనివారం మోడరన్ కాలేజీలో ప్రత్యేక డెమో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తన ముక్కుతో ఈశ్వరుని చిత్రాన్ని క్షణాల వ్యవధిలో చిత్రీకరించి ఆహుతులను అబ్బురపరిచారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుండి చిత్రకళపై ప్రత్యేక ఆసక్తి ఉండేదని పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాదులో సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ పేరుతో విద్యాసంస్థ నిర్వహిస్తూ లక్షలాదిమంది విద్యా ర్థులను నిష్ణాతులుగా రూపొందించి నట్లు తెలిపారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలలో విశేష ప్రతిభా పాటవాలుకలిగిన వారికి, అత్యుత్తమ సేవలు అందిస్తున్న వారికి విశ్వగురు ది వరల్డ్ రికార్డ్స్ పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ ప్రపంచం లోనే అత్యంత అరుదైన కళాకారుడైన రాం బాబు మోడరన్ విద్యాసంస్థకు విచ్చేయడం ఆనందంగా ఉందన్నారు. గతంలో విశ్వగురు అవార్డును వివిధ ప్రముఖుల చేతుల మీదుగా తాను అందుకున్న సందర్భాన్ని రావు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పట్టుదలతో శ్రమించి ప్రత్యేకమైన గుర్తింపు పొందిన రాంబాబు నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి వెంకటేశ్వర్లు,ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సిహెచ్ రాజేష్ మోడరన్ విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం పట్టణంలో బిఎల్ఎల్ పనితీరును పరిశీలించిన వైసిపి ఇంచార్జ్ సూర్యప్రకాశ్



ప్రజాభూమి ప్రతినిధి – రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలోని వైసిపి ఇం చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ చింతపల్లి సూరన్న నగర్, స్టీల్‌వెల్‌పేట, రామదుర్గా వీధి వార్డుల్లో పర్యటించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎల పనితీరును పరిశీలించారు. ఈ మేరకు శనివారం ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షిస్తూ, ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిం చాలని, అర్హులైన ప్రతి ఓటరిని నమోదు చేయడంతో పాటు అనర్హుల వివరాలను కూడా సక్రమంగా ధృవీకరించాలని బిఎల్ ఎలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ గాథం శెట్టి శ్రీదేవి, కన్వీనర్ గాదం శెట్టి శ్రీధర్, మల్లిడి సాయిలక్ష్మి, మట్టా బాబులు, కోటిపల్లి శివాజీ, కుడుపూడి భీమశంకరం , పార్టీ కార్యకర్తలు, బిఎల్ఎలు పాల్గొన్నారు.

# భూములు ఇవ్వకపోవడంపై ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తుందంటూ రైతుల ఆవేదన

- ఈ నేపథ్యంలో ఇవాళ పెనుమాక గ్రామానికి వెళ్లిన సీఆర్డీయే రైతు పరిరక్షణ కమిటీ
- ఉండవల్లి గ్రామంలో వైయస్సార్సీపీ నాయకులు, సీఆర్డీయే రైతు పరిరక్షణ కమిటీపై దాడి చేసిన టీడీపీ కార్యకర్తలు
- ఈ నేపథ్యంలో తాడేపల్లి వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సీఆర్ డీ ఏ రైతు పరిరక్షణ కమిటీ
- భూముల చుట్టూ కందకాలు తవ్వడం అరాచకం
- బాధిత రైతుల కోసమే మా పర్యటన

ప్రజాభూమి ప్రతినిధి – తాడేపల్లి

ప్రభుత్వానికి అస్సలు అవసరం లేకపోయినా ఉండవల్లి, పెనుమాక ప్రాంతాల్లో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవడం అత్యంత దుర్మార్గం అని సీఆర్డీయే రైతు పరిరక్షణ కమిటీ నేతలు అన్నారు. ఈ సందర్భంగా సీఆర్డీయే రైతు పరిరక్షణ కమిటీ నేతలు మీడియాతో మాట్లాడుతూ తమ మాట వినని రైతుల భూముల చుట్టూ 20 నుండి 30 అడుగుల లోతులో కందకాలు (చెరువుల పేరుతో) తవ్వుతూ, రైతులు పంటలు వేసుకోకుండా అరాచకానికి పాల్పడుతున్నారు. ప్రభుత్వ వేధింపులకు గురైన రైతులు వైఎస్ జగన్ ని కలిసి బాధలు చెప్పుకున్నారు.రోడ్డు వరకు భూమి ఇచ్చేయండి, మిగతా భూమి కోసం న్యాయపోరాటం చేద్దాం" అని వైఎస్ జగన్ గారు రైతులకు ధైర్యం చెప్పారు. వారి సమస్యల పరిష్కారానికి వైయస్సార్సీపీ లీగల్, పొలిటికల్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే రెండు దఫాలు రైతులతో సమావేశం జరిగింది. ఇవాళ బాధిత రైతుల పిలుపు మేరకు పెనుమాక వెళ్తున్న వైఎస్సార్సీపీ కమిటీపై చంద్రబాబు,లోకేష్‌ల పథకం ప్రకారం.. టీడీపీ గూండాలు ఉండవల్లి సెంటర్ వద్ద మద్యం మత్తులో దారుణంగా దాడికి తెగబడ్డారు. ఉదయం 7:30 గంటల నుంచే బాలకొండ సత్యం అనే వ్యక్తి రౌడీలను పోగేసి దాడికి పురిగొల్పాడు. దాడిలో పాల్గొన్న రాధాకృష్ణ, రామాంజనేయులు, అబ్బాయి మురళి, మోపిదేవి వెంకటరమణారావు లాంటి వారికి అసలు అక్కడ పొలాలే లేవు, వీరెవ్వరూ రైతులు కారు. వైయస్సార్సీపీ నేతల కార్లను ధ్వంసం చేసి, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రుల కార్లను పూర్తిగా ధ్వంసం చేసి నాయకులను అంతమొందించే వ్యూహం రచించారు. స్థానిక డీఎస్పీ రంగంలోకి వచ్చాక రౌడీ మూకలను అదుపు చేయాల్సింది పోయి, ఉద్రిక్తతలను మరింత పెంచి ధ్వంస రచనను ప్రోత్సహించారు. బందోబస్తులో ఉన్న ఒక పోలీస్ కానిస్టేబుల్‌పై రాయి విసరడంతో ఆయన తల పగిలి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. వీటన్నింటికీ సంబంధించిన స్పష్టమైన వీడియో సాక్ష్యాలు మీడియా కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ నేపథ్యంలో రైతు పరిరక్షణ కమిటీ నేతలపై దారుణంగా దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరిపై తక్షణమే హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి. నేతల వాహనాలను ధ్వంసం చేసిన నిందితులను మరియు విధి నిర్వహణలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌ను కొట్టిన రౌడీలను, వారి వెనుక ఉన్న సూత్రధారులను వెంటనే అరెస్ట్ చేయాలి. చంద్రబాబు ప్రభుత్వం ఎన్ని అకృత్యాలు చేసినా, అమరావతి పేరుతో సాగుతున్న అవినీతిని, రైతుల అగచాట్లను ప్రపంచం ముందుకు తెస్తాం. బాధితుల తరపున వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం ఎప్పటికీ ఆపదు.. ప్రభుత్వం చట్టపరంగా భూములు తీసుకుంటే మాకు అభ్యంతరం లేదు. కానీ రాజధాని పరిసర ప్రాంతాల రైతులు వైఎస్ జగన్ ని కలిసి... తాము పూలింగ్ ఇవ్వనందుకు కక్షతో నోటీసులు ఇస్తూ, తమపై ఒత్తిడి తెచ్చి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వైయస్. జగన్ స్పందించి సమస్యల పరిశీలన కోసం, రైతులకు అండగా ఉండేందుకు లీగల్ మరియు పొలిటికల్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు రైతులతో రెండు సార్లు సమావేశమయ్యాయి. మొదటి సమావేశంలో రైతుల కోరిక మేరకు లీగల్ టీమ్ గ్రామాలకు వెళ్లి చట్టపరమైన అంశాలను వివరించగా, రెండో సమావేశంలో పొలిటికల్ టీమ్‌ను గ్రౌండ్ లెవెల్‌కు వచ్చి తమ పరిస్థితిని మీడియాకు, సమాజానికి వివరించాల్సిందిగా రైతులు కోరారు. రైతుల సమస్యలను ప్రాక్టికల్ గా, గ్రౌండ్ లెవెల్ లో తెలుసుకోవడానికి తాము (మాజీ ప్రజా ప్రతినిధులుగా) వెళ్లగా, ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధంగా దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా మా పై ఒక పెద్ద రాయితో దాడి చేసే ప్రయత్నం జరిగితే.. ఆ సమయంలో మధ్యలో అడ్డువచ్చిన ఒక కానిస్టేబుల్‌కు ఆ రాయి తగిలి గాయమై హాస్పిటల్‌లో చేరారు. ఆ రాయి మాలో ఎవరికైనా తగిలి ఉంటే ప్రాణాపాయం జరిగి ఉండేది. నారా లోకేష్ నియోజకవర్గంలోనే ఈ గొడవ జరిగింది. వైయస్సార్సీపీ నేతలు ఎవరిపైనా దాడికి దిగలేదు. టీడీపీ కార్యకర్తలే దాడులకు పాల్పడ్డారు. వైఎస్సార్సీపీని 'గొడ్డలి పార్టీ' అని ప్రచారం చేసిన మీరే.. మా పై దాడి చేశారు. ఎవరిది గొడ్డలి పార్టీ. మీది కాదా మరోవైపు దాడి జరుగుతున్నా.. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. అక్కడ లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని, మమ్మల్ని వెళ్ళవద్దని నివారించారు. అయితే ముందుగానే కార్యక్రమాన్ని ప్రకటించుకుని వెళ్తున్న మేం ఎందుకు ఆగిపోవాలి. పోలీసులు న్యాయం వైపు కాకుండా తెలుగుదేశం కార్యకర్తలకు అనుకూలంగా వ్యవహరిస్తూ మమ్మల్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైయస్సార్సీపీ నాయకులకు రాళ్లు, కర్రలు, ప్లకార్డులు చూపిస్తూ 'గో బ్యాక్ వైఎస్సార్సీపీ' అంటూ అడ్డుకోవడం అన్యాయం. అమరావతి రాజధానిలో రైతుల భూములు లాక్కుంటూ వారిని అవమానిస్తున్నప్పుడు, వారి సమస్యలను అడ్రస్ చేసే హక్కు వైఎస్సార్సీపీకి ఉంది. ఇలాంటి దాడులకు ఒడిగట్టడం ద్వారా రాజకీయాల్లో ఒక దురదృష్టకరమైన ఆనవాయితీని మొదలుపెడుతున్నారు. ప్రభుత్వం, డీఎస్పీ, డీజీపీ, సీఐ అంతా తమ వాళ్లే అన్నట్లుగా అధికార పక్షం వ్యవహరిస్తోంది. ప్రతి కార్యక్రమానికి పోలీసులను అడ్డుపెట్టుకుని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విధానం కాదు. తప్పు చేసిన వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయకపోతే భవిష్యత్తులో పోలీస్ డిపార్ట్మెంట్ సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. నిజానికి దాడుల వెనుక ఉన్నది రైతులు కాదు. నిరసనలు చేస్తూ, రాళ్లు విసిరిన వారు నిజమైన రైతులు కారు. నిజమైన రైతులైతే తమ బాధలు చెప్పుకుంటారు కానీ, ఇలా అడ్డుకోరు. రైతుల ముసుగులో ఉన్నది తెలుగుదేశం పార్టీకి సంబంధించిన గుండాలే. 'డౌన్ డౌన్ వైఎస్సార్సీపీ' అని అరుస్తూ రాళ్లు విసిరారు కాబట్టే వారిని గుండాలు అంటున్నాం. వైఎస్సార్సీపీ నాయకులపై దాడి చేయడం ద్వారా, అమరావతిలో అవినీతి జరుగుతోందని, అందుకే భయపడి అడ్డుకుంటున్నారని ప్రపంచానికి అర్థమవుతోంది. రైతుల సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై జరిగిన ఈ దాడిని




సమాజంలోని ప్రజాస్వామ్యవాదులందరూ పార్టీలకి అతీతంగా ఖండించాలి. మేం తగాదా కోసం వెళ్లలేదు. టీడీపీ నేతలు దాడులు చేయవచ్చు, పోలీసులు మాపై కేసులు పెట్టవచ్చు. కానీ అమరావతిలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా మేం సహించం. ప్రజాస్వామ్య విధానంలో దాడులను ఎదుర్కొంటాం. వైయస్సార్సీపీ గొడ్డలి పార్టీ కాదు. చంద్రబాబు గొడ్డలిని నారా లోకేష్ చేతిలో పెట్టి నాటకం ఆడుతున్నాడు. రాష్ట్రంలో ఏ రైతుకు అన్యాయం జరిగినా వైయస్.జగన్ ఆదేశాల ప్రకారం మేం రైతులకు అండగా ఉంటాం. ఎన్ని దాడులు జరిగినా రైతుల పక్షాన పోరాడుతాం. అక్కడికీ న్యాయం జరగకపోతే మా లీగల్ టీం సహాయంతో రైతులకు అండగా ఉంటూ న్యాయపోరాటం చేస్తాం. టీడీపీ కార్యకర్తలు కానిస్టేబుల్ తల పగలగొట్టారు. దానిపై కేసు పెడతారా? లేదా?, లేదంటే ఆ కేసు కూడా మా పై వేస్తారా? చూడాలి. మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి లోకేష్ కొందరు జీతగాళ్లను పెట్టుకుని వారి ఆధ్వర్యంలో ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియాలను నడిపిస్తున్నారు. మాపై జరిగిన దాడికి కర్త, కర్మ, క్రియ వాళ్లే.రాజధానికి పొలం ఇవ్వలేదనే కక్షతో తమ పొలాల చుట్టూ కందకాలు తవ్వారని పెనుమాక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ, పరిశీలనకు రమ్మని పిలిస్తేనే మేమంతా వెళ్లాం.అమరావతి ప్రాంతాన్ని మాయం చేయాలనే లోకేష్ కుట్రలు మేం వెళ్తే ప్రజలకు తెలిసిపోతాయనే భయంతోనే ఉలిక్కిపడి మాపై దాడులు చేయించారు. రాజధాని నిర్మాణంపై, ఇక్కడి రైతులకిచ్చిన హామీలపై ఎన్నిసార్లు ప్రశ్నించినా ఈ కూటమి ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి సమాధానం లేదు. గతంలో మంగళగిరి నియోజకవర్గంలో ఏనాడూ ఇలాంటి అరాచక సంస్కృతి లేదు; లోకేష్ తన అనుయాయులతో చేయించిన ఈ దాడి అత్యంత దుర్మార్గమైనది. మాపై దాడులు చేసి భయపెట్టాలని చూస్తే లొంగిపోయేది లేదు; రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అన్యాయాలను ప్రజల ముందుకు తీసుకురావడాన్ని ఎవరూ ఆపలేరు. పోలీసుల కళ్లముందే రెండు కార్లను ధ్వంసం చేస్తున్నా, రైతులను పరామర్శించడానికి వెళ్తున్నామని చెప్పినా పోలీసులు పట్టించుకోలేదు; ఇదే తీరు కొనసాగితే ప్రజలు త్వరలోనే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయం. అమరావతి రైతు పరిరక్షణ కమిటీ పేరుతో అమరావతి రైతుల ఆక్రందనలు, బాధలు విన్న వైఎస్ జగన్ వారి రక్షణ కోసం వైయస్సార్సీపీ తరపున ఈ కమిటీని ఏర్పాటు చేశారు. బాధిత రైతుల పిలుపు మేరకు, ముందే ప్రకటించి వారి గ్రామాల్లోని కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు వైయస్సార్సీపీ కమిటీ వెళ్ళింది. పెనుమాక, ఉండవల్లి పర్యటనలో పోలీసుల ముందే టీడీపీ కార్యకర్తలు, మట్టి–ఇసుక మాఫియా ముఠా సభ్యులు రాళ్లు, కర్రలతో దారుణంగా దాడికి తెగబడ్డారు. మాపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేసిన వారెవ్వరూ అసలు రైతులు కారు; వారంతా మద్యం మత్తులో ఉన్న టీడీపీ గూండాలు, రౌడీ మూకలే. విధి నిర్వహణలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌పై రాయి వేసి తల పగలగొట్టారు.. ఈ హత్యాయత్నాలకు, విధ్వంసానికి చంద్రబాబు, లోకేష్, స్థానిక డీఎస్పీ, సీఐలదే పూర్తి బాధ్యత. అమరావతిని తమ సొత్తుగా భావిస్తూ దాడులతో భయపెట్టాలని చూస్తే వైయస్సార్సీపీ లొంగదు.. రైతుల బాగు కోసం, ఇచ్చిన హామీల అమలు కోసం కూటమి ప్రభుత్వ మెడలు వంచుతాం. భవిష్యత్తులో అమరావతిలోని ప్రతి ఒక్క రైతును వైయస్సార్సీపీ రైతు పరిరక్షణ కమిటీ ఖచ్చితంగా కలిసి, వారి తరపున పోరాటాన్ని కొనసాగిస్తుంది. అమరావతిలో రాజధాని పేరుతో కూటమి ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ, భయపెట్టైనా సరే వారి భూములను లాక్కోవాలని చూస్తోంది. రాజధాని ప్రాంతంలో కూటమి ప్రభుత్వం 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలు చేస్తూ, ప్రజలను మరియు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. రైతులపై జరుగుతున్న అన్యాయాలపై వైఎస్ జగన్ గారి సూచన మేరకు, వారికి అండగా నిలిచేందుకు వైయస్సార్సీపీలో "రాజధాని పరిరక్షణ కమిటీ" ఏర్పాటైంది. బాధిత రైతులంతా రెండు దఫాలుగా తాడేపల్లి కేంద్ర కార్యాలయానికి వచ్చి, రాజధాని ప్రాంతంలో తాము పడుతున్న ఇబ్బందులను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల కోరిక మేరకే వారి ఇబ్బందులు తెలుసుకోవడానికి కేవలం పరిరక్షణ కమిటీ, న్యాయవాదుల బృందం మాత్రమే వెళ్తే.. టీడీపీ గూండాలు బరితెగించి దాడులకు తెగబడ్డారు. మట్టి, ఇసుక మాఫియాకు పాల్పడుతున్న అరాచక శక్తులను పోగేసి.. వైయస్సార్సీపీ నేతలపై, వారి కార్లపై కర్రలు, రాళ్లతో దారుణంగా విధ్వంసం సృష్టించారు. కూటమి ప్రభుత్వం చేసే ఇలాంటి దాడులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ భయపడదు; అమరావతి రైతులకు వైఎస్ జగన్, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటారు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణ పరిణామాలు చూసి దేశవ్యాప్తంగా ఉన్న మేధావులు, ప్రజాస్వామ్యవాదులు కూటమి ప్రభుత్వాన్ని ఛీకొడుతున్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని లాకప్ డెత్‌లకు పాల్పడటం అత్యంత ఘోరం. రాజధాని రైతుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి బృందం రైతుల ఆహ్వానం మేరకు పెనుమాక వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరైన పద్ధతి కాదు. అమరావతిని ప్రపంచంలోనే అద్భుతంగా చేస్తున్నామని గొప్పలు చెప్పే చంద్రబాబుకు.. ఆయన ఇంటికి కూతవేటు దూరంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలపై జరిగిన దాడులు కనిపించడం లేదా? అమరావతి పేరుతో సాగుతున్న దోపిడీ, అక్రమాలను వైయస్సార్సీపీ ప్రశ్నిస్తుందనే భయంతోనే మా ప్రతినిధి బృందంపై దాడులు చేయించారు. ఇలాంటి బెదిరింపులకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. రాజధాని ప్రాంతంలోనే కాదు, రాష్ట్రంలో ఎక్కడ ఏ రైతుకు ఇబ్బంది వచ్చినా వారికి అండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ నిలబడుతుంది. కూటమి రెండేళ్ల అరాచక పాలనతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారు. మరలా వైఎస్ జగన్ పాలన ఎప్పుడొస్తుందా అని ప్రజలంతా ఎదురుచూస్తున్నారు, ప్రభుత్వంపై తిరుగుబాటు చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు.